# ప్రజావిముక్తి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక

సంపుటి:6 సంచిక:3 సెప్టెంబర్-డిసెంబర్, 2021

విషయ సూచిక

1. రైతాంగ విజయం
2. దేశ వ్యవసాయ విధానాలు
3. ఉత్పత్తి సంబంధాలలో మార్పులు
4. రగులుతున్న పోడు పోరు
5. కుల వ్యవస్థ పుట్టుక
6. సిద్ధాంత వ్యాసం
7. డాక్టర్ సలహా
8. సీసీ పత్రిక ప్రకటన
9. పెగాసస్
10. పోరాట వార్తలు
11. కా॥ గొంజాలో స్మృతిలో

## భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు, పోలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్‌కు అరుణారుణ జోహార్లు



కామ్రేడ్ శ్రీనివాస్, ఆర్కే, సాకేత్, మధు
ఏ పేరుతో పిలిచిన పలికేటి
కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్
ప్రజల కోసం పోరాడిన ప్రజల మనిషి
పార్టీ పంథాపట్ల అంకిత భావం
ప్రజల పట్ల మానవీయత
మావోయిస్టు మహానీయుడు
ప్రజాసైన్య యోధుడు
రాజకీయ సైద్ధాంతిక మిలటరీ వ్యూహకర్త
గెరిల్లా యుద్ధ నిపుణుడు
ప్రభుత్వ చర్చలపై భ్రమలు లేవని
ప్రజల (పార్టీ) గొంతు వినిపించినవాడు
ఆంధ్ర, నల్లమల్ల, దక్షిణ తెలంగాణ ఏఓబి
ఉద్యమాలకు ఊపిర్లు అందించిన
చిరస్మరణీయుడు
సమాజం మారుతుందని
సమాజ పరిణామ క్రమాన్ని బోధిస్తూ
అంతిమంగా కమ్యూనిజమేనంటూ
కమ్యూనిజాన్ని స్వప్నించినవాడు
కమ్యూనిజం ఆశయం కోసం
సమస్త పీడిత సామాజిక సమూహాల స్వేచ్ఛ కోసం
పరితపించినవాడు
భారత విముక్తి కోసం
తన జీవితాన్ని త్యాగం చేసి
ప్రజల హృదయాలలో
చిరస్థాయిగా నిలిచాడు.




ఫారెస్ట్ ఆఫీసర్లను అడ్డుకుంటున్న ఆదివాసీ మహిళలు





ట్రెంచ్ పనులు చేపట్టిన అటవీ అధికారులు





తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట

వీర వనిత చాకలి ఐలమ్మ



జన మహిళ, అటవీ సిబ్బంది నడుమ తోపులాట దృశ్యం



పనులను అడ్డుకుంటున్న గిరిజనులు



పోడు భూముల్లో కందకాలు తవ్వుతున్న ఫారెస్ట్ సిబ్బంది



నాటో బలగాల వాపస్‌తో తాలిబన్ల చేతుల్లో 85% అఫ్ఘనిస్తాన్





అటవీ అధికారులు, పోడుదారుల మధ్య తోపులాట, ఆసు



ఎఫ్‌బీవో సోడి రాజేశ్‌ను చెట్టుకు బంధించిన గిరిజనులు



గంగారం మండలంలో పోలీసులతో ఘర్షణ





చెల్పూర్‌లోని కేటీపీపీ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



మ్మం జైలు వద్ద నిరసన తెలుపుతున్న ఎల్లన్ననగర్ వాసులు

# మోదీ ప్రభుత్వ మెడలు వంచి సాగు చట్టాలను రద్దు చేయించిన భారత రైతాంగానికి విప్లవ జేజేలు

సామ్రాజ్యవాద, బహుళజాతి కార్పొరేషన్‌ల, భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల ప్రయోజనాలను నేరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సాగు చట్టాల రద్దుకై యేడాది కాలంగా లక్షలాది రైతాంగం దిల్లీలో ధర్నా కొనసాగిస్తూ తుదకు విజయం సాధించారు. తమకు ఎదురు లేదని విర్రవీగుతూ, పార్లమెంటులో తమకు గల మెజారిటీతో తాము ఏమైనా చేయగలమనే అహంతో అత్యంత నిరంకుశంగా 2020 సెప్టెంబర్‌లో రూపొందించిన మూడు సాగు చట్టాలను నవంబర్ 2021 చివరలో జరుగనున్న శీతాకాల సమావేశాలలో ఉపసంహరించుకుంటామనీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ 19 నవంబర్ నాడు ఒక ప్రత్యేక ప్రకటన ద్వార తెలియజేశాడు. ఇది భారత రైతుల పోరాట విజయం. యేడాదికాలంగా దిల్లీలో అనేక కష్టనష్టాలకు ఓర్చుకుంటూ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఉద్యమాన్ని కొనసాగించిన అన్నదాతలకు దేశం మొత్తం అండగా నిల్చింది. విదేశాలలోని అనేక శక్తులు, సంస్థలు భారత రైతాంగానికి తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. ఆ రకంగా ఈ విజయం దేశ ప్రజలది. నిరంకుశ సాగుచట్టాల రద్దుకై యేడాది కాలంగా పోరాడుతూ దాదాపు 700కు పైగా రైతులు అసువులు బాసారు. వారందరికి ముందుగా తెలంగాణ రాష్ట్ర కమిటీ విప్లవ జోహార్లర్పిస్తోంది.

మన దేశ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా వందలాది రైతు సంఘాలు సమైక్యమై 'సంయుక్త కిసాన్ మోర్చా'ను ఏర్పర్చుకొని దాని నాయకత్వంలో రాజీలేని ఉజ్వల పోరాటాన్ని కొనసాగించారు. వారి పోరాటాన్ని నిర్వీర్యం చేయడానికి హిందుత్వ శక్తులు అనేక కుట్రలకు పాల్పడినాయి. వారి మీద అనేక దాడులకు పూనుకున్నాయి. అయినప్పటికీ, వారు వాటిని లెక్క చేయకుండా పోరాట మార్గంలో దృఢంగా నిలిచి మోదీ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పారు. కేంద్రంలోని బ్రాహ్మణీయ హిందుత్వ భాజపా ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలన్నింటినీ మన దేశ ప్రజలు గట్టిగా వ్యతిరేకిస్తున్నారనడానికి ప్రస్తుత రైతాంగ పోరాట విజయం మరో పెద్ద ఉదాహరణ. పోరాటాల ద్వారానే బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమనే విశ్వాసభరిత సందేశాన్ని ఈ పోరాటం మరోసారి ప్రజల ముందుంచింది.

2015లో కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన భూసేకరణ బిల్లును భారత రైతాంగం దృఢంగా వ్యతిరేకించడంతో మోదీ తొక ముడవక తప్పలేదు. అదే విధంగా 2018 మార్చ్‌లో సుప్రీంకోర్టు దళిత ఆదివాసీ అత్యాచార నిరోధక చట్టానికి సవరణ చేయాలనే ఆదేశాన్ని వెలువరించినపుడు దేశ ప్రజలు వీధుల్లోకి వచ్చి హిందుత్వ కుట్రకు వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని తెలిపారు. ఆ సందర్భంగా పోలీసుల కాల్పులలో 7గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రజల ఆగ్రహ జ్వాలల రుచి చూసిన కేంద్రం వెంటనే అలాంటిదేమీ జరుగదని ప్రజలకు హామీ ఇవ్వక తప్పలేదు. మరుసటి సంవత్సరం 2020 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు దేశ అడవుల నుండి భూముల పట్టాలు లేని ఆదివాసీలను, గైరాదివాసులను బేదఖల్ చేయించాలని ఆదేశాలు వెలువరించినపుడు దేశం మొత్తం సుప్రీంకోర్టు ఆదేశాన్ని వ్యతిరేకించి ఆదివాసీ ప్రజలతో భుజం భుజం కలిపి పోరాటంలోకి దిగింది. దానితో వెంటనే మళ్లీ కేంద్ర ప్రభుత్వం ఆ ఆదేశాన్ని అమలుకాకుండా నిలపక తప్పలేదు. ఇవన్నీ పోరాటాల ద్వారనే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోగలుగుతారనే తిరుగులేని తీర్పును ఇస్తున్నాయి. ఆ దారినే దేశ వ్యాప్తంగా మూలవాసులు విస్థాపనకు వ్యతిరేకంగా అడవులను కాపాడుకుందామనే విశాల దృష్టితో *'ఖదాన్ నహీ, అనాజ్'* అంటూ జల్, జంగల్, జమీన్ కోసం ఉద్యమిస్తుంటే ప్రభుత్వాలు అడవులను ఖాకీమయం చేస్తున్నాయి. అది అక్కడి ప్రజల అస్తిత్వ సమస్యగా మారుతుండడంతో దండకారణ్యం, ఝార్ఖండ్, ఒడిశా, తెలంగాణ సహ అనేక రాష్ట్రాలలోని ఉద్యమ ప్రాంతాల ప్రజలు ప్రధానంగా మూలవాసులు నూతన పోలీసు క్యాంపుల వ్యతిరేక పోరాటాలను చేపట్టి తీవ్రతరం చేస్తున్నారు. ఈ రోజు ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఆ మూలవాసుల జీవన్మరణ పోరాటాలకు అండగా నిలువాల్సిన ఆవశ్యకత దేశ ప్రజల ముందుంది.

పోరాటాల ద్వార తమ సమస్యలను పరిష్కరించుకున్న రైతుల, దళితుల, ఆదివాసుల బాటలోనే దేశ కార్మిక వర్గం పోరాటానికి నడుం బిగించాలి. 40 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి వారి హక్కులను హననం చేసిన మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాన్ని జరుపాలనీ మా పార్టీ పిలుపునిస్తోంది. దేశ రైతాంగానికి అండగా నిల్చిన ప్రజానీకం, ఇపుడు కార్మికుల పక్షం మరింత గట్టిగా నిలవాలి. బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు రూపొందించిన ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక సీఏఏ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలనీ దేశ ప్రజలు మరోసారి ముందుకు రావాలి. ఘరానా కార్పొరేట్ వర్గాల సులభ వ్యాపారం కోసం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)1,400 చట్టాలను రద్దుచేసిన కేంద్రం దేశంలోని ప్రజాస్వామిక, ప్రశ్నించే గొంతులకు తాళాలు వేయడానికి వినియోగిస్తున్న కాలం చెల్లిన రాజద్రోహ చట్టాన్ని (సెడిషన్ ఆక్ట్), నిరంకుశ ఊపా చట్టాన్ని తక్షణం రద్దుచేయాలనీ, పోరాట రైతులపై మోపిన అన్ని కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలనీ ఉద్యమించాలి. ఈ రోజు దేశం హిందుత్వ శక్తుల మహా ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. దానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల, అన్ని సెక్షన్‌ల ప్రజలు, విప్లవ ప్రజా సంఘాలు, కార్మికవర్గ



రైతాంగ పోరాట విజయం

సంస్థలు, వామపక్షపార్టీలు సహ కలిసివచ్చే వారందరితో కలిసి ప్రజాసమస్యలపై సమైక్యంగా అన్ని రంగాలలో మిలిటెంట్ పోరాటాలను చేపట్టాలి.

దేశ ప్రధాని మోదీ చేసిన తాజా ప్రకటనతో రైతులు మోసపోకూడదనీ పార్లమెంటులో చట్ట ప్రక్రియ ద్వార తిరిగి 3 సాగు చట్టాలను రద్దు చేసేవరకు గట్టిగా పోరాడాలనీ మా పార్టీ రైతులను జాగృతం చేస్తోంది. యేడాది పోరాట కాలంలో అసువులు బాసిన ప్రతి రైతు కుటుంబానికి కేంద్రం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలనీ రైతులు డిమాండ్ చేయాలి. మూడు సాగు చట్టాల రద్దుతో ఈ దేశ రైతుల వ్యవసాయ సమస్యలు సమసిపోవు. మన దేశంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండాలంటే వారు మూడు దశాబ్దాలకు పైగా ఎదుర్కొంటున్న ఇంకా అనేకానేక వ్యవసాయ సమస్యల తుది పరిష్కారం కోసం వారు ప్రస్తుత పోరాట స్ఫూర్తితోనే కార్మికవర్గ నాయకత్వంలో మరిన్ని మిలిటంట్ పోరాటాలకు సిద్ధం కావాలనీ మా పార్టీ కోరుతోంది. వ్యవసాయ ప్రధానమైన మన దేశ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి వ్యవసాయ విప్లవం జయప్రదం చేయడం మినహ మరో మార్గం లేదు. బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల నయా భారత్ కలలను ధ్వంసం చేయకుండా దేశ ప్రజలకు నిజమైన శాంతి, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, స్వావలంబన రవ్వంతైనా మిగలవు.

☆ **దేశ వ్యాప్త విప్లవ ప్రజాసంఘాలు, పీఎల్‌జీఏ ప్రస్తుత రైతాంగ విజయాన్ని ఎత్తిపడుతూ ప్రజలను వారి మౌలిక సమస్యలపై సంఘటిత పోరాటాలలోకి సమీకరించండి.**

☆ **దేశంలో ఏ రూపంలోనూ బ్రాహ్మణీయ హిందుత్వ పాలక వర్గాల 'నయాభారత్' విధానాలు అమలు కాకుండా అడ్డుకుందాం.**

☆ **సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల దోపిడీకి వ్యతిరేకంగా నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై పోరాడుదాం.**

## మర్దిటోల అడవిలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన కామ్రేడ్స్ దీపక్‌దా, మహేష్, లోకేష్, దిలీప్ సహ 26 మందివీరయోధులకు విప్లవ జోహార్లు

13 నవంబర్ 2021 మహారాష్ట్రలోని గడ్‌చిరోలీ జిల్లా విప్లవోద్యమ చరిత్రలో అత్యంత విషాదకరమైన రోజుగా మిగిలిపోయింది. మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు జిల్లా గడ్‌చిరోలీలోని ధనోరా తాలుకా గ్యారపత్తి పోలీసు స్టేషన్ పరిధిలో కల మర్దిటోల అడవిలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ దీపక్ దాదతో (మిలింద్ బాపూరావ్ తేల్తుంబ్డే) సహ 26 మంది కామ్రేడ్స్ అమరులైనారు. శత్రువుతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీరయోధులకు ప్రజా విముక్తి ప్రతిక వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లు తెలుపుతోంది. వాకి ఆశయాల పరిపూర్తికై పార్టీ తుది వరకూ పోరాడుతుందనీ శపథం చేస్తోంది. చెరిగిపోని అమరుల జ్ఞాపకాలలో మునిగిన వారి బంధు, మిత్రులంతా ఈ విషాదకర సమయంలో నిబ్బరంగా నిలువాలనీ వారి ఆదర్శాలను నిలుపాలనీ కోరుతోంది.

అమరులు ఈ రోజు మన ముందు భౌతికంగా లేరు. కానీ వారు నిర్మించిన ప్రజా ఉద్యమాలు, ప్రజా యుద్ధంలో నిలిపిన విప్లవ ఆశయాలు-ఆదర్శాలు, త్యాగాలు ఒక గొప్ప విప్లవ వారసత్వ సంపదగా మనకు మిగిలాయి. అవి సదా మనకు నూతన పోరాట దారులను ఆవిష్కరిస్తాయి. ఆ మార్గంలో అదెంత కంటకప్రాయమైనా, ఎన్ని మలుపులు-మెలికలు అనివార్యమైనా తుది విజయంపై ఆశలను, విశ్వాసాన్ని నింపుతూ విప్లవమార్గాన్ని ప్రకాశవంతం చేస్తుంటాయి.

భారత నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై అహర్నిషలు శ్రమిస్తూ యుద్ధభూమిలో దోపిడీ వర్గాల భద్రతా బలగాలతో తుదిశ్వాస విడిచేవరకూ పోరాడి అసువులు బాసిన ప్రజావీరులంతా మృత్యుంజయులే. అమరుల నెత్తుటి త్యాగాలను విప్లవ ప్రజలు వృథా కానివ్వరు. యావత్తు విప్లవ శిబిరం అమరుల ఆశయాల పరిపూర్తికై మునుపెన్నటికన్నా దృఢంగా, పట్టుదలతో, నూతన శక్తియుక్తులతో డైనమిక్‌గా తెగించి పోరాడుదాం. అంతిమ విజయం ప్రజలదే.

# రైతుల వ్యవసాయాన్నీ రైతాంగ జీవితాలనూ కడతేరుస్తున్న దేశ వ్యవసాయ విధానాలు

మన భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. రైతే దేశానికి వెన్నెముక. కానీ, ఏయేటికాయేడు దేశ పాలకవర్గాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం రైతుకు భారంగా మారుతోంది. వ్యవసాయానికి బంధీ అయిన పేద, మధ్య తరగతి రైతుల సేద్యం యేటేటా కుంటుపడుతూ వదులుకునే దుస్థితికి చేరుతోంది. ఆశించిన ఫలసాయం కరువై ఆదాయాలు పూర్తిగా సన్నగిల్లి అప్పుల పాలవుతున్న వారి బతుకులు ఛిద్రమవుతూ అంతిమంగా కడతేరుతున్నాయి. రైతు జీవితాలను అతలాకుతలం చేస్తున్న పలు సమస్యలను తెలుసుకునే ముందు హరిత విప్లవ జనకుడు, సరళీకృత ఆర్థిక విధానాల పరమ సమర్థకుడు స్వామినాథన్ 2004లో ప్రభుత్వానికి చేసిన సిఫారసులను కూడా తెలుసుకోవాలి. దేశంలో రైతులంతా తమ సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సిఫారసులను అమలు చేయాలని తరచూ కోరుతుంటారు. నిజానికి ఆయన చేసిన సిఫారసులను లోతుగా, సమగ్రంగా అధ్యయనం చేయడం చాలా అవసరం. అపుడే భూమిలేని రైతుల, పేద రైతుల, చిన్న రైతుల మౌలిక సమస్యలను ఆ సిఫారసులు ఎంతమాత్రం పరిష్కరించవనే స్పష్టతకు రావడమే కాకుండా ఆయన ఏ వర్గాలకు అనుకూలమో బోధపడుతుంది.

2004లో ఏర్పడిన జాతీయ రైతు కమిషన్ అధ్యక్షుడు వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్.ఎస్. స్వామినాథన్ 2006లో ప్రభుత్వానికి సమర్పించిన 6 నివేదికలలోని అంశాలను ముందు సంక్షిప్తంగా చూద్దాం.

1. భూ సంస్కరణలు చేపట్టి బంజర్ భూములను పేదలకు పంచాలి. వ్యవసాయ భూములకు సాగునీరు సమకూర్చాలి.

2. ప్రజలకు ఆహార భద్రత కల్పించి పౌష్టికాహార లోపాన్ని ఎదుర్కోవాలి.

3. రైతు పండించిన పంట ఉత్పాదక ఖర్చుపై 50% అధికంగా పంట ధర నిర్ణయించాలి.

4. రైతులకు చౌక ధరలకు నాణ్యమైన విత్తనాలు సమకూర్చాలి.

5. రైతులకు ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని అందించడానికి గ్రామాల్లో విజ్ఞాన చావడిలు ఏర్పర్చాలి.

6. మహిళా రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ఇవ్వాలి.

7. ప్రకృతి వైపరీత్యాలలో రైతులను ఆదుకోవడానికి విపత్తు నిధులను ఏర్పర్చాలి.

8. కార్పోరేట్ వర్గాల వ్యవసాయేతర అవసరాలకోసం రైతుల పంట భూములను, అడవులను ఇవ్వకూడదు.

9. అన్ని పంటలకు బీమా సదుపాయం ఉండాలి.

10. పేదలు, అవసరమైన ప్రతి వారికి వ్యవసాయ రుణాలు అందచేయాలి.

11. పంట రుణాలపై బ్యాంకు వడ్డీ రేటు 4%కి మించకూడదు.

12. దారిద్ర్య రేఖ దిగువన ఉన్న 28% ప్రజలకు ఆహార భద్రత కల్పించాలి.

13. రుణాల వసూళ్లలో వెసులుబాటు ఉండాలి.

## సాగు నీటి సంక్షోభం

దేశంలోని 13 ప్రధాన వ్యవసాయ రాష్ట్రాలలో అధిక దిగుబడికి పేరొందిన 100 జిల్లాలు గత 15 సంవత్సరాలుగా పదే పదే నీటి ఎద్దడికి గురవుతున్నాయి. దేశంలో 1951లో ఉన్న తలసరి నీటి లభ్యత 5,300క్యూ.మీ. ఇపుడు అందులో నాల్గవ వంతుకు 1,544క్యూ.మీకు దిగింది. అధిక నీటి వినియోగంతోనే పండే హైబ్రిడ్ విత్తనాలను రైతుల పొలాల్లోకి తెచ్చి, జలవనరుల కాలుష్యాన్ని పరాకాష్టకు చేర్చి, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ రుతుపవనాల చేతిలో నీటి సమస్య లేకుండా చేసేసి ఇపుడేమో నీటి పొదుపు ఉద్యమాల గూర్చి 'మన్ కీ బాత్'లు వినిపిస్తున్నారు. నీటి తీరువా అంటూ రాగం తీస్తున్నారు. బిందు సేద్యం, తుంపర సేద్యం పాట పాడుతున్నారు. ఏ పూటకు ఆ పాట పాడే పాలకులు మహారాష్ట్రలో జలయుక్త శిబిర్ అంటే, తెలంగాణలో మిషన్ భగీరథ అంటూ గతంలో అపార లాభాపేక్షతో అనుమతించిన అత్యాశ చర్యలను కప్పిపెట్టుకుంటూ అల్ప సంతోషులైన ప్రజలను బుజ్జగించడానికి కొత్త సంస్కరణల పాట పాడుతున్నారు. దేశంలో 52 నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తిచేసి అదనంగా 70 లక్షల హెక్టార్లకు నీరు అందివ్వగలిగామనీ, మరో 47 ప్రాజెక్టులపై పని నడుస్తోందనీ అందుకు 1.30 లక్షల కోట్లు 2019-20 బడ్జెట్లో కేటాయించామనీ మోదీ ప్రభుత్వం గొప్పగా లెక్కలందిస్తోంది. 'ఏక్‌రాష్ట్-ఏక్‌గ్రిడ్' దిశలో విద్యుత్ సరఫరా పనులు వేగవంతం అయ్యాయంటోంది. గత ఆనకట్టల వైనం తెలిసినవారు ఈ లెక్కలతో మరిన్ని వాస్తవాలను ఆ దిశలో అర్థం చేసుకోగలుగుతారు.

తాగు, సాగు నీటికి కటకటగా ఉండే అరబ్ ప్రపంచంలో తిష్ట వేసిన ఇజ్రాయెల్ వ్యవసాయ సాగు పద్ధతులతో మన రైతాంగాన్ని మురిపిస్తూ తెగ ప్రచారం చేస్తున్నారు. అక్కడ పంటల వృథా మూడు శాతం మాత్రమే, అక్కడ వ్యవసాయం ఒక పరిశ్రమగా సాగుతోంది, నేల స్వభావాన్ని బట్టి పంటలను సాగు చేస్తున్నారు, మార్కెట్‌ను బట్టి పంటను ఎంచుకుంటున్నారు, ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తున్నారు, పంట సాగు అనంతరం వాటి నిల్వ, శుద్ధి, ప్యాకేజింగు, రవాణా, ఎగుమతి సౌకర్యాల లభ్యత వంటివి అందుబాటులో ఉండటం వరంగా మారింది అంటూ అంతా సంపన్నుల పంటల ప్రయోజనాలను ఏకరువు పెడుతున్నారు.

మధ్యప్రదేశ్ 'హరిత విప్లవం' సాధించిన రాష్ట్రం అంటూ ఘనంగా చెపుతుంటారు. కానీ వాస్తవాలు విరోధాభాసంగానే ఉన్నాయి. మూడు

శతాబ్దాల క్రితం వ్యవసాయ స్వర్ణసీమగా గణుతికెక్కిన బుందేల్‌ఖండ్, ప్రపంచంలో వన్నె తెచ్చిన నూలు గుడ్డలను అందించిన దాని పాత్ర వర్తమాన పాలకుల 'హరిత విప్లవం' హయాంలో పూర్తిగా మాయమైంది. అక్కడి గంగా-యమునల సంఘమంలోని నల్ల రేగడి భూములు చెరకు, పత్తి పంటలకు ప్రసిద్ధి. కానీ గత 15 యేండ్లుగా వరుస నీటి ఎద్దడితో రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. అక్కడి 91 రిజర్వాయర్లలో 10యేండ్లుగా నీరు కనీస నీటిమట్టానికి చేరడం లేదు. మహారాష్ట్రలో సగం జిల్లాల్లో నీటి ఎద్దడి, వ్యవసాయ సంక్షోభం తీవ్రమైంది. దేశంలో రైతాంగం నీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. బోర్లు పాతాళానికి చేరాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పేద రైతుల పంటలకు నీళ్ల సమకూర్చుకోవడం గండంగా మారింది.

**పంట-పాడి:**

దేశంలోని వ్యవసాయ కుటుంబాలలో దాదాపు ప్రతి రెండు కుటుంబాలలో ఒకటి పాల ఉత్పత్తులతో ముడిపడి ఉంది. గ్రామాల్లో పంటే కాదు, పాడి సైతం కనుమరుగవుతోంది. పాడిపంటలతో విలసిల్లాల్సిన గ్రామసీమలు వెలాతెలాపోతున్నాయి. ఇవి రెండూ జోడు గుర్రాల్లా స్వారీ చేసినంత కాలం రైతులింట ఉప్పిడీ ఉపవాసాలూ లేకుండేవి. దేశంలో పాల వ్యాపారం అత్యధిక శాతం ఎక్కువగా అసంఘటిత రంగంలో ఉన్నందువల్ల భారత రైతులకు ఆదాయం పెరిగే అవకాశాలు స్థిరంగా ఉండటం లేదు. గత రెండేళ్లలో దేశంలో పాల పొడి నిల్వలు పెరగడంతో వాటి ధర ఏకంగా 37 శాతం తగ్గింది. కిలో పొడి టోకు ధర దేశీయ విపణిలో 2016 జనవరిలో రూ.265 ఉంటే 2018 జనవరిలో రూ.147కు పడిపోయిందని జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య' (ఎన్‌డీడీబీ) వెల్లడించింది. వినియోగదారులకు మాత్రం పాల ధరలు చుక్కలు చూపుతున్నాయి. గోహత్య మహా పాపంగా భావిసస్తూ, గో సేవే గోపాల సేవంటూ జపించే మన దేశం మాంసం అమ్మకాలలో(పింక్ రెవల్యూషన్)ప్రపంచంలో అగ్రభాగాన నిలిచింది.

**గిట్టుబాటు ధర :**

మన దేశంలో 1966-67నుండి 24 రకాల వ్యవసాయోత్పత్తులపై కనీస మద్దతు ధరలను 'వ్యవసాయం పెట్టుబడి ధరల కమిషన్' సిఫారసులపై ప్రభుత్వం యేటా రెండు సార్లు (రబీ, ఖరీఫ్) నిర్ణయిస్తుంది. ప్రభుత్వం ప్రధానంగా కొనేది మాత్రం గోధుమలు, ధాన్యమే. అవైనా పండిన పంటలో మూడోవంతైనా కొనడం లేదు. మొత్తం రాగుల దిగుబడిలో 0.2 శాతాన్ని, పప్పుల్లో ఆరో వంతే కొంటుంది. 2016 అక్టోబర్‌లో నాశిక్‌లో ఆలుగడ్డలు కిలో రూ. 4 కాగా కనీస మద్దతు ధర కన్నా పెసరపప్పు 15%, సోయాబీన్ 35% తక్కువకే అమ్ముకోక తప్పలేదు. తృణధాన్యాల పంటలు వరికన్నా చాలా తక్కువ నీటితో పండించవచ్చు' నంటూ తెగ ప్రచారం చేస్తున్నారు. దానితోపాటు ఇటీవల వాటి పౌష్టికత గురించి చెపుతూ ప్రధానంగా పట్టణవాసులను అబ్బురపరుస్తున్నారు. తీరా అవి పండిస్తున్న రైతుల విషయానికి వచ్చేసరికి గిట్టుబాటు ధరలలో వామహస్తం చూపుతున్నారు. తృణధాన్యాల ధరలు పడిపోవడం వినియోగదారుడికి 'వరంగా' మారితే రైతుకు మాత్రం సంకటంగా తయారవుతుంది. విత్తనాలు, ఎరువుల వంటి ఉత్పత్తి సాధనాలపై రైతు చేసిన వ్యయానికి కుటుంబ సభ్యుల శ్రమ విలువను జోడించగా వచ్చే ధరకన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ ధరను కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించాలన్నది 2004లో స్వామినాథన్ చేసిన సిఫారసు.

సాగు ఖర్చు అంటే సి2 అని, అంతే కానీ ఎ2+ఎఫ్ఎల్ కాదని రైతు సంఘాలు స్పష్టం చేశాయి. ఎ2 అంటే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, ఇంధనం, నీటి వసతి తదితరాలపై పెట్టిన ఖర్చు. ఎ2+ఎఫ్ఎల్ అంటే ఎ2 ఖర్చుతో పాటు కుటుంబ శ్రమ కూడా. సి2 అంటే ఎ2+ఎఫ్ఎల్‌తో పాటుగా కిరాయి ఖర్చులు, సొంత భూమి, స్థిర మూలధన ఆస్తులపై కోల్పోయే వడ్డీ. రైతుకు గిట్టుబాటు ఎలా కల్పించాలో డాక్టర్ స్వామినాథన్ 2004లోనే ప్రభుత్వానికి నివేదించినా-అది ఆచరణ సాధ్యం కానిదని నీతి ఆయోగ్ 2018 జులైలో మొండిగా తిరస్కరిస్తూ సుప్రీంకోర్టుకే స్పష్టం చేసింది. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా తమ పార్టే కాదు ఏ పార్టీ అధికారానికి వచ్చినా ఆ స్వామి సిఫారసులను అమలు చేయడం అసాధ్యం అని తీర్పు ఇచ్చాడు.

2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు భాజపా కనీస మద్దతు ధరలపై రైతాంగానికి ఎన్నో హామీలు గుప్పిచ్చింది. కానీ అరకొర లెక్కలు కట్టి 2018లో కనీస మద్దతు ధర నిర్ణయించింది. క్వింటాలు ధాన్యం పండించడానికి రూ. 1,166 ఖర్చు అవుతుందని అంచనా వేసి రూ. 1,750 మద్దతు ధర నిర్ణయించింది. నిజానికి పంట ఖర్చులన్నీ లెక్కేస్తే ఈ ఖర్చు రూ. 1,560 అవుతుంది. అంటే మద్దతు ధర రూ. 2,340 ఉండాలి. కానీ, ఆచరణలో రైతు బస్తా ధాన్యం రూ.1,300-1,400లకే అమ్ముకోవలసి వస్తోంది. తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో ఒక ఎకరం భూమిలో క్యాబేజీ సాగు చేయాలంటే చేయవలసిన వ్యయం కనీసం రూ. 1.5 లక్షలు అవుతోంది. మార్కెట్‌లో కిలో ఒక్కంటికి రైతుకు ఒక్క రూపాయి మాత్రమే దొరికే దుస్థితి ఉన్నపుడు ఆ రైతు పంటను అమ్ముకొని లాభపడేదెక్కడ! ఛత్తీస్‌గడ్‌లోని దుర్గ్ జిల్లాలో టొమేటో సాగు కూడా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఉండడం లేదు. చిన్న రైతు ఒక ఎకరం పొలంలో ఆ పంటను పండించాలంటే వారికయ్యే వ్యయం రూ. 90,000 నుంచి రూ. 1,00,000 వరకు ఉంటుంది. అదే పెద్ద రైతులు టొమేటో పండిస్తే ఇంకొంచెం ఎక్కువగా, అంటే ఎకరానికి రూ. 1.25 లక్షల వరకు సాగు వ్యయం అవుతుంది. సీజన్‌లో వాటి రేటు దారుణంగా పడిపోతుంది. యూపీఏ-1 పాలనలో ధాన్యం మద్దతు ధర 65 శాతం పెరిగింది. రెండో విడత పాలనలో తగ్గింది. గత నాలుగేళ్లుగా మరీ తగ్గింది.

మధ్యప్రదేశ్ జనాభాలో ప్రతి పదిమందికి ఏడుగురు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. 'గోధుమలకు గిట్టుబాటు ధరలు తప్ప మాకేమీ అవసరం లేదు. వంద కేజీల గోధుమలకు రూ.3,000లు, సోయాబీన్‌కి

రూ.4,000లు వచ్చేలా చేస్తే చాలు' అన్నారక్కడి రైతులు. కిలో వెల్లుల్లి ఉత్పత్తికి రైతుకు రూ.15-20లు ఖర్చు అవుతుండగా ధరలు మాత్రం కిలో రూ॥7కి పడిపోయాయి. దేశంలోని ఉల్లిపాయల ఉత్పత్తి కేంద్రాలలో ఒకటిగా ఉంటున్న మాందసార్‌లో వాటి ధర కిలోకు రూపాయికంటే తక్కువకు పడిపోయింది. ఇది యం.ఎస్.స్వామినాథన్ చెప్పిన మద్దతు ధరలకన్నా తక్కువే వారు కోరుకుంటున్నది. అంతమాత్రానికే శివరాజ్‌సింగ్ చౌహాన్ భాజపా ప్రభుత్వం 2017లో మధ్యప్రదేశ్ పశ్చిమ ప్రాంత జిల్లా ఆర్ఎస్ఎస్ కంచుకోట మాందసార్‌లో కడుపుకాలిన రైతులు ఆత్మహత్యల పాలవకుండా గిట్టుబాటు ధరల కోసం ఆగ్రహావేశాలతో వీధుల్లోకొస్తే పోలీసులు ఆరుగురు రైతులను కాల్చి చంపారు. ఇండోర్, ఉజ్జైన్, ఖర్‌గౌన్, ధార్, దేవాస్, సిహెూర్, నీమచ్‌లలో రైతు ప్రదర్శనలు జరిగాయి. రైతులను ఉగ్రవాదులన్నా, ఇంటర్‌నెట్ సౌకర్యం నిలిపివేసినా వారి ప్రదర్శనలను ఆపలేకపోయారు.



సహేతుక గిట్టుబాటు ధర ఊసెత్తకుండా- రైతులకు ఆకర్షణీయ ధరలు, ఉత్పాదకత పెంపు, భూ యాజమాన్య సమస్యల పరిష్కారం, విపత్తుల సమయంలో తోడ్పాటు, బీమా పథకాలు వంటి వాటి ద్వారా గొప్ప మార్పు తెస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించడం రైతుల జీవితాలతో క్రూర పరిహాసమే అవుతుంది. వ్యవసాయానికి కీలకమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితరాలన్నింటి ధరల్ని అదుపు చెయ్యని, నాణ్యమైన విత్తనాలను అందించని కేంద్ర ప్రభుత్వం తను ప్రకటించిన మార్పును తేవడం అంటే చిన్న, సన్నకారు రైతులను సంపన్నుల కార్పోరేట్ వ్యవసాయానికి బలి పశువులను చేయడం ద్వారానే!

దేశంలోని ఆదివాసీ రైతులను ఎంతో ఉద్ధరిస్తున్నట్టు నటించే పాలకులు వారి వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్ల కోసం సహకార సంఘాలను పెట్టారు. వాటిల్లో జరిగే అవకతవకలతో ఆదివాసీ రైతు కొట్టుమిట్టాడుతున్నాడు. వారి ధాన్యం కొనుగోళ్లకు అనేక షరతులు విధిస్తున్నారు. మహారాష్ట్రలోని గడ్‌చిరోలీ జిల్లాలో 1,523 హెక్టార్లలో రబీ పంట మొక్కజొన్న వేశారు. ఎకరానికి 20 క్వింటాళ్లు పండిస్తున్న రైతులు ఆదివాసీ సొసైటీలు తమ పంట కొనుగోళ్లకు నానా అవస్థలు పెడుతున్నాయనీ వాపోతున్నారు. ఆదివాసుల వ్యవసాయోత్పత్తులకు, అటవీ ఉత్పత్తులకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడమే లేదు. అలాంటపుడు ఇక వారు తమ సమస్యలపై మావోయిస్టులన్నా, ఉగ్రవాదులన్నా పోరాడకుండా మరేం చేస్తారు!?

**విత్తలేని విత్తనాలు:**

నేలల స్వభావం, వర్షపాతం బట్టి విత్తన రకాలుండాలి. కానీ మనీలాలోనో, మరోచోటనో పరిశోధనలు జరిపి దిగుమతులు చేస్తున్న విత్తనాలతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తెగుల్లను తట్టుకునే విత్తనాలు లభ్యం కాకపోవడంతో తెగులు విజృంభించి కోస్తాంధ్రలోనైతే మినుము, పెసర విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అమెరికాకు చెందిన డెల్టా అండ్ పైన్‌లాండ్ కంపెనీ, అమెరికా వ్యవసాయ, విత్తనాభివృద్ధి సంస్థలు ఉమ్మడిగా అభివృద్ధి పరచిన 'విత్తన టెక్నాలజీ'తో ఉత్పత్తి చేసిన విత్తనాల ప్రత్యేకత ఏంటంటే ఆ విత్తనాల నుంచి మొలకెత్తిన మొక్కలు ఉత్పత్తిచేసే విత్తనాలకు పునరుత్పత్తి సామర్థ్యం ఉండదు. వీటిని టర్మినేటర్ విత్తనాలంటున్నారు. టెర్మినేటర్ విత్తనాల నుండి మొలకెత్తే మొక్కల్లో ఉండే మూడురకాల జన్యువులు, అవి విడుదల చేసే విష పదార్థాలు, ఎంజైముల ఫలితమిది. సాధారణంగా రైతులు పంటనుంచి సేకరించిన విత్తనాలను, మరో పంటకోసం నిల్వచేస్తారు. కానిపై టెక్నాలజీతో ఉత్పత్తి చేసిన విత్తనాలు ఒక్క పంటకే ఉపయోగపడతాయి. కాబట్టి వ్యవసాయం చేసుకోవాలనుకుంటే మన దేశంలో విత్తనోత్పత్తిలో సింహభాగాన్ని ఆక్రమిస్తున్న విదేశీ ఎమర్జంట్, మహికో, ప్రో-ఆగ్రో, అలీబాబా గ్రూప్ హెూల్డింగ్ లిమిటెడ్ మున్నగు కంపెనీలనుంచి ప్రతియేటా ఆ విత్తనాలను కొనుక్కోని తీరాల్సిందే. ఆ విత్తనాల తాకిడికి తట్టుకోలేకపోతున్న 30వేల రకాలకు పైగా స్థానిక/దేశీ విత్తనాలు కనుమరుగయ్యాయి. వర్తమానంలో కేవలం 10 రకాల విత్తనాలతోనే దేశంలో 75శాతం పంట పండిస్తున్నారు. ప్రపంచ విత్తనోత్పత్తిలో విదేశీ సంస్థల చలవ వల్ల 2016-17నాటికి 380.30 లక్షల టన్నుల విత్తన అమ్మకాలకు చేరి ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిన మన దేశంలో పేదరైతులకు మార్కెట్‌లో నాణ్యమైన విత్తనాలే కరువయ్యాయి. రైతులకు నాణ్యమైన విత్తనలను అందివ్వని ప్రభుత్వాలు ఎలైట్ వర్గాల ఆర్థిక ప్రయోజనాలను కాపాడడానికి మాత్రం 'నాణ్యమైన' వ్యవసాయ ఉత్పత్తులకు 'ఎగ్‌మార్క్' పండ్లకు 'ఎఫ్‌పీఏ' మార్క్ ప్రమాణాలు నిర్ధారించింది.

కల్తీ విత్తనాల ఫలితంగా రైతుల సగటు దిగుబడి తగ్గుతున్నదని వ్యవసాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణలో సగటున ఎకరాకు 38క్వింటాళ్ల ధాన్యం రావల్సిన చోట 25క్వింటాళ్లు, మొక్కజొన్న 55క్వింటాళ్ల బదులు 25క్వింటాళ్లు, కంది 12క్వింటాళ్ల బదులు 9క్వింటాళ్లు, వేరుశెనగ 17క్వింటాళ్ల బదులు 9క్వింటాళ్లకు దిగిపోయిందని చెపుతున్నారు. మేలిమి విత్తనాల వినియోగం వల్ల దిగుబడులు 15-20శాతం మేర పెరుగుతాయంటారు.

ఛత్తీస్‌గడ్‌లో కాంటాక్టు సేద్యం చేస్తున్న కార్పోరెట్లు సువిశాల క్షేత్రాలలో ఆర్కిడ్, ఝర్బెరా లాంటి విదేశీ రకం పూలు; షిమ్లా మిర్చీ, పచ్చి మిరపకాయలు, పర్వల్, దొండ, కాకర మున్నగు కూరగాయలు పండిస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాలలోకి కూడా వారి ఆధునిక సాగు వేగంగా విస్తరిస్తున్నది. కాంకేర్ జిల్లా బేవర్తికి హిమాచల్ నుండి సేపు దిగుమతి చేసి పండిస్తున్నారు. అంబికాపూర్, జశ్‌పూర్‌లకు ఉత్తరప్రదేశ్ నుండి ఆలుగడ్డలను దిగుమతి చేసి పంట తీస్తున్నారు. జపాన్‌కు చెందిన టకిటా, సకిటా కంపెనీల గోబీ విత్తనాలు దిగుమతి అవుతున్నాయి. వీటితో ఆదివాసుల జీవితాలు రైతు బఘేల్ రాజ్యంలో మరింత అతలాకుతలం కాక తప్పదు.

'జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ' అనుమతి లేని, నిషేధించబడిన బీటీ విత్తనాలు యధేచ్ఛగా గుజరాత్ నుండి అన్ని రాష్ట్రాలకు దిగుమతి అవుతూనే ఉన్నాయి. 2002లో మన దేశానికి చేరిన బీటీ పత్తి గత 17 యేండ్లలో 90 శాతం విస్తరించింది. వరిని మింగేస్తూ పత్తి వ్యాపిస్తోంది. మన దేశ రైతాంగ (ఆత్మ)హత్యలకు ప్రధాన కారణం ఇదే!

తాజాగా ట్రంప్ మహానుభావుడు కూడా వర్ధమాన దేశాల పేరుతో సబ్సిడీలను అనుమతించడం డబ్ల్యుటీఓకు తగదని హెచ్చరించాడు. మన దేశంలో ప్రస్తుతం లభిస్తున్న రూ.70 వేల కోట్ల వ్యవసాయ సబ్సిడీలను మోదీ పాలనలో ఏ క్షణాన ఎత్తేసినా ఆశ్చర్యపడేదేమీ ఉండదు. ఇపుడున్న రైతు సబ్సిడీలతో చౌకీదార్ మోదీ చేస్తున్న వ్యాపారం అంతిమంగా లలిత్ మోదీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యా లాంటి బడా పెట్టుబడిదారులకే మేలు చేస్తున్నదనేది మోదీ విధానాలు, బ్యాంకుల పని విధానం తెలిసిన వారికి సుబోధకమే!

### ప్రాణాంతకంగా మారిన ఎరువులు-క్రిమిసంహారాలు

అధిక దిగుబడి విత్తనాలను విత్తడానికి అనివార్యంగా నెట్టబడిన రైతులు తాము తరతరాలుగా వాడుతూ వస్తోన్న సేంద్రియ ఎరువులకు అంతే అనివార్యంగా స్వస్తి చెప్పి సర్కార్ ఎరువులు కొనలేక యేటేటా దివాళా తీస్తున్నారు. హరిత విప్లవ విపరిణామాలతో మన దేశంలో ఊపందుకున్న రసాయనిక ఎరువుల వినియోగం క్రమంగా భూములే ఇముడ్చుకోలేని స్థాయికి చేరుకుంటున్నది. 1968లో 17లక్షల టన్నుల రసాయనిక ఎరువులను వాడగా 2012నాటికి 16 రెట్లు పెరిగి 281 లక్షల టన్నులకు చేరింది. ఇక క్రిమి సంహారాలైతే 1955లో ఎకరాకు కేవలం 5 గ్రాములు వాడితే 2018నాటికి 350 గ్రాములకు చేరింది. కాగితాలపైకి ఎక్కించి అందచేసే దేశ వ్యాప్త సగటు లెక్కలను కాసేపు పక్కన పెట్టి పేద, మధ్య తరగతి గ్రామీణ రైతుల నిజ జీవితాలను పరిశీలిస్తే బీటీ పత్తి చేరకముందు ఊర్లల్లో సంపన్న రైతులు, దొరలు, పెత్తందారులు, 'పరపతి' గల పెద్దలు మాత్రమే అరకొరగా వీటిని వినియోగించేవారనడం గత వాస్తవాన్ని తెలుసుకోవడమే అవుతుంది. రసాయనిక ఎరువులు సైతం ప్రధానంగా ఆ వర్గాలకు చెందిన వారే వాడేవారు. కానీ, అధిక దిగుబడి విత్తనాలు బీటీ పత్తి ఊరూరికి చేరాక రసాయనిక ఎరువులు, క్రిమి సంహారాలు కడుప-కడుపకు చేరి రైతుల జీవితాలతో పరిహాసమాడుతున్న పంటలతో వారికి ప్రాణాంతకంగా మారాయి.

కల్తీ విత్తనాలు, విచ్చలవిడిగా ఎరువుల వాడకం, వాటి కొనుగోళ్ల కోసం అప్పులు, అప్పులపై వడ్డీలు, చక్ర వడ్డీలతో కూడిన పంట చక్రంలో ఎన్నెన్ని చేసినా అనుకున్నంత పంట రాకపోయీ, మండీలలో(అడ్తీ, మార్కెట్)రేటు గిట్టక చివరకు పురుగు మందులతో జీవితాలను చాలించుకుంటున్న రైతుల సంఖ్య, వ్యవసాయాలను వదిలేస్తున్న వారి సంఖ్య, ఉన్న భూమిని కాంటాక్టు వ్యవసాయానికి అప్పచెప్పుతున్న వారి సంఖ్య ఏ యేటికాయేడు పెరుగుతోంది. అమెరికాకు చెందిన పెప్సీ, అమెజాన్, మోన్‌సాంటో (ఇపుడు బేయర్‌గా మారింది)తదితర వ్యవసాయ వ్యాపార కార్పోరెట్లు కాంటాక్టు వ్యవసాయంలో దండిగా లాభాల పంటలు పండించుకుంటున్నాయి. ఉదాహరణకు, 200దేశాలలో వ్యవసాయ వ్యాపారం చేస్తున్న పెప్సీ ఇపుడు దేశంలోని 12రాష్ట్రాలలో 24వేల మంది రైతుల భూములలో బంగాళదుంపల వ్యవసాయం చేస్తూ నాలుగున్నర లక్షల కోట్లకు పైగా గడించింది. కానీ బికనేర్ భూజియా తయారు చేసి అమ్ముకునే 50 వేల రాజస్థానీ నిరుపేద మహిళల చిరు ఆదాయాన్ని 'చాయ్‌వాలా' పెప్సీ మాయతో మంట కలిపాడు. ఈ మధ్య కాలంలో భారత అంబానీలు, అదానీలు ఇంకా అనేకులు ఈ రంగంలోకి దిగారు.

భూసారాన్ని బట్టి సేంద్రియ ఎరువులతో పాటుగా తగిన మోతాదులలో వాడాల్సింది పోయీ విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారాలను వాడుతూ భూములను చవిటి పర్రెలుగా తయారు చేయడమే కాకుండా మనుషుల జీవితాలనూ రోగాలమయం చేస్తున్నారు. ఇది ఈ వ్యవస్థ దుర్నీతి. ఈ సందర్భంగా 'రోగగ్రస్త సమాజ లక్షణం ఆత్మహత్య' అన్న మార్క్స్ మహాశయుడి మాట గుర్తుకు రావడం సహజం.

అధిక దిగుబడి విత్తనాల వినియోగం విస్తృతంగా పెరగడంతో రసాయనిక ఎరువుల వాడకం రైతుల ప్రాణాలు తోడేసే స్థాయికి చేరింది. యూరియా, పొటాష్, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను వాడని పక్షంలో పంట రాని దుస్థితే నెలకొంది. ప్రభుత్వాలు ముందు అనేక సబ్సిడీలిచ్చి వాటి వినియోగాన్ని ఎంతగానో ప్రోత్సహించాయి. కానీ క్రమంగా సబ్సిడీలను ఎత్తేస్తున్నారు. మిగిలిన సబ్సిడీల మొత్తాలను కార్పోరెట్ వర్గాల పెట్టుబడుల అవసరాలను తీర్చడానికి నగదు చెల్లింపుల పేరుతో జన్-ధన్ ఖాతాలలోకి మళ్లిస్తున్నారు. రైతు సబ్సిడీలతో 'చౌకీదార్' మోదీ చేస్తున్న వ్యాపారం అంతిమంగా ఎవరిని ఉద్ధరిస్తున్నాయో లలిత్ మోదీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యాలే దేశం ముందు సాక్ష్యంగా ఉన్నారు.

ఈ మధ్య కాలంలో తాతకు దగ్గులు నేర్పిన చందంగా మన రైతులకు సేంద్రీయ ఎరువుల ప్రాశస్త్యం గూర్చి దళారీ నాయకులు వివరిస్తున్నారు. మరోవైపు తాజాగా ట్రంప్ మహానుభావుడు వర్ధమాన దేశాల పేరుతో సబ్సిడీలను అనుమతించడం డబ్ల్యుటీఓకు తగదని హెచ్చరించాడు. వారి ఆదేశాలను పాటించే దేశ పాలకులు మన

దేశంలో ప్రస్తుతం లభిస్తున్న రూ.70వేల కోట్ల వ్యవసాయ సబ్సిడీలను ఏ క్షణాన ఎత్తేసినా ఆశ్చర్చపడేదేమీ ఉండదు. అంతేకాదు, ట్రంప్ హుకుంను పాటించి ఇరాన్‌తో మనం లావాదేవీలు మానేస్తే, కేవలం చమురు సమస్య, విదేశీ మారకం సమస్య మాత్రమే కాదు, వ్యవసాయ రంగంలోనూ సమస్యలు వస్తాయి. గోధుమల ఎగుమతులు తగ్గడం ఒక్కటే కాదు, రసాయన ఎరువులకు కొరత ఏర్పడుతుంది. రైతు గోస మరింత పెరిగి తీరుతుంది.

**ఓట్లబ్యాంకు పథకాలు:**

మన దేశంలో రైతులను నట్టేటముంచే సర్కార్ పథకాలకు కొదువలేదు. ఆ కోవలోదే 2018లో ఎన్నికలకు ముందు తెలంగాణలోని బడా భూస్వామి కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన 'రైతుబంధు' పథకం. కేసీఆర్ ప్రభుత్వం 'భూ-యజమానులకు' సంవత్సరానికి ఎకరా భూమికిగాను రూ 8,000ను వ్యవసాయ దిగుబడి ఖర్చుల కింద సహాయంగా పంచింది. ఈ మొత్తాన్ని ఖరీఫ్, రబీ సీజన్లలో రెండు దఫాలుగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 58 లక్షల మంది రైతులకు అందించింది. తద్వారా ఓట్ల పంట పండించుకొని విధానసభ ఎన్నికలలో గెలిచిన కేసీఆర్ రెట్టింపు ఉత్సాహంతో 2019 లోకసభ ఓట్ల కోసం అదే రైతుబంధు పథకం ద్వారా మరో రెండు వేలు పెంచి రైతులకు రూ.10,000 ఇస్తామన్నాడు. కౌలు రైతులకు మాత్రం రైతుబంధు వర్తించడం లేదు. దొర గారికి కౌలు రైతులు కేవలం ఓటు వేసేవారు మాత్రమే!

2019 కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం కింద మార్జినల్ రైతులకు యేటా రూ.6,000 ఆర్థిక సాయం అందజేయనున్నట్టు ప్రకటించి ఓట్లు దండుకుని అధికారాన్ని చేపట్టిన మోదీ-2 ప్రభుత్వం, 2019 జూన్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ సహాయ రాశి మొత్తాన్ని రైతులందరికీ వర్తింపచేస్తానని ప్రకటించింది.

మోదీ ప్రభుత్వం రైతులకు వృద్ధాప్యపెన్షన్ రూపంలో నెలకు రూ.3,000 అందచేస్తానని ఇటీవలి బడ్జెట్ విడుదల సందర్భంగా హామీ ఇచ్చింది.

మహిళలకు కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)లు ఇవ్వాలని స్వామినాథన్ సూచించాడు. 1998లో ప్రారంభమైన కిసాన్ క్రెడిట్ కార్డులు రైతాంగానికి భూమి లేదా ఇతర ఆస్తులను తాకట్టు పెట్టడం ద్వారా లక్ష రూపాయల అప్పు ఇచ్చేది. ఆ అవకాశం మహిళలకు కూడా ఉండాలని నాథన్ సూచించాడు. ఎన్నికలకు కొద్ది ముందు మోదీ ఏ హామీ లేకుండానే రైతులకు రెండు లక్షల అప్పు కేసీసీపై ఇస్తామనీ ప్రకటించాడు. మన దేశంలోని ఎంతమంది రైతులకు, రైతు మహిళలకు కిసాన్ క్రెడిట్ కార్డులు, ప్యాన్ కార్డులు, ఈ-నామ్ (జాతీయ వ్యవసాయ మార్కెట్)ల వ్యవహారాలు తెలుసు! అవన్నీ ఎవరి కోసం? దేశంలోని 575మండీలలో 470మండీలకు పైగా ఈ-నామ్ సౌకర్యం కల్పించారు. ఈ-నామ్‌ల ఉద్దేశం కూడా జాతీయ స్థాయిలో స్పాట్ ట్రేడింగ్‌కు లాభం చేకూర్చడమే. ఈనామ్ మార్కెట్లు ఏవీ కూడా వ్యవసాయోత్పత్తులను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే స్థితిలో లేవు. వాస్తవానికి దేశంలో ఉన్న 22వేల గ్రామీణ సంతలతోనే పేదరైతుల నేటికీ తమ అమ్మకాల అవసరాలు తీర్చుకుంటున్నారు.

పైన మచ్చుకు కొన్ని మాత్రమే ప్రభుత్వ పథకాల గురించి ప్రస్తావించాం. ఈ పథకాలన్నీ శ్రామిక వర్గాల ప్రజల గోళ్లూడగొట్టి వసూలుచేసిన సొమ్మునే పలుకుబడి గలవారికి పంచుతున్న పథకాలు తప్ప సంపన్నులపై రాబడి పన్నో, లేదో మరోటో విధించి వారి దోపిడీనుండి వసూలుచేసి అందచేస్తున్నవి కావు. ఈ పథకాలతోనూ లబ్ధి పొందుతున్నది భూ-యజమానులు మాత్రమేనని గుర్తు పెట్టుకుంటే మన దేశంలోని కోట్లాది గ్రామీణ వ్యవసాయ కూలీలు, భూములు లేక ఉన్నోళ్ల భూమి కౌలుకు చేసుకునే రైతులు కష్టాల కడలిలో నష్టాల సాగుతో మునిగిపోవలసిందే! రైతుల ఆత్మహత్యలలో రెండవ స్థానమాక్రమించిన తెలంగాణలో రైతుబంధు అనుభవం చూస్తే అక్కడ ఆత్మహత్యలు ఆగడం లేదనీ, అది ఉన్నత వర్గాలకే లాభపడుతుందని స్పష్టమవుతుంది.

**కౌలు రైతుల అగచాట్లు:**

దేశ రైతాంగంలో అత్యంత అన్యాయానికి గురవుతున్న వారంటే కౌలురైతులే. 'భూమి పట్టా వున్న వారే రైతులు, తక్కిన వ్యవసాయదారులతో ప్రభుత్వానికి సంబంధం లేదు' (ఓట్ల సంబంధం మాత్రం ఉంటుంది) అన్న వైఖరిని ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. దేశంలో పట్టా లేని సాగుదారులలో పెద్ద సంఖ్యలో కౌలు రైతులు ఉన్నారు. ఎకరానికి రూ.10వేల నుండి రూ.20 వేల వరకు కౌలు కడుతూ సేద్యం చేస్తున్నారు. హరియాణాలో ఎకరా రూ.25వేలకు పైగా చెల్లిస్తున్నారు. కేవలం ఒక్క తెలంగాణలోనే 15లక్షలకు పైగా కౌలు రైతులున్నారు. ఈ సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది.

టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో ఆత్మహత్య చేసుకున్న సుమారు ఏడువందలమంది రైతుల్లో 80 శాతం కౌలు రైతులేనని తేలింది. కౌలురైతుల్లో అత్యధికులు దళితులు, ఆదివాసులు, వెనుకబడిన తరగతులవారే కనుక ఈ అధ్యయనం ప్రకారం ఆత్మహత్య చేసుకున్నవారిలో 90 శాతం వారే ఉన్నారు.

2011 కౌలు రైతుల గుర్తింపు చట్టాన్ని అమలు చేసి, వారిని గుర్తించి, రైతుబంధు సహా దేశంలోని అన్ని ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూడాలని రైతాంగం న్యాయమైన డిమాండ్ చేస్తున్నారు. కౌలు రైతులు, మహిళా రైతులు, పోడు రైతులతో సహా వాస్తవ సాగుదారులను గుర్తించి బ్యాంకు రుణాలు వారికి దక్కేట్టుగా చూడాలనీ కోరుతున్నారు. వ్యవసాయానికి ఇచ్చే మొత్తం రుణాల్లో కౌలు రైతులకు దామాషా ప్రకారం రుణ కేటాయింపు జరపాలంటున్నారు.

పై లెక్కల్లో ఆదివాసుల స్థానమెక్కడ! వారి వ్యవసాయ భూములకు ప్రభుత్వ పట్టాలే లేవు. వారికి సాగుదార్ల గుర్తింపు లేదు. అడవులపై ఆదివాసులకే అధికారం అన్నది హుళక్కి అని మోదీజీ సర్కార్ తన దుశ్చర్యల ద్వారా పదే పదే సెలవిస్తున్నది. ఇటీవలే దేశ సుప్రీంకోర్టు

పట్టాలు లేని ఆదివాసులను అడవుల నుండి గెంటెయ్యాలని ఆదేశించింది. పది ఎకరాల లోపు అటవీ భూములను కలిగిన ఆదివాసీ, గైరాదివాసీ రైతులకు పట్టాలివ్వాలని పుష్కరకాలం నాడు చేసిన శాసనాన్ని తక్షణం అమలు చేయని పక్షంలో సాగుదార్లే సంపూర్ణ హక్కుదారులవుతారని ఆదేశించాల్సింది పోయి రైతులను గెంటేసే ఆదేశాలిచ్చి అది తన దోపిడీ వర్గ స్వభావాన్ని చాటుకుంది. వీరి సంఖ్య దేశంలో 12లక్షల పైనే ఉంది. ఈ గడ్డివేళ్ల ప్రజలు ప్రభుత్వ పథకాలన్నింటికీ అందనంత దూరంలోనే ఉండిపోవడం 'మండుతున్న అడవులకు' గాలిలా తోడవుతుంది. దండకారణ్యంలోని బస్తర్ విషయానికి వస్తే 2005-09 మధ్య విరుచుకుపడిన శ్వేత భీభత్సం నల్వాజుడుం మూలంగా లక్షలాది ఆదివాసీ ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారికి కొంప కట్టుకోవడానికే పొరుగు రాష్ట్రం తెలంగాణలో స్థలం కరువైందంటే, ఇక వారికి వ్యవసాయ భూములు, వాటికి భూ-యాజమాన్య పట్టాలు, వాటిపై సర్కార్ పథకాల లబ్ధి పొందడం అంటే లొటపెట పెదవులకు నక్క ఆశ పడిన చందంగానే ఉంటుంది.

### ఋణాల ఊబిలోకి నెడుతున్న పంటల బీమా:

ప్రస్తుతం మన దేశంలోని ఎల్ఐసీ సహ 25 బీమా సంస్థలలో ఒక్క వ్యవసాయ రంగంలోనే 17 బీమా సంస్థలు రంగంలో ఉన్నాయి. ఒక్కొక్కచోట ఒక్కో సంస్థ గుత్తాధిపత్యం కలిగిఉంది. పీఎం-కిసాన్ పథకం క్రింద రెండేళ్లలో ప్రైవేటు, ప్రభుత్వ బీమా కంపెనీలు వసూలు చేసిన కిస్తీ రూ.47,408 కోట్లు. కానీ అవి రైతులకు చెల్లించిన పరిహారం మాత్రం రూ.31,613 కోట్లే. ఈ పథకం అమలులోకి రాకముందు దేశంలో 4.85కోట్ల మంది రైతులకు బీమా ఉండేది. కొత్త పథకం అమలైన తరవాత 2017-18లో ఆ సంఖ్య ఐదు లక్షలు తగ్గి 4.8 కోట్లకు దిగింది. 2016-17లో బీమా సంస్థలకు రూ.530కోట్లు, 2017-18లో రూ.780 కోట్ల మేర లాభాలు వచ్చాయి. బీమా పరిధిలోకి వచ్చే రైతులు తగ్గినా లాభాలు అధికం కావడం మోదీ విశేషం. పీఎం-కిసాన్ హయాంలో బీమా సంస్థల లాభాలు మాత్రమే ఇనుమడిస్తున్నాయి. అన్ని పంటలకు బీమా వర్తింపచేయాలని సూచించిన స్వామినాథన్ సిఫారసును యూపీఏ పాలనలోనే ప్రవేశపెట్టినా 'సబ్‌కా విశ్వాస్'ను నినదిస్తున్న మోదీ 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' మాత్రం ప్రధానంగా బీమా కంపెనీలకు లాభాలు సంపాదించిపెడుతున్నదనీ, వేలకోట్లు దండుకొని వందల కోట్లు మాత్రమే అవి రైతులకు పరిహారంగా ఇస్తున్నాయని భారత రైతులు లబోదిబోమంటున్నారు. కౌలు రైతులకు ఈ పథక ప్రయోజనాలు వర్తించడం లేదు.

### రుణముక్తి రాజకీయాలు:

ఇటీవల లోకసభ ఎన్నికల పార్టీల ప్రణాళికలలో రైతుల ఋణముక్తి హామీ ఇవ్వని పార్టీ బహుశ లేదేమో! అధికారంలో లేని ప్రతిపక్షాలు ఈ విషయంలో ఒక అడుగుముందే ఉన్నాయి. ఇటీవలి మిలిటెంట్ రైతు పోరాటాల ఫలితమిది. వాళ్లు ఆత్మహత్యలకు పాల్పడినన్నాళ్లు దీనికి ఇంతటి ప్రాముఖ్యత దక్కలేదు. కానీ, ఎన్నికల ఫలితాలు వెలువడడం తరువాయి వాటి డొల్లతనం దాపరికం లేకుండా వ్యక్తమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లో అందరికన్నా ముందే రైతులను ఎంతో ఊరించిన యోగీ చివరకు ఎన్నో ఆంక్షలు పెట్టి 'మమ' అనిపించుకున్నాడు. పంజాబ్ రైతులకు భ్రమలే మిగిలాయి. మధ్యప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఒక్కోరైతుకు గరిష్ఠంగా 2వేల రూపాయల మేరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేసింది. కర్ణాటకలో కాంగ్రెస్ అదే హామీ ఇచ్చి అరకొర మాఫీ చేసి చేతులు దులుపుకుంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాలు వేదికలపైనుండి పూర్తిస్థాయిలో వ్యవసాయ రుణాల మాఫీలు ప్రకటించాయి. కానీ, వాటి డొల్లతనం లోకసభ ఎన్నికల ఫలితాల్లోనే వెల్లడైంది. ఖరీఫ్‌కాలం నెత్తి మీదికి వచ్చినా ఋణమాఫీ దిక్కులేక పాత బకాయిలు తీర్చకుంటే కొత్త ఋణాలు ఇచ్చేది లేదని బ్యాంకులు కరాఖండిగా రైతులకు సెలవిచ్చాయి. మరోవైపు పరిశ్రమలను ఆదుకోకపోతే ఆర్థిక వ్యవస్థ అంతా అస్తవ్యస్తం అవుతుందనీ తక్షణం వారికి సహాయం అందించాలనీ మోదీ అండ్ కంపెనీ ఆర్‌బీఐ బోర్డుతో కయ్యానికి దిగి దాదాపు రెండు లక్షల కోట్లు లాగేసిన వైనం తెలిసిన వారికి ప్రభుత్వం ఎవరి పక్షమో, దేశంలో రైతులూ వారి వ్యవసాయం విలువ ఏపాటిదో అర్థమవుతుంది.

నిజానికి ఈ దేశంలో ఋణమాఫీ జిమ్మిక్కులు కొత్తవేమీ కావు. రైతుల రుణాలపై మారిటోరియంలు, మాఫీలు మన దేశ పాలకుల ఓట్ల చిట్కాలలో భాగమే! స్వామినాథన్ సూచనలలోనూ ఋణమాఫీల మాట లేదు కానీ వసూళ్లలో వెసులుబాట్లు ఉండాలన్నాడు. 2008-09లోనే యూపీఏ రైతాంగ రుణాలను రద్దు చేసింది. అయినప్పటికీ రైతాంగ రుణ విముక్తి అయిందెక్కడ! దశాబ్దం తిరక్కముందే మళ్లీ గుట్టల్లా రైతాంగ రుణాలు పేరుకుపోయాయి. వారి మౌలిక సమస్యలకు పరిష్కారం అది కాదని తేలిపోయింది.

### అప్పుల ఊబిలో కడతేరుతున్న రైతు జీవితాలు:

1969లో ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేసింది. అపుడు ప్రజల వద్దకే బ్యాంకులు వచ్చాయి, ఎంతో ఉపయోగపడుతాయి అన్నారు. కానీ ఆచరణలో బ్యాంకులు బడా భూస్వాములకు, పరపతి కలిగిన పెద్దలకు అడ్డమైన దారుల్లో దండిగా ఋణాలిచ్చి అమాయక రైతులను ఎంతగానో మోసగించాయి. రైతులకు ఎప్పటిలా సాహుకార్లే శరణ్యమయ్యారు. మన దేశంలో వ్యవసాయం, లఘు, కుటీర, గ్రామీణ పరిశ్రమలను, హస్తకళలను ఆదుకోవడానికి రూ.100 కోట్ల మూలధనంతో 1982లో ఏర్పడిన 'నాబార్డు' (జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు) 2010లో రూ.2,000 కోట్ల నిధులకు చేరేనాటికి ఆత్మహత్యల పర్వంలో రెండు లక్షలకు మించిన రైతాంగ హత్యలు నమోదయ్యాయి. ప్రస్తుతం సాధారణంగా ఒక హెక్టారు వరకు భూమి కలిగిన వారిని మార్జినల్ రైతులుగా, రెండు హెక్టార్ల వరకూ కలిగిన వారిని చిన్న రైతులుగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయంలో నూటికి 80మంది వీళ్లే! వీరికి లభిస్తున్న బ్యాంకు అప్పులు 30% కాగా అందులో నిర్దిష్టంగా వ్యవసాయానికి అందుతున్నవి 12 శాతమే! దానితో గ్రామీణ రైతులు సాహుకార్ల, వడ్డీ వ్యాపారస్తుల ఉచ్చులో

నుండి బయటపడడం లేదు. దేశంలో పేద ప్రజలకు ప్రభుత్వం అందచేస్తున్న వివిధ రకాల సబ్సిడీలు 2017-18 నాటికి రెండున్నర లక్షల కోట్లకు చేరుకున్నాయనీ సంపన్న వర్గాలు అలజడి రేపుతున్నాయి. కానీ వారు కూడబెడుతున్నదంతా పేదలను దోచుకొనేదే అన్నది వారికి అర్థమైననాడు పేదలకు అన్ని సబ్సిడీల అవసరం తీరిపోతుంది.

2008లో అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభం ఎదురైనప్పుడు మన్మోహన్ ప్రభుత్వం దేశ పారిశ్రామిక రంగాన్ని ఆదుకోవడానికి మూడు లక్షల కోట్ల రూపాయలు కేటాయించింది. మోదీ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి రూ.3.5 లక్షల కోట్ల రాయితీ ఇచ్చింది. 2014 ఏప్రిల్ నుంచి 2018 ఏప్రిల్ మధ్యకాలంలో మన దేశ కార్పొరేట్ రంగం నుంచి పాలకులు మొండి బకాయిలుగా ముద్ర పడిన రూ.3.16లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అంతేకాదు, నయా ఉదారవాద మేధావుల ఆలోచనలను ఆచరణలో పెడుతున్న, జీ-20 దేశాలు అమలుచేస్తున్న విధానాలలో భాగంగా 2017లో మోదీ ప్రభుత్వం చేసిన 'ఫైనాన్షియల్ రెజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్' చట్టం దొడ్డిదారిన బ్యాంకులను ప్రైవేట్‌పరం చేస్తూ ఖాతాదారుల సొమ్ముతో కార్పోరేట్‌వర్గాల నష్టాలను పూడ్చడానికి 'బేయిల్ అవుట్' బదులు 'బేయిల్ ఇన్'కు దారులు తెరిచిందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. కానీ వ్యవసాయం దినదినగండంగా మారిన రైతులు తాము చేసిన అప్పులు తీర్చలేని బాకీల కొలిమిలో తన్లాడుతూ ప్రభుత్వ రుణాలైనా పూర్తిగా మాఫీ చేయాలని కోరుతుంటే ప్రభుత్వాలు నీళ్లు నములుతోంటే కుబేరులు తోకలు జాడిస్తున్నారు.

1995 నుంచి 2015 మధ్యకాలంలో దేశంలో మూడు లక్షలకు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రభుత్వ రికార్డులు వెల్లడిస్తున్నాయి. వెల్లడి కానివి పక్కనపెట్టినా దేశవ్యాప్తంగా రోజుకు 40మందికి పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. 2013 లగాయతు ఏటా సగటున 12,000 ఆత్మహత్యలు జరుగుతున్నాయని కేంద్రం 2017 మే నెలలో నిస్సిగ్గుగా సుప్రీంకోర్టుకు నివేదించింది. రైతుల మౌలిక సమస్యలను పక్కనపెట్టి ఏ పథకాలు రూపొందిస్తున్నా, ఎన్ని ప్యాకేజీలు ప్రకటిస్తున్నా అవేవీ వారిని సరిగా ఆదుకోలేకపోతున్నాయి. గత నాలుగేళ్ల రైతు ఆత్మహత్యల్లో 75శాతం కౌలు రైతులవే!

### హరిత శ్వేత నీలి పసిడి గోల్ విప్లవాలు

మన దేశ వ్యవసాయ రంగంలో స్వామినాథన్ హరిత విప్లవం, పాల ఉత్పత్తులలో వర్గీస్ కురియన్ 'శ్వేత విప్లవం' (ఆపరేషన్ ఫ్లడ్)సాధించారంటారు. పాల ఉత్పత్తులలో మన దేశం ప్రపంచంలోనే మొదటిస్థానానికి చేరింది. నీలి విప్లవం (మాంసం ఉత్పత్తులు ప్రధానంగా లక్షకు పైగా టన్నుల చేప మాంసం ఉత్పత్తితో మన దేశం ప్రపంచంలో రెండవ స్థానానికి చేరింది), పసిడి విప్లవం (నూనె గింజలు, ప్రధానంగా ఆవాలు), గోల్ (ఆలుగడ్డలు)విప్లవం అంటూ అనేక విప్లవాలు సాధిస్తున్నామని ఎన్నో గొప్పలు చెపుతున్న దేశంలోనే ప్రపంచంలోని పేదల్లో మూడోవంతు పేదలు భారత్‌లోనే ఉన్నారన్నది చేదు నిజం. మరోవైపు దేశంలో అమ్ముతున్న పాలలో 75శాతం వరకూ కల్తీ, నాసిరకం అని గతంలోనే నిర్ధారణ అయింది. స్వచ్ఛమైన, నాణ్యమైన పాలు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి పాలకులు పూచీకత్తు ఇవ్వాలని ప్రజల హితవు కోరేవారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. దోపిడీ ప్రభుత్వ విధానాల లాభాల అత్యాశ ఫలితంగా దేశంలో రక్తహీనతతో కోట్లాది పేద మహిళలు అనేక జబ్బుల పాలవుతూ చిక్కి శల్యమవుతున్నారనీ దేశంలో తల్లిపాలు కరువైన కోట్లాది నిరుపేదల పిల్లలు బుక్కెడు పాలకోసం విలవిలలాడుతూ 30శాతం నవజాత శిశువులు. పౌష్టికాహార లోపంతో రోజూ 3వేల పసికందులు ప్రాణాలు వదలుతున్నారనీ నిస్సిగ్గుగా నివేదికలు ప్రచురిస్తుంటారు. వారి విప్లవాలన్నీ సంపన్నుల లాభాపేక్షతోనూ వ్యవసాయ (ఎర్ర) విప్లవాన్ని అడ్డుకోవడానికేనన్నది అర్థం చేసుకోవాలి.

మన దేశంలోని అధిక శాతం ఆదివాసులు ఇప్పటికీ ప్రధానంగా వర్షాధార పంటలనే పండిస్తున్నారు. వారు సాధారణంగా యేడాదికి ఒకే పంట పండిస్తున్నారు. వారు తమ భూములలోని చిన్న-చిన్న కుంటల అంచుల్లో విత్తనాలు విత్తుతూ, ఎత్తైన కట్టల ద్వారా నీరు నిల్వ చేస్తూ పురాతన సాగు పద్ధతులలో పంటలు పండిస్తున్నారు. విప్లవోద్యమ ప్రాంతాలలో మాత్రం పోలీసుల తుపాకులను ఎదుర్కొంటూ సాగునీటి వ్యవస్థను సమకూర్చుకుంటున్నారు. మోదీ ప్రభుత్వం ఆకాంక్ష జిల్లాలని ప్రకటించిన దేశంలోని 115 జిల్లాలలో అధిక శాతం ఆదివాసీ జిల్లాలే ఉండడం గమనార్హం. కానీ ఏ జిల్లాలో కూడా ప్రభుత్వం కానీ, పార్లమెంటు సభ్యులు కానీ చెప్పుకోతగిన విధంగా వారి వ్యవసాయ వికాస కార్యక్రమాలను చేపట్టింది లేదు. అందుకు మావోయిస్టులను సాకుగా చూపి నిందించడం మాత్రం వారికి పరిపాటిగా మారింది.

### మహిళలు

నేటికీ తెలుగు రాష్ట్రాలలో 10-15 శాతం భూమి మాత్రమే స్త్రీల పేరిట ఉంది. అనేక రాష్ట్రాలలో మహిళల పేరు మీదా భూమి పట్టాలన్నారు. దండకారణ్యంలో 1990లలో ముందుకువచ్చిన గ్రామ రాజ్య కమిటీలు స్త్రీ-పురుషుల ఉమ్మడి పేరు మీదా పట్టాలు ఇవ్వడం ప్రారంభించగానే ఆనాటి మధ్యప్రదేశ్ దిగ్విజయ్‌సింగ్ సర్కార్ తానూ ఇస్తానంది. కానీ అది ఉత్త మాటే అయింది. మహిళలు భూ-యజమానులు కాకపోవడంతో వారికి ప్రభుత్వ రాయితీలు లభించవు. సాగుదార్లుగా ఎటువంటి గుర్తింపు లేనందువల్ల మహిళా రైతుల ఆత్మహత్యలు రైతు ఆత్మహత్యల జాబితాలోకి చేరవు. వ్యవసాయ రంగంలో మహిళల దుస్థితులు దుర్భరంగా ఉన్నాయి. నేటి పురుషాధిక్య సమాజంలో వేతనాలలో అసమానతలు, లైంగిక దోపిడీ, అణచివేతలు, శ్రమ స్థలాలలో వివక్ష, ప్రభుత్వ పథకాలకు సరిగా నోచుకోకపోవడం, అధిక శ్రమలాంటి అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. కుటుంబాలలోని పురుషులు కూలీ పనులకు వలస పోయిన సందర్భాలలో కుటుంబ పోషణ బాధ్యత వారే అనివార్యంగా మోయాల్సివస్తుంది. మహిళలూ కూలీకి వెళుతున్న చోటా వారికి ఎదురవుతున్న సమస్యలు మరింత అధికంగా ఉంటున్నాయి. మహారాష్ట్రలోనైతే మహిళలు మరింత అమానవీయ పరిస్థితులు

**తెలంగాణలో ఈ సంవత్సర కాలంలో 27 వేల మంది రైతులు మృతి చెందినట్లు రైతుభీమా రెన్యూవల్‌తో వెలుగులోకి వచ్చింది. ఈ లెక్క ప్రకారం సగటున రోజుకు 74 మంది కన్ను మూసినారు.**

తెలంగాణలో అన్న దాతల మరణాలు గణనీయంగా పెరిగిపోయాయి. ఆత్మహత్యలతో కన్ను మూసిన రైతన్నల సంఖ్య ఏడాది కాలంలో 27 వేలుగా వుంది. 2020 ఆగష్టు 14వ తేది నుంచి ప్రస్తుత జరిగిన మరణాల సంఖ్య ఇది. రైతు భీమా పథకం కొనసాగింపునకు వ్యవసాయ శాఖ లెక్క కట్టగా తాజా మరణాలు వెలుగు చూశాయి. ఈ మరణాలు కేవలం 18-60 యేళ్ళ మధ్యలో వయసున్న రైతులవి మాత్రమే. ఇది కాక రైతు భీమాలో చేరని వారివి 60 ఏళ్ళకు పైబడి వున్న వారివి మరణాల సంఖ్య కలిపితే మొత్తం మరణాల జాబితా మరింత ఎక్కువగానే వుండొచ్చని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. 2020 ఆగష్టు 14 నుంచి 2021 ఆగష్టు 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల మంది రైతులు చనిపోయినట్టు వ్యవసాయ శాఖ ప్రకటించింది. సంవత్సరంలో 27 వేల మంది అయితే రోజుకు సగటున 74 మంది రైతులు మృతి చెందటం ఆందోళనకరం. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి మృతుల సంఖ్య 8వేల మందికి పైగా పెరిగింది. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గడిచిన 3 ఏళ్ళలో సంవత్సరానికి సగటున 17 వేల నుంచి 18 వేల చొప్పున మృతి చెందారు. 2018 ఆగష్టు 14 నుంచి 2019 ఆగష్టు 13 వరకు రాష్ట్రంలో 17 వేల ఎనిమిది వందల నలభై ఐదు మంది రైతులు మృతి చెందారు. 2019 ఆగష్టు 14 నుంచి 2020 ఆగష్టు 13 వరకు 19 వేల మూడువేల యాభైఒక్క మంది రైతులు కన్నుమూశారు. ఈ ఒక్క సంవత్సరంలోనే 27వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొని చనిపోయారు.

(ఆంధ్రజ్యోతి పత్రిక నుండి)

ఎదుర్కొంటున్నారు. అక్కడ గర్భాశయాలు తొలగించుకుంటే తప్ప, మహిళా కూలీలకు చెరుకు కోత కూలీ పనులు దక్కడం లేదు! ఇంతకంటే దౌర్భాగ్యం, దయనీయం, నీచాతి నీచం ఉంటుందా?! ఇక ఆదివాసీ మహిళలైతే దున్నడంతో సహ సమస్త వ్యవసాయ పనులతో పాటు అడవులనుండి వంట కర్రలతో సహ కూరలకు ఆకో, అలమో, కందమూలాలో తెచ్చి వండి కుటుంబాన్ని పోషించడం వరకూ పురుషులకన్నా కాస్తా అధికంగానే శ్రమిస్తారు. ఈ దారుణ పరిస్థితుల నుండి మహిళా విముక్తి విప్లవం లేకుండా ఊహించలేం. మహిళ లేని విప్లవం గెలువబోదు.

### పోరుబాటలో రైతాంగం:

భారతీయ సేద్య రంగంలోని రైతుల జీవితాలు సమస్యల పుట్టగా మారి సతమతమవుతోన్నాయన్నది బహిరంగ రహస్యమే. మన దేశ రైతాంగానికి సుదీర్ఘకాల పోరాట చరిత్ర, వారసత్వం ఉంది. బ్రిటిష్ పాలనలో సేద్యం గిట్టుబాటు కాక మహారాష్ట్ర రైతులు తిరగబడ్డారు. బ్రిటిష్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 1928లో సర్దార్ పటేల్ నాయకత్వంలో జరిగిన బార్డోలీ సత్యాగ్రహం తెలిసిందే! 1938 జనవరిలో మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంత రైతాంగ సమస్యలపై అంబేడ్కర్ వామపక్షాలతో కలిసి అంటరానితనాన్ని పక్కనపెట్టి మహార్, కున్బీ (ఆరె) రెండు విశాల ప్రజా సముదాయాలకు చెందిన 20వేల మంది రైతులను సమైక్యపరిచి కౌలు సమస్యపై అపూర్వమైన ప్రదర్శన జరిపాడు. 1946-47లో బంగాల్‌లో తేభాగా ఉద్యమం తెలిసిందే! ఇవే కాకుండా ఆ కాలంలో మరెన్నో రైతాంగ ఉద్యమాలు జరిగాయి.

కాగా భూమి, భుక్తి, దోపిడీ నుండి విముక్తి కోరుతూ 1946 నుంచి 1951 వరకు కొనసాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జగద్విదితమే. ఆ తర్వాత 1967 నక్సల్‌బరీ నుండి నేటి వరకూ దేశంలో సాగుతున్న వ్యవసాయక విప్లవం మన ముందుంది.

దేశంలో హిందుత్వ శక్తులు గద్దెనెక్కిన తర్వాతి నుండి మిలిటెంటుగా రైతు పోరాటాలు ముందుకు రావడం గమనార్హం. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం, 2014లో 687 రైతు ప్రదర్శనలు జరగగా 2015లో ఒక్క ఏడాదిలోపే 2,683 నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. ఒక సంవత్సరం తర్వాత అంటే 2016లో రైతు నిరసనల సంఖ్య రెట్టింపై 4,837కు చేరుకుంది. మరోమాటలో చెప్పాలంటే కేవలం మూడేళ్ల వ్యవధిలోపే రైతుల నిరసన ప్రదర్శనలు ఏడు రెట్లు పెరిగాయి. తమిళనాడు రైతులు అర్ధనగ్నంగా జంతర్-మంతర్ వద్ద రోజుల తరబడి ప్రదర్శనలు చేశారు. రైతుల్లో పెరుగుతున్న ఆగ్రహావేశాలకు ఇది స్పష్టమైన సంకేతంగా చెప్పవచ్చు.

నాసిక్ నుంచి ముంబై వరకు రైతుల లాంగ్ మార్చ్ తర్వాత హరిద్వార్ నుంచి న్యూఢిల్లీ వరకు కిసాన్ యాత్ర జరిగిన తదనంతరం మరిన్ని భారీ రైతు నిరసన ప్రదర్శనలు జరిగాయి. వీటిల్లో ఆదివాసీలు, భూమి లేని రైతులతో కూడిన అతి పెద్ద ప్రదర్శన కూడా ఒకటి. 2018 మార్చిలో మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా ఆదివాసీ రైతులు తమ న్యాయమైన డిమాండ్లపై 182 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేసి ముంబయి చేరుకున్నారు. 2018 జూన్ 1నుంచి పది రోజుల పాటు దేశవ్యాప్తంగా అన్ని నగరాలకు పాలు, కూరగాయలు, ఆహార ధాన్యాలను నిలిపివేయనున్నట్లు రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ ప్రకటించింది. 110 రైతు సంఘాల సమాఖ్యగా రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ వ్యవహరిస్తోంది. సాగు ఖర్చుతో పాటు దానికి అదనంగా 50 శాతాన్ని స్వామినాథన్ చెప్పినట్టుగా కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని, మొత్తం సాగు రుణాన్ని మాఫీ చేయాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. 'రైతాంగం గత కాలపు అవశేషం కాదు; దేశ, ప్రపంచ భవిష్యత్ నిర్మాణంలో రైతులు, సేద్యం, గ్రామాలు అంతర్భాగం' అని స్పష్టీకరిస్తూ 'ఫార్మర్స్ ఛార్టర్' పేరిట పోరాట కమిటీ విస్తృత డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటుచేసి, రుణభారం నుంచి రైతుల విముక్తి బిల్లుకు, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరను రైతులకు హక్కుగా కల్పించే మరో బిల్లుకు చట్టరూపం ఇవ్వాలని రైతుసంఘాలు గట్టిగా కోరాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు

మందులు, నీటి తీరువా, డీజిల్ తదితర వ్యయాల్ని తగ్గించడం నుంచి, రైతు కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత కల్పన దాకా అనేక డిమాండ్లు ఆ 'చార్టరు'లో పొందుపరిచారు. సమాజంలో అన్నదాతల ప్రాధాన్యతను గుర్తించి వారి పోరాటాలకు విద్యార్థులు, కళాకారులు, మేధావులు, పట్టణ ప్రజలు తమ పూర్తి మద్దతునివ్వడం వ్యవసాయ విప్లవ ఆవశ్యకతకు అద్దం పడుతుంది.

## ముగింపు

నర్మదా నదికి అతి సమీపంలో ఉన్న 70 గ్రామాల్లో నీరు లేక ఓవైపు గుజరాత్ రైతన్నల పొలాలు ఎండిపోతుంటే దాదాపు ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ. 3,000కోట్ల ఖర్చుతో ప్రపంచంలోనే అతి ఎత్తైన 182 మీటర్ల (600 అడుగుల) సర్దార్ పటేల్ విగ్రహం పాదాల క్రింద అందమైన కృత్రిమ జల దృశ్యం కనిపించేందుకు వీలుగా నర్మదా, గరుడేశ్వర్ ఆనకట్టలనుంచి నీరు విడుదల చేశారు. ముంబయి సముద్రంలో శివాజీ విగ్రహానికి మూడున్నర వేలు తగులపెట్టారు. కుంభమేళాలకు రూ. 4,200కోట్లు, తన నిర్వాకాల ప్రచారానికి రూ. 6 వేల కోట్లు, హిందీ భాషా ప్రచారానికి రూ. 800 కోట్లు, జియో కోసం వెయ్యికోట్లు పాలకులు ఖర్చు చేశారు. పేదల పాలిట శాపంగా మోదీ తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం రైతాంగ జీవితంలో అశనిపాతమైంది. దానితోపాటు ప్రపంచంలో మరెక్కడా లేని నాలుగు శ్లాబుల జీఎస్‌టీతో కుదేరిల్లిన చిన్న పరిశ్రమల మూలంగా 35 లక్షల ఉద్యోగాలూడాయి. వివిధ రకాల నష్టపోయిన ఉద్యోగాల సంఖ్య 4.70 కోట్లు అని 'జాతీయ నమూనా సర్వే సంస్థ' తేల్చిచెప్పింది. రాజస్థాన్ టెక్స్‌టైల్, గుజరాత్ డైమండ్ పరిశ్రమల నుండి మూతపడుతున్న వార్తలు అందుతూనే ఉన్నాయి. మోదీ ప్రజాసేవలకు ఉబ్బితబ్బిబై దేశ విదేశీ కుబేరులు అందచేసిన వందలాది బహుమానాలను త్వరలో వేలం వేయనున్నారు. అవి అమ్మగా వచ్చే డబ్బు ఆ హిందూ హృదయ సామ్రాట్ పంట భూములకు సాగునీటి వ్యవస్థను పక్కనపెట్టి 'నమామే గంగా' పథకానికి సమర్పిస్తాడట! ఇదీ పాలకుల వరుస. రైతులపట్ల వారి అనుగ్రహం.

రైతు ఆదాయం యేటా 20,000 అని అధికారికంగానే నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. మూడేళ్ల క్రితమే 7వ వేతన సంఘం చేసిన సిఫారసుల ప్రకారం 45లక్షల మంది కేంద్ర ఉద్యోగులకు, 50లక్షల మంది పింఛన్‌దారులకు లబ్ధి చేకూరగలదని అంచనా వేస్తున్నారు. ఇందువల్ల ఏటా ప్రభుత్వానికి నాలుగున్నర లక్షల కోట్ల రూపాయల భారాన్ని భరిస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నారు. రైతుల గిట్టుబాటు ధరలకు అందులో పదోవంతు చెల్లిస్తే సరిపోతుందంటారు. ప్రభుత్వ ఉద్యోగికి నెలకు కనీస వేతనం రూ. 18,000 లభిస్తుందన్న విషయం తెలిసిన వారికి ఈ దేశంలో 2022 వరకూ మోదీ రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసినా రైతులు ఎంతటి హీన స్థితిలో ఉంటారో విడిగా చెప్పాల్సిన అవసరం లేదు. మన దేశంలో మెజార్టీ రైతుల సమస్య ప్రధానంగా భూమి సమస్య. నాణ్యమైన విత్తనాలు, చౌక ధరలకు ఎరువులు, అవసరమైన పరపతి సౌకర్యాలు, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు రైతులకు లభించాలి. అవి రైతు సమస్యలకు పరిష్కారాలు. కానీ అవేవీ ఈ వ్యవస్థలో వారు పొందలేరు. అనేక పాక్షిక సమస్యలపై పోరాడుతున్న రైతాంగాన్ని మన దేశంలో రివిజనిస్టులతో సహ ఏ దోపిడీ రాజకీయ పార్టీలు వారి మౌలిక సమస్యలపై వారిని సమీకరించవు. అధికారపక్షం రైతు ఆగ్రహంపై నీళ్లు చల్లే కుసంస్కరణలకే పూనుకుంటుంది. ఏ న్యూ ఇండియాలు వారి సమస్యలను పరిష్కరించవు. పూలె ఆశయాలను ఎత్తిపట్టేవారు మెజారిటీ అణగారిన ప్రజల జీవనాధారమైన వ్యవసాయంపై, వ్యవసాయ కూలీలపై ఒక స్పష్టమైన ఆలోచనతో 'కల్టీవేటర్స్ విప్ కార్డ్'లో వ్యవసాయాన్ని ప్రజాధార పరిశ్రమగా గుర్తించాలని, ప్రభుత్వమే చెరువులు, కాలువలు తవ్వించాలని, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూమిని ప్రజల సౌకర్యార్థం పంచాలని కోరిన ఏ డిమాండ్ కోసం పోరాడడంలేదు. పొద్దస్తమానం అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని స్తుతిస్తూ పబ్బం గడుపుకుంటున్న దళిత నాయకులు కనీసం ఆయన కోరినట్టయినా దేశంలోని భూములను జాతీయం చేయాలనీ, సహకార సంఘాల ద్వారా సేద్యం చేయాలనీ దళితుల భూ సమస్య పరిష్కారానికి నడుం బిగించడం లేదు. సారాంశంలో చెప్పదలుచుకున్నదేమంటే వారెవరూ భూమి సమస్యను ఎత్తడమే లేదు.

నిజానికి ఈ దేశంలో వ్యవసాయక విప్లవం ద్వారానే రైతుల మౌలిక సమస్యల పరిష్కారం సాధ్యం అవుతుంది. ఆ విప్లవం కేవలం రైతాంగ సమస్యేకాదు. అది సామాజిక సమస్య. రైతాంగం నిస్సందేహంగా అందులో ప్రముఖ పాత్ర పోషిస్తారు. వారికి అన్ని సెక్షన్ల ప్రజల సమరశీల మద్దతు అవసరం. ఆ దిశలో కదులుతున్న రైతాంగానికి, మద్దతిస్తోన్న ప్రజానీకానికి కార్మికవర్గం నాయకత్వం అందించాలి. నేటి రైతాంగ పోరాటాలను ఆ దిశలో పురోగమింపచేసే లక్ష్యంతో నాయకత్వాన్ని అందించాల్సిన ఆవశ్యకత ఉంది. ఇది ఈ నాటి తక్షణ సమస్య.

కూలగొట్టబోయె ఇంటిమీద మరమ్మత్తు కోసం ఖర్చు పెట్టే మూర్ఖులు ఎక్కడా ఉండరన్నట్టు దేశంలోని 80%కి పైగా వ్యవసాయదారుల మౌలిక సమస్యలపై మన పాలకులు ససేమిరా దృష్టి పెట్టరు. ప్రస్తుత మోదీ పాలనలో మతపర హింస, నిరుద్యోగం, ఫేక్ న్యూస్ ప్రళయ తాండవం చేస్తున్నాయనీ విశ్లేషిస్తూ అనేకమంది బుద్ధిజీవులు ఫిలిప్పైన్స్‌లోని రోడ్రిగో డిటెర్టె, ఇండోనేషియాలోని జోకో వినోడోతో మోదీ పాలనను పోలుస్తున్నారు. వాళ్లూ ఈయనలాగే అక్కడి సమాజాలను సమూలంగా మారుస్తామని కంకణం కట్టుకొని అధికారానికి వచ్చినవారే! గతంలో యూపీఏ భారత్‌నిర్మాణ్ అంటే ఈయన నయాభారత్ అంటున్నాడు. అందరి గురువులు ఒక్కరే, అందరి పాఠ్యాంశాలు సరళీకృత ఆర్థిక విధానాలే. కాకపోతే టీకా, టిప్పణీలు సొంతం. చరిత్రలో ఏ నియంతల పాలనైనా, చివరకు వారి జీవితాలైనా అత్యంత విషాదంతోనే పరిసమాప్తమయ్యాయి. హిట్లర్ తన ప్రేయసీతో కలిసి ఆత్మహత్యకు పాల్పడితే, గోబెల్స్‌లాంటి మంత్రులు బాడీగార్డుల చేతులలో చావును కోరుకున్నారు. చరిత్ర పునరావృతమవుతుంది, కాకపోతే కొత్త పుంతాలపైన అంటారు. మోదీ, షా, భాగవత్‌లెవరైనా అందుకు ఎంతమాత్రం మినహాయింపు కాదు.

# దున్నే వారికే భూమి ప్రాతిపదికన వ్యవసాయ విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవం ఒక్కటే రైతాంగానికి మార్గం

**(ఈ వ్యాసం భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు – మన రాజకీయ కార్యక్రమం అనే డాక్యుమెంట్ నుంచి తీసుకోబడింది. సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికారిక డాక్యుమెంట్).**

(డాక్యుమెంట్ 214 పేజీ నుండి 221వ పేజీ వరకు)

1947 ఆగస్టు 15న బూటకపు స్వాతంత్ర్యం పేరుతో సామ్రాజ్యవాదులతో షరీకైన దళారీ నిరంకుశ బూర్జువావర్గం బడా భూస్వామ్య వర్గాలు అధికారంలోకి వచ్చాయి. ఈ మూడు మహా పర్వతాలు విశాల అర్ధభూస్వామ్య సామాజిక పునాదిని వినియోగించుకుని ప్రజలను బంధనాల్లో ఉంచాయి, దేశంలో భూస్వామ ఆధిపత్యాన్ని పరిరక్షించి, కొనసాగించాయి. దీంతో దళారీ దోపిడీ పాలకవర్గాలు అటు దేశంలో పరిశ్రమల్ని అభివృద్ధి చేయలేకపోయాయి. దేశాన్ని రుణగ్రస్త దేశంగా మార్చి దేశ ఆర్థిక జీవితాన్ని సామ్రాజ్యవాదుల విచ్చలవిడి దోపిడికి నిలయం చేసాయి. ఇటు వ్యవసాయాభివృద్ధికి అడ్డంకిగా తయారయ్యాయి. వ్యవసాయోత్పత్తి ఒక మేరకు పెరిగినా అందులో అత్యధిక భాగం భూస్వాముల గాదెలలోకి చేరుతోంది. అశేష పీడిత జనం తిండికి మలమలమాడే దుస్థితికి గురిచేసింది. అందువల్ల ఈ కింది ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలలో ఏ ఒక్కటీ పరిపూర్తి కాలేదు:

- "దున్నేవాడికే భూమి" ఆధారంగా భూస్వాములకు యెలాంటి నష్టపరిహారం లేకుండా భూమిని స్వాధీనం చేసుకోవడం.
- భూస్వాముల భూములను వ్యవసాయ కూలీలకు, నిరుపేద రైతులకు, కింది మధ్యతరగతి రైతులకు తిరిగి భూపంపకం చేయడం.
- ప్రజా ప్రయోజనాలకు ఆటకంకాని విధంగా వ్యవసాయంలో ఆధునిక యంత్రాలను, ఆధునిక శాస్త్రీయ విజ్ఞానాన్ని ఉపయోగించి ఉత్పత్తిని గరిష్ట స్థాయికి పెంచడం.
- "వ్యవసాయాన్ని పునాదిగా తీసుకొని, పరిశ్రమలను నాయకత్వంలో ఉంచే" సూత్రంపై, "రెండు కాళ్ల మీద నడిచే" వరుస విధానాలపై ఆధారపడి దేశాన్ని పారిశ్రామికం చేయడం.
- సహకార వ్యవసాయ ఉద్యమాన్ని, వ్యవసాయ సహకార సంఘాలను ప్రోత్సహించడం, పెంపొందించడం.
- సామ్రాజ్యవాద సంస్థల, కంపెనీల, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ కంపెనీల, ప్రభుత్వ భూములను జాతీయం చేయడం.
- నిరుద్యోగాన్ని నిర్మూలించడం.

ఈ కర్తవ్యాలు పూర్తి కాకపోవడానికి కారణం ప్రజాస్వామిక విప్లవానికి బడా బూర్జువావర్గం ద్రోహం చేయడం. అందువల్ల 1947 ఆగస్టు 15న లభించినది ప్రజాస్వామిక విప్లవ విజయం కాదనీ, అది సామ్రాజ్యవాదులతో షరీకైన దళారీ బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలు చేసిన కుట్ర అనీ చరిత్ర రుజువు చేసింది. కాబట్టి ఇప్పటికే దేశంలో ఆనాటికానాటికి తీవ్రతరమవుతున్న దారిద్ర్యబాధ నుండి పీడిత జనం విముక్తి కావాలంటే పై కర్తవ్యాలను నెరవేర్చగల నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయాలి. అయితే దానికి నాయకత్వం వహించే సత్తా జాతీయ బూర్జువావర్గానికి లేదు. దళారీ నిరంకుశ బూర్జువా వర్గం చేతిలో దెబ్బలు తింటున్నప్పుడల్లా ఈ వర్గం ఎంతో ఆందోళన చెందుతున్నప్పటికీ దానికి ఆ సత్తా లేదు. తుదివరకు విప్లవానికి నాయకత్వం వహించగలిగేది ఒక్క కార్మికవర్గమే. అందువల్ల గ్రామసీమలలో నివశిస్తున్న నూటికి 70 మందిగా వున్న వ్యవసాయ కూలీలు, పేదరైతులు కార్మికవర్గ పార్టీ నాయకత్వం కింద సమైక్యం కావాలి.

గ్రామీణ ప్రాంతాల్లో మన పార్టీ పీడిత రైతాంగాన్ని సమీకరించి ప్రతీ గ్రామంలో భూమి కేంద్రీకరణ ఎలా ఉందో నిర్దిష్టంగా, స్పష్టంగా పరిశీలన జరిపి వర్గ సంబంధాల-వర్గ వైరుధ్యాల నిర్దిష్ట స్థితిని అర్థం చేసుకోవాలి. గత 72 సంవత్సరాలలో భూమి కేంద్రీకరణలో వచ్చిన మార్పులు ఈ సందర్భంగా దృష్టిలో ఉంచుకోవాలి. తరతరాలుగా మన దేశంలో గ్రామీణ ప్రజానీకం భూమిపై ఆధారపడే జీవిస్తూ వచ్చారు. 72 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా 54.38 శాతం గ్రామీణ కుటుంబాలు కడుపు నిండా తిండి, కట్టు బట్టా లేక అలమటిస్తున్నారంటే అందుకు ప్రధాన కారణం ఆయా కుటుంబాల భూములను భూస్వాములు కాజేయగా, ఆ కుటుంబాలన్నీ కనీస జీవనాధారం కోల్పోవడమే. ఈ భూమి కేంద్రీకరణ ఒక్కో ప్రాంతంలో ఒక్కో రీతిగా వుండవచ్చు. కాని ఆ కుటుంబాలు కటికదారిద్ర్యంలో కూరుకుపోవడానికి మూలకారణం భూమి వివిధ రూపాలలో అతితక్కువ మంది భూస్వాముల చేతిలో కేంద్రీకరింపబడి వుండటమే. దీనిని ఈనాడు ప్రభుత్వం కూడా కాదనడానికి సాహసించలేదు. పెద్దెత్తున భూపరిమితి చట్టాలు రూపొందించినప్పటికీ గ్రామీణ ప్రాంతంలో అసమానతలు పెద్దగా తగ్గలేదని 1964లో మహాలనోబిస్ కమిటీ స్వయంగా పేర్కొంది.

గత 72 సంవత్సరాలను పరిశీలిస్తే పరిమాణంలో మార్పులు జరిగినప్పటికీ గుణాత్మక మార్పు ఏదీ రాలేదు. అందువల్ల ఈ దారుణ పరిస్థితి మారాలంటే 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికపై భూమిని యావత్తూ తిరిగి పంచడం మినహా మరో మార్గం లేదు. అందుకుగాను భూస్వామ్య విధానాన్ని నిర్మూలించి దున్నేవారికే భూమి పంచే నినాదంపైన పీడిత ప్రజలందరూ ముక్కుమ్మడిగా సంఘటితం కావాలి.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు ఎక్కువగా అభివృద్ధి చెంది వున్న పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్ వంటి కొన్ని ప్రాంతాలలో వ్యవసాయ కూలీలను, పేద, మధ్యతరగతి రైతాంగాన్ని, కలిసి వచ్చే ధనిక రైతాంగ సెక్షన్‌ను సంఘటితపరిచి సామ్రాజ్యవాద బహుళజాతి/దళారీ నిరంకుశ బూర్జువా/ప్రభుత్వ సంస్థల వ్యవసాయ క్షేత్రాలను ఆక్రమించుకొని సహకార వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి.

అయితే అలా భూమిని తిరిగి పంపకం చేయడము లేదా సహకార వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడము కేవలం ఉత్తిమాటలతో జరిగే పనికాదు. భూస్వాములు తరతరాలుగా పీడిత ప్రజల రక్తాన్ని దోచుకుని, కూడవేసిన భూముల్ని తేలికగా విడిచిపెడతారనడం కల్ల. అంతేకాదు, భూస్వాములకూ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ పార్టీల ప్రభుత్వాలు తమ లక్షలాది సాయుధ సైన్యాలతో వారికి అండదండలిచ్చి వారి దోపిడీని కాపాడడానికే కంకణం కట్టుకున్నవనే యదార్థాన్ని తెలంగాణ, తెభాగా, నక్సల్బరీ రైతాంగ విప్లవాలతో పాటు పలు రైతాంగ ఉద్యమాలు, వర్తమాన బీహార్-ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ, దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర), పశ్చిమ బంగ్, ఒడిశా, తమిళనాడు, కర్నాటక, కేరళం తదితర సాయుధ రైతాంగ విప్లవాలు చాటిచెబుతున్నాయి. కనుక పీడిత ప్రజలు యావన్మందీ, ముఖ్యంగా అశేష రైతాంగం, సమాజంలో అత్యంత విప్లవకరమైన కార్మికవర్గ నాయకత్వం కింద సమీకృతులై సాయుధులై తెగించి పోరాడడం ద్వారా, వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా మాత్రమే భూమిని సాధించుకోగలుగుతారు. అది మరో మార్గంలో జరగడం అసంభవమని చరిత్ర తేల్చివేసిన సత్యం. అందువల్ల గ్రామీణ రైతాంగం యావత్తూ ఈ చారిత్రక అవసరాన్ని గుర్తించి సాయుధులై ముందుకురావాలి. తమకంటూ ఒక ప్రజాసైన్యం నిర్మించుకోవాలి. భూస్వాములు, వారి ప్రభుత్వం సృష్టించే కుల విభేదాలను అధిగమించి అన్ని కులాల పీడితులు ఒకటి కావాలి. ఆకలితో చచ్చేకంటే పోరాటంలో చావడమే ఉత్తమమనే తెగింపుతో పోరాడటానికి ప్రతి రైతూ, ప్రతి కూలీ సిద్ధం కావాలి.

అదే విధంగా నిజమైన ప్రజాస్వామ్యం గూర్చి కలలుగనే మేధావులు, అభ్యుదయ భావాలు గల ప్రజాస్వామికవాదులు, విప్లవ విద్యార్థులు, యువకులు విప్లవ ఊహాగానాల నుండి విప్లవ ఆచరణలోకి దిగాలి. నూటికి 54 మందిగా గల గ్రామీణ పీడితులు, మొత్తం దేశంలో 80 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యంతో అలమటిస్తున్న యే దేశంలోనూ నిజమైన ప్రజాస్వామ్యం నెలకొనదు. అందుకే ప్రజాస్వామ్యం గూర్చి కలలుకనే ప్రతి ఒక్కరూ, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల ఫాసిజాన్ని వ్యతిరేకించేవారందరూ భారతదేశ ప్రజాస్వామిక విప్లవానికి కీలకమైన ఈ వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయడంలో తమ పాత్రను జయప్రదంగా నిర్వహించాలి. మేధావులు, కవులు, గాయకులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు గ్రామీణ పీడిత ప్రజానీకంతో మమేకమై వారిలో విప్లవాగ్నిని ప్రజ్వరిల్లజేయాలి. పీడిత రైతాంగ విప్లవ జ్వాలలను దేశవ్యాప్తంగా ప్రచండ దావానలంగా మార్చి అందులో దేశాభ్యుదయానికి అడ్డంకిగా వున్న భూస్వామ్య విధానాన్ని భస్మీపటలం చేసేందుకు సాహసించి ముందుకు రావాలి. దారి కంటకావృతమే, కానీ ఇంతకు మించి మరో మార్గం లేదు.

గత 7 దశాబ్దాల కాలంలో భారతదేశంలోని ఉత్పత్తి సంబంధాల్లోని మార్పులను విశ్లేషించుకున్నాం. ఈ విశ్లేషణ ఆధారంగా మనం సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి మారిన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వర్గపోరాట కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం వుంది. గత 72 ఏండ్లుగా అమలవుతున్న అర్ధవలస అర్ధభూస్వామ్య విధానాల ఫలితంగా, దాదాపు గత 52 సంవత్సరాలుగా మన పార్టీ నాయకత్వంలో జరుగుతున్న వర్గపోరాట ప్రభావం రీత్యా, ప్రత్యేకంగా 3 దశాబ్దాలుగా అమలవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల ఫలితంగా దేశవ్యాప్తంగా అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలహీనపడింది, వక్రీకరించబడిన పెట్టుబడిదారీ సంబంధాలు సాపేక్షికంగా పెరిగాయి. ఇందులో భాగంగా ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలలో జరిగిన మార్పులతో పాటు టెర్రయిన్ మార్పులు, లోతట్టు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పెరుగుతున్న ప్రభుత్వ యంత్రాంగపు పట్టు, విస్తరణ – వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని మన దేశ అసమానాభివృద్ధిని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మార్పులు మన దేశ సామాజిక స్వభావాన్ని గుణాత్మకంగా, మౌలికంగా మార్చగలిగేవి కావు. అందువల్ల మన దేశం ఇప్పటికీ అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశమే. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే ఈ వ్యవస్థ మౌలిక స్వభావం మారుతుంది. అయితే ఈ మార్పుల దృష్ట్యా మన వ్యూహం-ఎత్తుగడల డాక్యుమెంట్‌లో పేర్కొన్న 5 కేటగిరీలున్న గ్రామీణ ప్రాంతాలతో పాటు మరో రెండు కేటగిరిలను చేర్చుకోవాల్సిన అవసరం ఉంది. అవి: 1. కొండలు, గుట్టలు, అడవులతో వున్న ప్రాంతాలు; 2. వర్గ వైరుధ్యాలు తీవ్రంగా ఉండి ఇప్పటికీ అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలంగా వున్న ప్రాంతాలు; 3. వర్గ వైరుధ్యాలు తీవ్రంగా ఉండి, ప్రపంచీకరణ విధానాల ఫలితంగా, మన పార్టీ నాయకత్వంలో జరిగిన తీవ్రమైన వర్గపోరాటాల ఫలితంగా, అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలహీనపడిన ప్రాంతాలు; 4. వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు సాపేక్షికంగా బలంగా వున్న ప్రాంతాలు; 5. సముద్ర తీర ప్రాంతాలు; 6. నగర ఆర్థిక జీవితంతో విడదీయలేనంతగా ముడివడిన నగరశివారు (సబర్బన్) గ్రామీణ ప్రాంతాలు; 7. ప్లాంటేషన్స్ ప్రధానంగా వున్న ప్రాంతాలు. (ఇందులో 3వ, 7వ రకం గ్రామీణ ప్రాంతాలు కొత్తగా చేర్చుకున్నవి).

ఈ వర్గీకరణ యావత్తు దేశానికీ, అన్ని రాష్ట్రాలకూ, రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకూ వర్తిస్తుంది. కాబట్టి సీసీ, ఎస్ఏసీ/ఎస్‌జడ్‌సీ/ఎస్‌సీలు పై వర్గీకరణను దృష్టిలో పెట్టుకుని నిర్దిష్ట పరిశీలన జరిపి వ్యూహాత్మక దృష్టితో సరైన ఎత్తుగడలు రూపొందించుకోవాలి. వివిధ ప్రాంతాలలో కలిగే మార్పులకు అనుగుణంగా ఎత్తుగడలు మార్చుకోవాలి. అందువల్ల ఈ వ్యూహాత్మక నాయకత్వ కమిటీలు ఒక్కో రాష్ట్రంలో, రాష్ట్రాల సరిహద్దుల్లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి స్థాయి, ఉత్పత్తి

సంబంధాల స్థితి, వర్గపోరాట ప్రభావం, ప్రపంచీకరణ ప్రభావం, కులపీడన, టెర్రరిజం, ప్రభుత్వ యంత్రాంగపు పట్టు అనే అంశాల ఆధారంగా ఆయా ప్రాంతాలను వర్గీకరించుకోవాలి. ఈ వర్గీకరణ ఆధారంగా ఆయా ప్రాంతాల్లో సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు, భూస్వాములకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వర్గపోరాట కార్యక్రమాన్ని, వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని ఇందుకోసం తగిన ఎత్తుగడల్ని (పోరాట నిర్మాణ రూపాల్ని) రూపొందించుకోవాలి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇందులో భాగంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్లిష్టంగా మారినందువల్ల ఈ మార్పులను దృష్టిలో ఉంచుకుని, ఆయా ప్రాంతాలలో ప్రధాన నినాదంపై (దున్నేవారికే భూమి చెందాలి, విప్లవ రైతాంగ కమిటీలు, రైతుకూలీ సంఘాలు, విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల, పెట్టుబడిదారీ భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల వ్యవసాయ క్షేత్రాలను, ప్లాంటేషన్స్‌ను ప్రజాపరం చేయండి, జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కోసం పోరాడండి) కేంద్రీకరించి పోరాడుతూనే మన బలాబలాలను బట్టి సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు సాగించే అన్ని రకాల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా తగిన పోరాట, నిర్మాణ రూపాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఇప్పటికే ఆచరణ క్రమంలో సంపాదించిన సకారాత్మక అనుభవాలను వినియోగించుకుని నేటి మన ఉద్యమ ప్రాంతాలలోనే కాకుండా దేశవ్యాప్తంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం, విస్తృతం చేసేందుకు కృషి చేయాలి. అందుకోసం సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటంలో ఈ కింది డిమాండ్లతో రైతాంగాన్ని, మిత్ర వర్గాలను కదిలించాలి.

- భూస్వామ్య ఆధిపత్యాన్ని కూలదోసి భూమిలేని వ్యవసాయ కూలీల, పేదరైతుల, నాయకత్వం కింద ప్రజా రాజకీయ అధికారాన్ని నెలకొల్పాలి.
- పాత, కొత్త భూస్వాముల, మత సంస్థల వద్ద, భూస్వామ్య దోపిడీ, ఆధిపత్యాన్ని చెలాయించే వడ్డీ వ్యాపారులు/ఫైనాన్స్ సంస్థల యజమానులు, సారా వ్యాపారులు, పంటల వ్యాపారులు, బడా వ్యాపారులు, ప్రైవేటు గిడ్డంగుల యజమానులు, ధాన్యం మిల్లు ఓనర్లు, గ్రామీణ పరిశ్రమల, రియల్ ఎస్టేట్ల, సినిమా థియేటర్ల, పెట్రోల్ పంపుల, ట్రాన్స్‌పోర్టు యజమానులు, విద్యా సంస్థల యజమానుల వద్ద, ఇసుక, గ్రానైట్ తదితర మైనింగ్ మాఫియాల వద్ద, బహుళజాతి కంపెనీలు, దళారీ కార్పొరేట్ కంపెనీలు, ఎన్ఆర్ఐలు, ఎన్‌జీఓలు, తదితరుల మిగులు భూములను, వివిధ రకాల ఖనిజాల తవ్వకం, పరిశ్రమలు, సెజ్‌లు, ప్లాంట్లు, కారిడార్లు, ప్లాంటేషన్లు, ఫారంహౌసులు, ఫ్లైఓవర్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, బుల్లెట్ ట్రెయిన్, మెట్రో రైల్, ఎయిర్‌పోర్టులు, షిప్‌యార్డులు తదితర పేర్లతో ప్రభుత్వం కబ్జా చేసి అప్పగించిన భూములను ఎలాంటి నష్టపరిహారం లేకుండా జప్తు చేసుకొని, వ్యవసాయ కూలీ, పేదరైతులకు పంపిణీ చేయాలి. రైతుల వద్ద నుంచి అక్రమంగా ఆక్రమించుకున్న భూములను, భూసంస్కరణల కింద పంపిణీ చేయబడిన భూములను తమ ఆధిపత్యంలో ఉంచుకున్న భూస్వాములకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని నిర్మించి భూములను తిరిగి హక్కుదార్లకు (సంబంధిత వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు, మధ్యతరగతి రైతులకు) అప్పగించాలి.
- వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు ఎక్కువగా అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాలలో వ్యవసాయ కూలీలను, పేద, మధ్యతరగతి రైతాంగాన్ని, కలిసి వచ్చే ధనిక రైతాంగ సెక్షన్‌ను సంఘటితపరిచి సామ్రాజ్యవాద బహుళజాతి/దళారీ నిరంకుశ బూర్జువా/ప్రభుత్వ సంస్థల వ్యవసాయ క్షేత్రాలను ఆక్రమించుకొని సహకార వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి లేదా ఆ వ్యవసాయ క్షేత్రాలను విప్లవ ప్రజా ప్రభుత్వాలు జాతీయం చేయాలి.
- అడవిపై హక్కు ఆదివాసులదీ, పీడిత ప్రజలదీ. అటవీ సంపదను సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, బడా కాంట్రాక్టర్లు కొల్లగొట్టడాన్ని అడ్డగించాలి.
- ప్రజలను సాయుధం చేసి విస్తృత ప్రాతిపదికన సాయుధ ప్రజా మిలీషియాను నిర్మించాలి.
- ప్రభుత్వానికి పన్నులు, లెవీలు చెల్లించడం నిలిపివేయాలి.
- కుల, మత విభేదాలను రెచ్చగొట్టడం ద్వారా పీడిత ప్రజలను చీల్చడానికి ప్రయత్నించే భూస్వాముల, దళారీ ప్రభుత్వ కుతంత్రాలను సాగనీయరాదు.
- దళితులలో నూటికి 95 మంది, ఆదివాసులు, వెనుకబడిన కులాలవారిలో మెజారిటీ వ్యవసాయ కూలీలు, పేదరైతులు. అందువల్ల కూలిరేట్లు పెంచుకోవడానికి, అధిక పని గంటలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలి. న్యాయమైన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేయాలి. నేటికీ వివిధ రూపాల్లో కొనసాగుతున్న జీతగాళ్ల జీతాలను పెంచుకోవడానికి, దళితులపై, ఆదివాసులపై, ఇతర వెనుకబడిన కులాలపై కొనసాగుతున్న సామాజిక అన్యాయాలను, అవమానాలను ప్రత్యేకించి అంటరానితనం, వెట్టిచాకిరి తదితర ఆర్థికేతర దోపిడీ, పీడన, అణచివేతలను నిరోధించడానికి, కౌలురేట్ల తగ్గింపుకు, 'వ్యక్తిగత సాగు' పేరుతో కౌలుదార్లను భూముల నుండి తొలగించకుండా నిరోధించాలని, వారిపై అమలు చేస్తున్న భూస్వామ్య దోపిడీ, పీడనలను, కట్టుబానిసత్వాన్ని అరికట్టాలని, భూస్వాములకు, ధనిక రైతులకు భూమిని కౌలు (రివర్స్ కౌలు)కు ఇవ్వడాన్ని నిషేధించాలని, తదితర డిమాండ్ల సాధనకై వ్యవసాయ కూలీలు, పేదరైతులు అంతా ఒకటి కావాలి. అంటే దళితులు, ఆదివాసులు, వెనుకబడిన

కులాలవారు భూస్వాములకు వ్యతిరేకంగా ఒకటి కావాలి.

- వ్యవసాయాన్నీ, సహకార ఉద్యమాన్నీ అభివృద్ధి చేయాలి. ఉత్పత్తిని పెంచాలి. అన్ని రంగాలలో స్వయంసమృద్ధిని సాధించాలి.
- వివిధ వ్యవసాయేతర రంగాలలో, ఇటుక తయారీ, నిర్మాణరంగం, చెరకు పరిశ్రమ, ధాన్యాన్ని ఆరబెట్టే (ప్రాసెసింగ్) యూనిట్లు మొదలైన వాటిలో శ్రామికుల/అర్ధ-కార్మికులపై భూస్వామ్య శక్తులు సాగించే దోపిడీకి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రత్యేక నిర్మాణ, పోరాట రూపాలను రూపొందించుకొని వర్గ పోరాటాన్ని నిర్మించాలి. ఉపాధి గ్యారంటీ పథకాన్ని అడ్డుకునే భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. సీజనల్ శ్రామికులు ఎదుర్కొంటున్న పలు రకాల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలి.
- పీడక కులాలలో కూడా అత్యధికులు పేదరైతులు, మధ్యతరగతి రైతులు. ఆనాటికానాటికి వారిలో కూడ భూమి కోల్పోయి కూలినాలి చేసికొనవలసిన స్థితికి గురైన వారి సంఖ్య పెరుగుతున్నది. వారు కుల చాదస్తపు మత్తుతో భూస్వాముల కుట్రలకు లోనయ్యే ప్రమాదం వున్నా, వారికి కూడా వ్యవసాయ విప్లవం ఒక్కటే శరణ్యం. అందువల్ల యేనాటికయినా నిజం గుర్తించి వారు దళితులకు, ఆదివాసులకు, వెనుకబడిన కులాలకు చెందిన వ్యవసాయ కూలీ, పేద రైతాంగంతో కలిసితీరాలి. అందువల్ల వారిని ప్రతి సమస్యపైనా కలుపుకొని వచ్చేందుకు ప్రయత్నించాలి. వారిని, కుల అహంభావాన్నీ, బంధుత్వాలనూ ప్రయోగించి దళిత, వెనుకబడిన కులాలకు చెందిన వ్యవసాయ కూలీ, పేద రైతాంగంతో కలవకుండా చేయడానికి భూస్వాములు విశ్వప్రయత్నం చేస్తారు. మనం ఇటువంటి పరిస్థితులలో వారు వాస్తవాలను అర్థం చేసుకునేలా వ్యవహరించాలి. భూస్వాములకు వ్యతిరేకంగా అన్ని కులాలకు చెందిన కూలీలను, పేద రైతులను సమైక్యం చేయడానికి ప్రయత్నించాలి. ఆ ప్రయత్నంలో మనం నెగ్గనంతవరకు వ్యవసాయ విప్లవం జయప్రదం కావడం కష్టమే. కనుక అందుకు ఓపికతో పని చేయాలి.
- వ్యవసాయంలో వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరించిన చోట అన్ని కులాలకు చెందిన వ్యవసాయ కూలీలతో సహా ఇతర అర్ధ శ్రామికులను కలుపుకొని వ్యవసాయ కూలీ సంఘాలు నిర్మించాలి. అలాగే అన్ని కులాలకు చెందిన రైతులతో రైతు సంఘాలు నిర్మించాలి. ఎట్టి పరిస్థితిలోనూ భూస్వాములను రైతు సంఘాలలో చేర్చుకోకూడదు. లేకుంటే రివిజనిస్టుల సంఘాల మాదిరిగా రైతుసంఘాల పేరుతో భూస్వాముల సంఘాలు ఏర్పడతాయి. రైతు అంటే పేద రైతు, మధ్యతరగతి రైతు అనే అర్థం. రైతులలో నూటికి తొంభైమంది వారే. వారి నాయకత్వం కిందనే రైతు సంఘాలు నిర్మించాలి. ఇందులో ధనిక రైతులను కూడా కలుపుకునేందుకు కృషి చేయాలి.
- భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, పంటల వ్యాపారుల, ధాన్యం మిల్లులు, ఇతర మిల్లుల యజమానుల రుణాలను, వడ్డీలను చెల్లించడం నిలిపివేయాలి. పాత, కొత్త భూస్వాములు ముందుకు తెచ్చిన నూతన దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా పోరాడాలి. రైతులకు వడ్డీలేని రుణాలు/స్వల్ప వడ్డీకి రుణాలు ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాడాలి. ఊరుమ్మడి భూములపై, ఆస్తులపై, పంచాయితీలపై, పంచాయితీ నిధులపై, ప్రభుత్వ పథకాల, ప్రభుత్వ సహకార బ్యాంకుల నిధులపై, ప్రభుత్వ, ప్రైవేటు కాంట్రాక్టులపై, ప్రకృతి వనరులపై (ఇసుక, గ్రానైట్, రంగురాళ్లు తదితర ఖనిజాలు, కలప, వనమూలికలు, అటవీ ఉత్పత్తులు), ప్రభుత్వ చౌక దుకాణాలపై (రేషన్ షాపులపై) భూస్వామ్య శక్తుల ఆధిపత్యానికి, ప్రభుత్వ నిధులను కాజేయడంలో వారి భారీ అవినీతి కుంభకోణాలకు వ్యతిరేకంగా, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలపై అధిక అద్దెలు వసూలు చేయడానికి వ్యతిరేకంగా పీడిత ప్రజల అధికారం కోసం నాలుగు విప్లవ వర్గాలను సంఘటితం చేసి వర్గ పోరాటాన్ని నిర్మించి అభివృద్ధి చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో రియల్ ఎస్టేట్, రవాణా, ఫైనాన్స్, సారా వంటి వ్యాపార లావాదేవీల్లో భూస్వామ్య దోపిడీని అరికట్టేందుకు వివిధ పోరాటాలు చేపట్టాలి.
- బహుళజాతి, దళారీ కంపెనీల, భూస్వామ్య కూటమి సాగించే దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలు నిర్మించాలి.
- గ్రామీణ ప్రాంతంలో దళితుల, మహిళల, మత మైనారిటీల హక్కుల పరిరక్షణకై పోరాటాలు చేపట్టాలి. వారిపై బ్రాహ్మణవాద హిందుత్వ భూస్వామ్య శక్తులు జరిపే దోపిడీ పీడనలను అడ్డుకోవాలి.
- ఏ పార్లమెంటరీ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా భూసంస్కరణలు, దళితుల ఉద్ధరణ, రైతులకై పలు పథకాలు, సంస్కరణలు మొదలైన పేర్లతో బూటకపు సంస్కరణలను ముందుకు తెస్తున్నాయి. ఈ బూటకపు సంస్కరణల నినాదాల జోరూ, ప్రచారాల హెూరూ అంతా కేవలం పీడిత ప్రజలలో లేనిపోని భ్రమలు రేకెత్తించి వారిని విప్లవపథం నుండి పక్కదారి పట్టించి, అణచివేయడానికి ఆడుతున్న దొంగనాటకాలే తప్ప వేరేంకాదు. ఈ సంస్కరణలలో పీడిత ప్రజల స్థితిగతులను మెరుగుపరచడం, వెనుకబడిన కులాల ఉద్ధరణ కేవలం నేతిబీరకాయలో నేయి లాంటిదేనని విశాల ప్రజానీకానికి సోదాహరణంగా స్పష్టంగా తెలియజెప్పాలి. ఇది నిజమైన ప్రజాస్వామికవాదులందరి కర్తవ్యం. ఈ నిజాన్ని గుర్తించనివారు, దానిని ప్రజలకు తెలియజెప్పనివారు, పైకి ఎన్ని కబుర్లు చెప్పినా వారు వాస్తవానికి భూస్వాములకూ, దళారీ బూర్జువావర్గానికి సేవ చేసేవారుగా మిగులుతారు తప్ప ఎప్పటికీ నిజమైన ప్రజాస్వామికవాదులు కాలేరు. ✪

# తెలంగాణలో రగులుతున్న పోడు పోరు

**పోడు భూములకు పట్టాలిచ్చేంత వరకు ఆదివాసులకు కూడా రైతుబంధు, రైతుభీమా ఇచ్చేంత వరకు ఇంద్రవెల్లి అమరుల పోరాట స్ఫూర్తితో హక్కులు సాధించుకునేంత వరకు పోరాడుదాం.**

ఆదివాసులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు హరితహారం పేరుతో పంటలను నాశనం చేసి మొక్కలను నాటుతున్నారు. దీనితో గిరిజనులు చేతికి వచ్చిన పంట కండ్ల ముందట నాశనం కావడంతో కోపోద్రిక్తులై ఫారెస్టు అధికారులపై దాడులు చేస్తూ ఘర్షణ పడుతున్నారు. ఫారెస్టు అధికారులు పోలీసుల అండదండలతో ఆదివాసులపై దాడులు చేస్తూ మహిళలని చూడకుండా చిత్రహింసలకు గురి చేసి, అక్రమ కేసులు బనాయించి జైళ్ళల్లో పెడుతున్నారు. దశాబ్దన్నర కాలం నుండి పోడు భూముల పట్టాలకై ఆదివాసులు పోరాడుతూనే వున్నారు.



గంగారం మండలంలో పోలీసులతో ఘర్షణ



కందకాలు తవ్వకుండా ఎక్సకవేటర్‌కు అడ్డుపడిన మహిళలు

పోడు భూములపై ఆదివాసీలకు సాగు హక్కులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్ఓఎఫ్ఆర్) యాక్ట్ 2006ను అమల్లోకి తెచ్చింది. 2005 డిసెంబర్ 13 వరకు సాగుల్లో వున్న పోడు భూములపై సాగుదారులకు హక్కులు కల్పించాలని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు పోడు భూములపై సర్వే చేసి పోసేషన్‌లో వున్న వారికి హక్కులు కల్పించాలని ఆదేశించింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం 2007లో భూములపై సర్వే చేయించగా దాదాపు 40 లక్షలకు పైగా ఎకరాల భూమి పోడు వ్యవసాయం కింద వున్నట్టు తేలింది. ఒక్క తెలంగాణలోనే 13 లక్షల ఎకరాలకు పైగా పోడు భూములున్నాయని తేల్చారు. అదిలాబాద్, నిర్మల్, కొమురంభీం, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ వంటి మొత్తం 24 జిల్లాల్లో పోడు భూముల సమస్య వుంది. తెలంగాణ రాష్ట్రంలో ఆదిమ జాతికి సంబంధించిన గోండు, కోయ, కొలాం, చెంచు, తోటి, కొండరెడ్లు, దొరల, నాయకపోడు, పరదాన్లు, బంజార వంటి ఆదివాసీ తెగలకు చెందిన మూల వాసులు కొంత మంది గిరిజనేతరులు పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం బూటకపు వాగ్దానాలను చేస్తూ అధికారంలోకి వచ్చిన తర్వాత వాగ్దానాలన్నింటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తున్నారు. పోడు భూముల పట్టాలకై పోరాడుతున్న ఆదివాసులకు హామీలు గుప్పిస్తూ, భరోసాలు ఇస్తూ మోసం చేస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పోడు భూములకు సాగు హక్కులు కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఒక్క తెలంగాణలోనే 186679 క్లెయిమ్స్ వచ్చాయి. ఇందులో వ్యక్తిగత అర్జీలు 183252 కాగా, సామూహిక (కమ్యూనిటీ-గూడెంలోని ఆదివాసులు అందరూ కలిసి సాగు చేసుకునే భూమి) అర్జీలు 3427గా వున్నాయి. మొదటి దశ కింద 3.16 లక్షల ఎకరాలకు హక్కులు కల్పించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఆర్ఓఎఫ్ఆర్ చట్టాన్ని అమలు చేయలేదు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పోడు భూములకు సాగు హక్కులు కల్పించడానికి గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు అప్పట్లో ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు ఆ కమిటీలు ఉనికినే కోల్పోయాయి. అవి వున్నాయో లేదో కూడా అధికార్లకు తెలియని పరిస్థితి.

## వాటి పని విధానం

పోడు భూములకు సంబంధించి ముందుగా గ్రామ స్థాయి కమిటీకి గిరిజనులు దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ సభలు నిర్వహించి ఆ దరఖాస్తులు వాస్తవమో కాదో గ్రామ కమిటీలు తేలుస్తాయి. అర్హతమైన అర్జీలను జిల్లా కమిటీలకు పంపుతారు. జిల్లా కమిటీలు వాటిని పరిశీలించి రాష్ట్రస్థాయి కమిటీకి పంపుతాయి. రాష్ట్ర స్థాయి కమిటీ అర్జీలను ఆమోదిస్తుంది. తర్వాత ఫారెస్ట్, రెవెన్యూ శాఖలు అర్జీలలో పేర్కొన్న భూములపై జాయింట్ సర్వే చేసి నిజమో కాదో నిర్ధారిస్తాయి. సరిహద్దులు కరక్టే అని తేలితే భూసాగు హక్కులు కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ యాక్ట్ 2006 చట్టంలో ఇంత స్పష్టంగా పేర్కొన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ చట్టాన్ని తుంగలో తొక్కి పోడు భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసులకు హక్కులు కల్పించకుండా బూటకపు వాగ్దానాలు చేస్తూ బట్టేబాజి మాటలతో ఆదివాసులను మోసం చేస్తున్నారు.

2009లో కేంద్ర ప్రభుత్వమే పోడు భూములపై గిరిజనులకు సాగు

హక్కులు కల్పించేలా ఆర్ఓఎఫ్ఆర్ చట్టాన్ని అమల్లోకి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఒక్క సెంట్ భూమిపై ఇప్పటి వరకు ఆదివాసులకు హక్కులు కల్పించలేకపోగా వైఎస్ఆర్ హయాంలో మొదటి దశ కింద 3.16 లక్షల ఎకరాలకు హక్కులు కల్పించిన సాగు భూముల నుండి తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ హరితహారం కింద 40 వేల ఎకరాలను గుంజుకొని మొక్కలు నాటించిండు. అంతే కాకుండా 2020 మార్చి వరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిన వివరాల ప్రకారం మొత్తం క్లెయిమ్స్‌ల్లో 94360 క్లెయిమ్స్‌ను పరిష్కరించామని దాదాపు 7.54 లక్షల ఎకరాలపై గిరిజనులకు సాగు హక్కులు కల్పించామని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. కాని తెలంగాణ ఏర్పాటయ్యాక రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ ప్రజా దర్బార్‌లు నిర్వహించిన దాఖలాలు లేవు. ఒక్క ఎకరంపై కూడా సాగుదారులకు హక్కులు కల్పించిన దాఖలాలు లేవు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు హామీలు, భరోసాలు, వాగ్ధానాలు చేయడమే తప్పా తెలంగాణ ప్రజలకు చేసింది ఏమి లేదు.

## పోడు భూములపై హక్కులు కల్పిస్తానని కేసీఆర్ ఇచ్చిన హామీ, భరోసా, వాగ్ధానం

| హామీ : 2018 శాసనసభ ఎన్నికలకు ముందు అధికార టీఆర్ఎస్ పార్టీ తన మెనిపెస్టోలో ఇచ్చిన హామీ. | 2019 జూలై నెలలో పోడు భూములపై అసెంబ్లీలో సీఎమ్ కేసీఆర్ గిరిజనులకు ఇచ్చిన భరోసా : | నల్గొండ జిల్లా హాలియాలో 2021 ఆగష్టు 2న జరిగిన నాగార్జున సాగర్ నియోజకవర్గ ప్రగతి సమీక్షలో సీఎమ్ వాగ్ధానం. |
|---|---|---|
| అటవీ ప్రాంతాల్లోని గిరిజన, గిరిజనేతర రైతుల భూవివాదాలను పరిష్కరించి యాజమాన్య హక్కులు కల్పిస్తాం. పోడు భూముల విషయంలో నెలకొన్న వివాదాలను త్వరితగతిన పరిష్కరిస్తాం. ఇతర రైతులకు అందిస్తున్న ప్రయోజనాలను వారికి వర్తింపజేస్తాం. | గిరిజనులను రక్షించాలి. పోడు భూముల వ్యవహారాన్ని తేల్చివేయాలి. అన్ని జిల్లాలు, అన్ని డివిజన్లకు నేనే స్వయంగా పోతా, నేనొక్కన్నే కాదు... మొత్తం మంత్రి వర్గాన్ని, అటవీశాఖ ఉన్నతాధికార్లను, చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీలను అందర్ని తీసుకెళ్ళి... తాలూకా కేంద్రాల్లో ప్రజా దర్బార్లు పెట్టి.. "ఇదిగో ఇది పోడు భూమి.. ఇదిగో మీ పట్టా" అని ఇచ్చేస్తాం. దానిని ఫైనల్ చేస్తాం. ఆ తర్వాత ఒక ఇంచు భూమి కూడా ఆక్రమణల పాలు కానివ్వం. పొరుగు రాష్ట్రం నుంచి గుత్తి కోయలు వచ్చి తమ ఇష్టం వచ్చినట్లు చెట్లను నరికేస్తున్నారు. దీనితో మన గిరిజనులు నష్టపోయే పరిస్థితులుంటున్నాయి. అందుకే ఈ పోడు భూములకు ఎక్కడో ఒక దగ్గర భరత వాక్యం కలపాలి. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం హక్కులు కల్పిస్తాం. ఆపేద గిరిజనులకు కూడా రైతుబంధు, రైతుభీమా రావాలి. వాళ్ళు బతకాలి. "వాళ్ళు మన బిడ్డలే". | రాష్ట్రంలో పోడు భూముల సమస్యను పరిష్కరించాలని కేబినేట్ సమావేశంలో చర్చించాము. ఈ చట్టం కేంద్రం పరిధిలో వుంది. 2005 సంవత్సరం కటాఫ్‌తో రాష్ట్రంలో అవకాశం వున్న అందరికి పోడు భూముల సమస్యను పరిష్కరించాలని నిర్ణయించాం. |



## పోడు భూమిలో మొక్కలు నాటొద్దని అధికారులను అడ్డుకుంటున్న రైతులు

నూతనంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీలు, భరోసాలు, వాగ్ధాలు ప్రకటనలతో తెలంగాణ ప్రజల్ని మోసం చేస్తున్నారు. తెలంగాణలో ఆదివాసులు, దళితులు కొద్ది మంది ఆదివాసేతరులు తరతరాల నుండి పోడు భూములు సాగు చేసుకుంటున్న వారి భూములపై కేసీఆర్ ప్రభత్వం దుర్మార్గంగా ఫారెస్ట్ అధికార్లను ఉసిగొల్పి పోడు భూములను బలవంతంగా గుంజుకొని హరితహారం పేరుతో మొక్కలను నాటుతున్నారు. దీనితో ఆదివాసులు కోపోద్రిక్తులై ఫారెస్ట్ అధికార్లపై దాడులు చేస్తూ వాళ్ళ భూములని కాపాడుకుంటున్నారు. ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి ఆదివాసులపై దాడులు చేస్తూ అరెస్టులు చేసి, చిత్రహింసలు పెట్టి, అక్రమ కేసులు పెట్టి జైళ్ళల్లో పెడుతున్నారు. దశాబ్ధన్నర క్రితమే కేంద్రం తీసుకవచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ చట్టాన్ని అమలు చేయకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూముల సాగుదారులపై దుర్మార్గంగా వ్యవహరిస్తున్నది.

# కులవ్యవస్థ పుట్టుక

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికారిక డాక్యుమెంట్ నుండి భారతదేశంలో (కుల సమస్య – మన దృక్పథం).**

భారత ప్రజాస్వామిక విప్లవ ప్రత్యేక సమస్యలలో కులసమస్య ఒకటి. దీనికి మూలాలు వర్ణవ్యవస్థలోనూ, బ్రాహ్మణవాదంలోనూ ఉన్నాయి. భారతదేశ సామాజిక పరిణామపు ప్రత్యేక స్వభావంతో ముడిపడివున్న కులవ్యవస్థ, ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు దోపిడీ వర్గాలు శ్రామిక ప్రజానీకాన్ని దోచుకునే అత్యంత ముఖ్యమైన సాధనంగానే ఉన్నది. మెజారిటీ పీడిత ప్రజానీకాన్ని దోపిడీ చేయడాన్ని, అణచివేయడాన్ని సుసాధ్యం చేసేటటువంటి భావజాలం గానూ, సామాజిక వ్యవస్థ గానూ కులవ్యవస్థ భారత పాలకవర్గాలకు ఉపయోగపడుతున్నది. కులవ్యవస్థ నిర్మూలన కోసం సరైన కార్యక్రమం రూపొందించుకోవడానికి ముందుగా మనం కులవ్యవస్థ ఎలా పుట్టిందో, ఎలా అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలి.

మన దేశంలో కులవ్యవస్థ మూలాలకు మూడువేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్నది. వర్గసమాజం అభివృద్ధి చెందడంతోనూ, రాజ్యం ఆవిర్భావంతోనూ, ఫ్యూడల్ ఉత్పత్తి విధానం అభివృద్ధితోనూ, దోపిడీ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ లోకి స్వంత ఆచారాలు, అలవాట్లు కలిగిన తెగల సముదాయాల నిరంతరాయ, తరచుగా బలవంతపు విలీన క్రమంతోనూ కులవ్యవస్థ విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నది.

దిగువ ఇచ్చిన మూడు చారిత్రక కాలాల ద్వారా కులవ్యవస్థ పుట్టుక, అభివృద్ధులను గుర్తించవచ్చు.

**1. వర్ణాశ్రమ ధర్మ కాలం :**

క్రీ.పూ. 1500–క్రీ.పూ. 500 మధ్యకాలంలో వాయవ్య దిశ నుండి దేశంలోకి వలస వచ్చిన పశుపాలకులైన ఆర్యతెగలు స్థానిక వ్యవసాయక తెగలతోనూ, వ్యవసాయేతర తెగలతోనూ ఘర్షిస్తుండినప్పుడు వర్ణాలు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) వర్గాలుగా ఉనికిలోకి వచ్చాయి. క్షత్రియులు, బ్రాహ్మణులు పాలక కూటమిగా, వైశ్యులు దోపిడీకి గురైన రైతాంగంగా ఉండేవారు. ఈ క్రమంలో వ్యవసాయం ప్రధానమైన ఉత్పత్తి విధానంగా అవతరించడంతో కట్టుబానిసలుగా(captive slaves) అతిహీన వర్ణంగా శూద్రవర్ణం ఏర్పడింది. ఈ విధంగా క్రీ.పూ. సుమారు 500 ప్రాంతంలో రాజ్యం ఆవిర్భవించింది.

**2. తొలి ఫ్యూడల్(proto-feudal)రాజ్య కాలం :**

క్రీ.పూ. 500 నుండి క్రీ.శ. 4వ శతాబ్దం వరకు గల కాలం, ఇనుప నాగలి విస్తృతంగా వాడుకలోకి వచ్చిన కాలం, స్థిర గ్రామ జీవితంతో కూడిన వ్యవసాయం విస్తరించిన కాలం. ఈ కాలంలో వైశ్య రైతాంగం నుండి పాలక కూటమిగా ఉన్న క్షత్రియులు, బ్రాహ్మణులు పన్నుల రూపేణా, కానుకల రూపేణా మిగులును దోచుకునేవారు. విస్తారమైన రాజు భూముల(సీతా భూములు)లో శూద్రులు నిర్బంధ శ్రమ చేసేవారు. వాణిజ్యం, పెద్దపెద్ద రాజ్యాలు వృద్ధి చెందాయి. బౌద్ధ, జైన మతాలు వ్యాప్తి చెందాయి.

**3. బ్రాహ్మణీయ కుల ఆధారిత ఫ్యూడల్ కాలం :**

క్రీ.శ. 4వ శతాబ్దం నుండి బ్రిటీషువారు వచ్చేవరకు గడచిన ఈ కాలంలో, రాజుకు, ప్రజలకు మధ్య భూదానాలు (land grants) పొంది పన్ను వసూలు చేసే హక్కును కలిగిన చిన్నచిన్న పాలెగాళ్ల (feudatories), దళారీలు(intermediaries) ఏర్పడ్డారు. కుల వ్యవస్థ స్థిరపడింది. బౌద్ధమూ, జైనమూ క్షీణించాయి. బ్రాహ్మణ మతం ప్రాబల్యం పొందింది.

పైన చెప్పినవి అతి విశాలమైన దశలు (పీరియడ్స్) మాత్రమే కాగలవు. చాలా విశాలమైన దేశంలోని ఒక్కొక్క ప్రత్యేక ప్రాంతంలోనూ తేడాలు ఉండేమాట నిజమే. కానీ, సాధారణ ధోరణులు మొత్తం భారతదేశానికి వర్తిస్తాయి.

క్రీ.పూ. 2000 నాటికే తేలికపాటి వ్యవసాయం చేసే కంచుయుగపు నాగరిక సమాజాలు భారతదేశంలో ఉన్నాయి. సింధులోయ ప్రాంతంలోని ద్రావిడులు ఇనుము, నాగలి తెలియని కాలంలోనే నదులకు ఆనకట్టలు కట్టి నీటిని మళ్లించి పంటలు పండించారు. మొహంజొదారో, హరప్పా వంటి పట్టణాలను ప్రపంచంలో నాగరికత తెలిసిన మొదటి కాలంలోనే నిర్మించారు. సింధు వ్యాపారులు నైలు, మెసపొటేమియా వంటి పురాతన నాగరిక సమాజాలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉన్నారు. ఆ కాలంలో భారత ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో కంచు యుగపు వ్యవసాయ సమాజాలు, చిన్న చిన్న ఆటవిక సమాజాలు ఉన్నాయి. కొన్ని తెగలు వ్యవసాయం, ఆహార సేకరణ, పశువుల పెంపకం చేసేవి. దక్షిణ ప్రాంతంలో నావికా వ్యాపారం కూడా ఉంది. అయితే కంచుయుగంలో ఇనుప యుగం కంటే ఉత్పత్తి తక్కువ. ఆ ఉత్పత్తి అంతా రాజన్య, పురోహిత, వర్తక వర్గం చేతుల్లో కేంద్రీకృతమైనది.

క్రీ.పూ. 1500–500 సంవత్సరాలలో పశుపాలక సంచార జీవితం గడుపుతున్న ఆర్యులు భారతదేశంలోకి ప్రవేశించారు. వారికి అప్పటికే బట్టలు నేయడం, వైద్యం చేయడం, ఆయుధాలు తయారు చేయడం తెలుసు. వారు ప్రాచీన సింధు నాగరికత కలిగిన నాగరిక జాతులైన కంచుయుగపు ద్రావిడులను, తమ కంటే వెనకబడిన రాతియుగపు అటవికులను ఓడించారు. అప్పటికే ద్రావిడులలో ఉనికిలో ఉన్న మాతృస్వామిక వ్యవస్థ స్థానంలో ఆర్యుల పితృస్వామిక వ్యవస్థ ప్రారంభమైంది.

ఆర్యులు వాయవ్య దిక్కు నుండి ప్రవేశించి గంగానదీ పరివాహక ప్రాంతం దిశగా వ్యాపించారు. అప్పటికి వారు 'రాజన్య' అనే ప్రభువులు (Aristocracy)గానూ, 'బ్రాహ్మణులు' అనే పురోహితులుగానూ, 'విశ్' అనే సాధారణ గణ సభ్యులుగానూ విభజించబడి ఉన్నారు. తూర్పు దిశగా సాగిన ఆర్యుల విస్తరణతో ముడిపడిన అంతులేని ఘర్షణలలోనూ, యుద్ధాలలోనూ, వివిధ పశుపాలక ఆర్యతెగల మధ్య, ఆర్యతెగలకు, స్థానిక తెగలకు మధ్య నీటి వనరుల కోసం, భూమి కోసం, తర్వాతి కాలంలో బానిసల కోసం జరిగిన ఘర్షణలలోనూ ఓడిపోయిన తెగలను బానిసలను గావించడం ప్రారంభమైంది. అలా బానిసలుగా గావించబడిన వారిని దాసులు–దస్యులు అని పిలిచేవారు.

ఆర్యులకు ఇతర తెగలతో యుద్ధాలు జరిగినపుడల్లా దాసులు ఆర్యుల పక్షాన పోరాడేవారు. అప్పటికే ఉత్తర భారతదేశంలో ఆహార

ఉత్పత్తిని సాధించిన ఆర్యులది వ్యక్తిగత ఆస్తి సమాజం కాక, భూమినీ, పశువులనూ సమిష్టి ఆస్తిగా కలిగిన గణసమాజం కావడం వలన వీళ్లకు లోబడిన దాస తదితర ఆర్యేతరులు బానిసలు కాలేదు. వారు మొత్తం ఆర్యగణాలకు సమిష్టి సేవకులయ్యారు, వర్ణరీత్యా శూద్రులయ్యారు. దాసులను బానిసలుగా కాక శూద్రులుగా లోబరచుకోవడం వలన భారత సమాజంలో రోమ్ తరహా బానిస వ్యవస్థ ఏర్పడలేదు. దాని స్థానంలో పూర్తిగా పరిణతి చెందని బానిస సమాజం ఏర్పడింది.

యుద్ధాల ఫలితంగా తెగనాయకుల(Chieftains) ప్రాముఖ్యత పెరిగింది. తమ ప్రతిష్టను పెంచుకోవడానికి, సంఘటితం చేసుకోవడానికి, మిగులును దోచుకోవడానికి వారు కర్మకాండ పైన ఆధారపడ్డారు. ఈ కర్మకాండలలో సాధారణమైన విశ్‌లు రాజన్యులకు పశువులను, బానిసలను సమర్పించుకునేవారు. బ్రాహ్మణులతో కలిసి రాజన్యులు పెద్ద, చిన్న యజ్ఞాలను నిర్వహించడం నానాటికి పెరిగిపోయింది. ఈ యజ్ఞాలలో విశ్‌లు చెల్లించే కానుకలు (దానం/బలి)పై ఆధారపడి పాలక ఉన్నత వర్గాలైన రాజన్యులు, పూజారులు జీవనం సాగించేవారు. ఈ దశలో గణ సంబంధాల పైన, బంధుత్వాల పైన ఆధారపడిన తెగ నిర్మాణాలు ఇంకా ప్రాబల్యం వహిస్తుండినాయి. ఈ బంధుత్వాలపై ఆధారపడిన గణాలు విచ్ఛిన్నమైపోయి, విశ్‌లూ, లొంగదీసుకున్న తెగలూ సమర్పించే కప్పాల(tributes)పై, కానుకల(gifts)పై ఆధారపడి బతికే ఒక విశాల వర్గం-వర్ణం ఏర్పడే క్రమంలో బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు ఆవిర్భవించాయి. ఆర్య పశు పాలక తెగలు, స్థానిక తెగల నుండి వ్యవసాయాన్ని నేర్చుకున్నాయి. ఈ స్థానిక తెగ నాయకుల గణాలను, పూజారుల గణాలను వరుసగా క్షత్రియ, బ్రాహ్మణ వర్ణాలలో చేర్చుకున్నారు. ఆ విధంగా ఆర్యులు తమలో ఇలా ఆర్యేతరులను కలుపుకుంటూనే ఉన్నారు. అయినప్పటికీ క్షత్రియులు, పురోహితులు కలిసి ఆర్యుల జనాభాలో అల్ప సంఖ్యలోనే ఉండేవారు. ఓడిపోయిన ఆర్య, ఆర్యేతర తెగలన్నీ క్రమంగా శూద్రవర్ణంగా మారాయి. అయితే శూద్రులుగా మారిన వారందరూ బానిసలు కారు. గృహ బానిసత్వం ఉండినప్పటికీ, ప్రధానంగా వైశ్య రైతులు (బంధుత్వాలపై ఆధారపడిన విశ్ నుండి విశాలమైన వైశ్య వర్ణం ఆవిర్భవించింది), శూద్రులు (సాపేక్షికంగా పరిమాణంలో చిన్నదైన వర్ణం) పశువులు కాచారు, వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు.

ఆయుధాల కోసం మాత్రమే గాక వ్యవసాయక అవసరాల కోసం కూడా ఇనుము విస్తృతంగా వాడుకలోకి రావడంతో, సుమారు క్రీ.పూ. 800 నుండి ప్రాచీన తెగ సమాజాల ఉత్పత్తి వ్యవస్థలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. నాగలితో చేసే వ్యవసాయం క్రమం తప్పకుండా గణనీయమైన మిగులును సృష్టిస్తుంది. దట్టమైన అరణ్యాలను నరికి భూమిని సాగుకు సిద్ధం చేయడం సాధ్యమైంది. ఇలా ప్రాచీన కాలంలో వ్యవసాయక ఆర్థిక వ్యవస్థ ప్రధాన ఉత్పత్తి విధానంగా మారడాన్ని ఇనుము సుసాధ్యం చేసింది. వ్యవసాయేతర తెగలను దెబ్బతీయడం ద్వారానే వ్యవసాయ విస్తరణ సాధ్యమైంది. వ్యవసాయేతర తెగలను లొంగదీసుకున్నారు, లేదా అడవుల నుండి సాంప్రదాయిక జీవనాధారం నుండి వారిని గెంటివేశారు. నూతన భూభాగాలను జయించడం, స్థిర నివాసాలు ఏర్పడే అవకాశాలు ఏర్పడడం తెగ నాయకుల ప్రాధాన్యతను మరింతగా పెంచాయి. తెగలను పాలించే నాయకత్వ బృందాలు (tribal oligarchies) ఆవిర్భవించాయి. అనేక మంది తెగ నాయకులు తమ స్వంత గణాల పైన, తెగల పైన, తమ ఆధీనంలోని భూభాగాల పైన తమ పాలనను సంఘటితం చేసుకున్నారు. బ్రాహ్మణ పురోహిత వర్గం అప్పటికే వర్ణాశ్రమ ధర్మాన్ని అభివృద్ధి చేసింది. కర్మకాండలు మరింత సంక్లిష్టంగానూ, ధన, కాల వ్యయాలతో కూడినవిగానూ మారాయి. ఈ కర్మకాండలు మిగులును పునఃపంపిణీ చేసే సాధనాలు. కానుకల రూపంలో రాబట్టిన మిగులును పాలకులైన క్షత్రియులు, బ్రాహ్మణ పురోహితులు పంచుకునేవారు. కానుకలు ఇక ఎంతమాత్రమూ స్వచ్ఛందంగా సమర్పించుకునేవి మాత్రం కావు, నిర్బంధంతో కూడినవి. రాజుల, పురోహితుల అధికారం పెచ్చుపెరిగిపోవడాన్ని, జయించిన తెగలను దిగువ వర్ణాలలో చేర్చుకోవడాన్ని ఆర్యధర్మం, వర్ణభావజాలం ధర్మసమ్మతమైనవిగా చేశాయి. వివిధ తెగల నుండి ఆవిర్భవించిన వర్గాలకు భావజాలపరమైన వ్యక్తీకరణగా ఆర్యధర్మం, వర్ణభావజాలం మారింది.

ఆర్యులు హింసతో పాటు సర్దుబాటు, సామాజిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని కూడా సాధనాలుగా ఉపయోగించుకున్నారు. ఉత్పత్తి ప్రాథమిక దశలో ఉన్నప్పటి వర్ణాలే వర్గాలు. ఆర్యులు ఉత్పత్తి దారుల నుండి అదనపు ఉత్పత్తిని కాజేసేందుకు వీలుగా మత-తాత్విక(religio-philosophical)రూపాన్ని ఎంచుకున్నారు. క్రమంగా ఆర్యులు, అనార్యుల మధ్య అంతరువులు నశించి, ఆర్యులదిగానే ఒక నూతన తెగ ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది. వైదిక కాలం నాటి బలి, పూజాది కార్యాలు నిర్వహించే బ్రాహ్మణులు ఆర్యధర్మాన్ని ఆటవిక సమాజంలోకి చొప్పించేందుకు క్రమంగా అడవులలోకి చొచ్చుకొనిపోయి, స్థానిక ఆదివాసీ సమూహాలలో ఉండిన అసంఖ్యాక మూఢాచారాలకు గౌరవం కలిగించారు. వారు తెగల, రాజకుటుంబాల వంశ వృక్షాలను పురాణాలుగా రాశారు. వారు స్థానిక తెగనాయకులను మంచి చేసుకునేందుకు పాములను, కోతులను పూజించే తెగ ఆచారాలను, నరబలులను, జంతు బలులను అంగీకరించారు. ఈ విధంగా బ్రాహ్మణులు తెగల మూఢ విశ్వాసాలన్నింటికీ అధికార ఆమోదముద్ర వేయడం ద్వారా తమ వ్యతిరేక శక్తుల సహకారాన్ని సంపాదించారు. వ్యవసాయ కార్యకలాపాలకు అవసరమైన చంద్రమానాన్ని నిర్ధారించడానికి దీర్ఘకాలిక పరిశీలన, గణితం, అలాగే ఖగోళ శాస్త్రం తెలియనిప్రాచీన ఆదిమ తెగలలో వ్యవసాయ మెలకువలు ప్రవేశపెట్టారు. ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటుతో ఇనుప నాగలి వంటి కొత్త ఉత్పత్తి సాధనాల వాడకం, ప్రధాన జీవనాధారంగా ఆహార ఉత్పత్తి అన్నీ కూడా క్రీ.పూ. 1000 నాటికే నెమ్మదిగా మొదలయినా అవి దాదాపు క్రీ.పూ. 600 దాకా గణవ్యవస్థ రూపం నుండి పూర్తిగా బయటపడలేదు.

క్రీ.పూ. 6వ శతాబ్ది ప్రాంతంలో చిన్న చిన్న జట్లుగా ఆర్యులు దక్షిణపథానికి రాసాగారు. దీనితో దక్షిణానికి ఇనుపకర్రు నాగలి వచ్చింది. దక్షిణ ప్రాంతంలో ఆర్య సంస్కృతి వ్యాప్తికి సైనిక ఆక్రమణల అవసరం అంతగా ఏర్పడలేదు. ఆర్యుల రాకకు ముందుండిన తెగ నాయకులను రాజులుగా గుర్తించారు. తెగ పూజారులను కొత్త బ్రాహ్మణ వర్ణంలో చేర్చుకున్నారు. తెగ వ్యవస్థ శిథిలమై అదనపు ఉత్పత్తి పెరగడంతో వ్యాపారం విస్తరించింది.

గంగానదీ మైదాన ప్రాంతాల్లో వరి సాగుతో సహా వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటుగా శ్రమవిభజన విస్తరించడం, వాణిజ్యం వృద్ధి చెందడం కూడా సాగాయి. భూమి స్వంత ఆస్థిగా మారింది. పట్టణాలు అభివృద్ధి చెందాయి. వైశ్య వర్తకులు, గహపతుల(భూయజమానులు) వంటి నూతన వర్గాలు అస్థిత్వంలోకి

వచ్చాయి. గహపతులు భూమిని దున్నేవారు కాదు. బానిసలతో లేదా శూద్రులతో దున్నించేవారు. అగ్ర(పీడక)వర్ణాలకు, క్రింది(పీడిత)వర్ణాలకు మధ్య, యజమానులకు, శ్రామికులకు మధ్య ఉద్రిక్తతలు తలెత్తాయి. ఇది రాజ్యం ఆవిర్భావానికి దారితీసింది. గంగా మైదానాలలో, బీహార్‌లో కూడా తొలి రాజ్యాలు ఆవిర్భవించాయి.

అలా ఏర్పడిన మొట్టమొదటి రాజ్యాలలోని పాలక గణాలు, తొలి రాజ్యాలు తమ పాలనను సుస్థిరం చేసుకోవడం కోసం, ధర్మసమ్మతం గావించడం కోసం యజ్ఞాలపై ఆధారపడ్డాయి. వర్ణవ్యవస్థను, వ్యక్తిగత ఆస్తిని నిలబెట్టాయి. కానుకల స్థానంలో పన్నులు ప్రవేశించాయి. బ్రాహ్మణ, క్షత్రియ రెండు పీడక వర్ణాల పైన పన్నులుండేవి కావు.

వైశ్యవర్ణం నుండీ, శక్తివంతమైన వర్తకుల గిల్డుల నుండీ, చేతివృత్తుల గిల్డుల నుండీ కొత్తగా ఏర్పడిన వర్గాలు, పీడిత వర్ణాలు రెండూ మొత్తంగానూ, ఇంకా జయించబడని తెగల సముదాయాలూ ఈ వర్ణాశ్రమ ధర్మ భావజాలాన్నీ, అది ప్రవచించే వ్యవస్థనూ (order) అంగీకరించలేదు. ఆనాడు ఆవిర్భవిస్తుండిన వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థకు కూడా అతివ్యయంతో కూడిన పశుసంపదతో సహా జంతువులను బలి ఇవ్వడం పైన ఆధారపడిన యజ్ఞాల వలన ఎలాంటి ఉపయోగమూ లేదు. పలు తత్వశాస్త్రాలు, 'లోకాయుత', బౌద్ధము, జైనము ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

క్రీ.పూ. 3వ శతాబ్దం నాటికి, భారతదేశంలో పూర్తిగా రూపొందిన మొట్టమొదటి ప్రధాన రాజ్యమైన మౌర్య సామ్రాజ్యం ఈ నూతన వాస్తవాన్ని ప్రతిబింబించింది. వైశ్యవర్ణంలోని సంపన్న వర్తకులను, వ్యాపారులను, భూస్వాములను 'పౌరజనపదం' అనే ప్రభువర్గం లోకి, అధికార యంత్రాంగం లోకి చేర్చుకున్నారు. ఈ కాలం నుండే బ్రాహ్మణులు తమ సాంప్రదాయిక వృత్తి అయిన యజ్ఞయాగాదులు నిర్వహించడాన్ని గణనీయంగా వదిలి అధికార యంత్రాంగంలో ప్రవేశించారు. మంత్రులుగా, రాజుకు సలహాదారులుగా శక్తివంతమైన స్థానాల్లో ప్రవేశించారు.

ఈ నూతన తరహా రాజ్యం (ప్రాచీన సమిష్టి మరియు రాజ్య యాజమాన్యం) వైశ్యులు చెల్లించే పన్నుల పైన, శూద్రులు చేసే శ్రమ పైన ఆధారపడినది. కౌటిల్యుడు (చాణక్యుడు) రచించిన సుప్రసిద్ధ గ్రంథమైన 'అర్థశాస్త్రం' రాజు ఎలా పరిపాలన సాగించాలనే విషయాన్ని సూటిగా వివరించింది. ఎలాంటి మతపరమైన ముసుగూ లేకుండా ఆ గ్రంథం రాజనీతిని వివరించింది. అర్థశాస్త్రంలో చెప్పిన రాజ్యం కేంద్రీకృత రాజ్యం. వ్యవసాయం, వాణిజ్యాల విస్తరణ బాధ్యతను అది చేపట్టింది. గనులపై గుత్తాధిపత్యం వహించింది. భూమిని సాగులోకి తేవడానికి అవకాశం ఉన్న చోట నీటి పారుదల వంటి వ్యవసాయానికి అవసరమైన సదుపాయాలను కల్పించి శూద్ర సమూహాలను స్థిరపరిచింది. కట్టుబానిసలైన శూద్రులచే (Dasa/Helot) బలవంతంగా శ్రమ చేయించి, రాజ్యమే నేరుగా 'సీత' భూములను సాగు చేసింది. కాగా 'రాష్ట్ర' ('Rashtra') భూములను స్వతంత్ర రైతాంగం (వైశ్యులు) చేత సాగు చేయించింది. ఈ స్వతంత్ర రైతాంగం పైన రాజ్యం వివిధ పన్నులు విధించింది. వర్ణ వ్యవస్థలోని యజమాని బానిస సంబంధాలు ఉనికిలో ఉన్నప్పుడు ప్రధానంగా భూ యజమానులైన గహపతులు ఇంటిపని కోసం దాసులను, బానిసలను ఉపయోగించేవారు. లేదా రాజ్యం సేకరించిన ధాన్యాన్ని దంచడం, శుద్ధి చేయడం వంటి పనుల కోసం, కొన్ని సరుకుల ఉత్పత్తి కోసం వీరిని ఉపయోగించేవారు.

మౌర్య సామ్రాజ్యం నాటికి మూడు రకాల ప్రాంతాలుండేవి. కొన్ని స్థిర నివాస గ్రామాలు ఉండే ప్రాంతాలు, కొన్ని వ్యవసాయ సంచార బృందాలు ఉండే ప్రాంతాలు, చాలా భాగం ఇంకా ఇనుము వాడకం తెలియని పశుపాలక - ఆహార సేకరణ చేసే గణాలు ఉన్న అడవి ప్రాంతాలు ఉన్నాయి.

నైపుణ్యం కలిగిన కర్మకార శూద్రులు స్వతంత్ర చేతివృత్తుల వారుగా మారారు. బౌద్ధసంఘాలలో వారికి ప్రవేశం కూడా లభించింది. కట్టుబానిసలైన దాసశూద్రులకు బౌద్ధంలో ప్రవేశం లేదు. వైశ్యుల లోని ఒక సెక్షన్ కూడా రథాలు తయారు చేయడం వంటి ప్రత్యేక వృత్తులలో నైపుణ్యం కలిగిన చేతివృత్తుల వారుగా మారింది. భారత చరిత్రలోని ఆ తరువాతి దశలో వైశ్యుల లోని పైస్థాయికి చెందిన వారు ప్రభువర్గంగా మారగా, అత్యధికులు శూద్రవర్ణం లోకి నెట్టివేయబడ్డారు.

తెగల లోని ఉన్నత వర్గాల(tribal elite)ను బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల లో చేర్చుకోగా, అత్యధికులు శ్రామికులుగా మారి శూద్రవర్ణంలో భాగమయ్యారు. బౌద్ధం నుండి శాఖాహారం, అహింస, కర్మ సిద్ధాంతాలను బ్రాహ్మణ వర్ణం స్వీకరించింది. పశుపోషక తెగలేగాక, ఆటవిక తెగల దేవుడిగా ఆమోదం పొందిన 'అవతార పురుషుడైన' కృష్ణున్ని ఆరాధించడం పెరిగింది. తెగల సమూహాలను విలీనం చేసుకోవడం కొనసాగింది. విలీనం చేసుకున్న 'జాతుల'కు విధులను, స్థానాలను కల్పించినటువంటి 'వర్ణ-సంస్కార' సిద్ధాంతం, మనుస్మృతి (క్రీ.శ. 2వ శతాబ్దం) ఉనికి లోకి వచ్చాయి.

ఇనుప నాగలిని ఉపయోగించే విషయంలో, నక్షత్రాల విషయంలో బ్రాహ్మణులకున్న జ్ఞానం వలనా, వివిధ తెగలను 'ఆర్యీ'కరించడం ద్వారా లొంగదీసుకోవడంలో బ్రాహ్మణులు నిర్వహించిన పాత్ర వలనా ఆనాటికి వికసిస్తుండిన వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థలో బ్రాహ్మణుల సామాజిక పునాది, ప్రాధాన్యత విస్తరించాయి. వీరు వివిధ అనుమానాస్పదమైన మూలాల నుండి ఆవిర్భవిస్తున్న పాలెగాళ్లకు రాజదర్బారులో వంశనామావళిని తయారుచేసి ఇచ్చేవారు. ఇది అనేక మంది రాజుల పరిపాలనకు సమంజసత్వాన్ని కల్పించడానికి తోడ్పడింది. అందువల్ల, ఈ నయాబ్రాహ్మణ్యానికి పాలకుల మద్దతు-ప్రత్యేకించి గుప్తుల కాలం (క్రీ.శ. 4వ శతాబ్దం) లోనూ, ఆ తరువాతా లభించింది.

ఉత్తరాది లోని కుషాణులు, శాకులు, దక్షిణాది లోని వివిధ తెగలు వర్ణవ్యవస్థలో విలీనమైన తరువాత, వాణిజ్యం క్షీణించి స్వయంపోషక గ్రామ ఆర్థిక వ్యవస్థ అస్తిత్వంలోకి వచ్చిన క్రీ.శ. 6వ శతాబ్దం నాటికి ఈ నయా బ్రాహ్మణ్యమూ, మనుస్మృతిపై ఆధారపడిన కులవ్యవస్థ భారతదేశం లోని అత్యధిక భాగంలో ప్రాబల్యాన్ని సాధించింది.

లోగడ యజ్ఞంపై ఆధారపడిన బ్రాహ్మణ్యానికీ, వర్ణాశ్రమ ధర్మానికీ సవాలుగా బౌద్ధం ఆవిర్భవించింది. శక్తివంతమైన వర్తక గిల్డులు, చేతివృత్తుల గిల్డులు బౌద్ధానికి దన్నుగా నిలిచాయి. వైశ్యవర్ణపు ఆకాంక్షలను కూడా బౌద్ధం ప్రతిఫలించింది. అర్థశాస్త్ర రాజ్యం వైశ్యవర్ణంలోని ఉన్నత వర్గాలను (నగర-శెట్టి, గహపతి) ప్రభువర్గం లోనూ, అధికార యంత్రాంగం లోనూ చేర్చుకుంది. అర్థశాస్త్ర రాజ్యం మతాతీతమైనదే అయినప్పటికీ, అది బౌద్ధం, జైనాలకు ప్రధానంగా మద్దతునిచ్చింది. దిగువ కర్మకార శూద్రులు కూడా విడివడిపోయి

వర్ణాల అంతస్థుల వ్యవస్థలో పైకి ఎగబాకారు. దాసశూద్రులు బౌద్ధ సంఘాలలో చేరలేక పోయినప్పటికీ, వారు కూడా బౌద్ధం యొక్క ప్రజాస్వామిక ఆకాంక్షకు మద్దతునిచ్చారు. తరువాతి కాలంలో వాణిజ్యం క్షీణించి గ్రామాలపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ ఆవిర్భవించడంతో, ప్రధానంగా పట్టణాలపై ఆధారపడిన బౌద్ధారామాలు తమ సామాజిక పునాదిని కోల్పోయాయి. భూదానాలను స్వీకరించి భూయాజమాన్య సంస్థలుగా మారిపోయిన బౌద్ధారామాలు ప్రజల దృష్టిలో పాలకవర్గాల్లో భాగంగానే కనపడడంతో వాటి ఆకర్షణ కోల్పోయాయి. అపరిమిత వ్యయంతో కూడిన, కానుకలపై ఆధారపడిన సుసంపన్నమైన ఈ బౌద్ధారామాలు, గ్రామస్థాయి లోని బ్రాహ్మణులతో పోల్చదగినటువంటి ఉపయోగకరమైన పాత్రను పోషించలేదు. మరోవంక నయా బ్రాహ్మణ్యం మిగులును దోచుకోవడంలోనూ, ప్రజలను అణచి ఉంచడంలోనూ ఉపయోక్తమైన పాత్రను నిర్వహించింది. అందువల్ల పాలకులు ఈ నయా బ్రాహ్మణ్యానికే ప్రాధాన్యతనిచ్చారు. ఉదాహరణకు: క్రీ.శ. 2వ శతాబ్దిలో వింధ్యకు దక్షిణాన గల శాతవాహనులూ, క్రీ.శ. 575లో దక్షిణాదిలోని పల్లవులూ తమను తాము క్షత్రియులుగాను, బ్రాహ్మణులుగాను వర్ణించుకొని, వర్ణాశ్రమ ధర్మాన్ని సమర్థించారు. వ్యవసాయక ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడే అహింస, కర్మ సిద్ధాంతం, శాఖాహారం వంటి బౌద్ధంలోని లక్షణాలను అప్పటికే నయాబ్రాహ్మణ్యం స్వీకరించింది.

సుమారు క్రీ.శ. 6వ శతాబ్దం నుండి కులవ్యవస్థ భారతదేశంలోని చాలా ప్రాంతాలలో సంఘటితం కావడం ప్రారంభమైంది. యూరపులో క్రీ.శ. 3వ శతాబ్దం తర్వాత రోమన్ సామ్రాజ్యం పతనం కావడం ఎలా జరిగిందో, మన దేశంలో గుప్తుల కాలం తర్వాత వర్తక గిల్డులు, చేతివృత్తుల గిల్డులు క్షీణించడం, ద్రవ్య చలామణి కుంచించుకుపోయి చేతివృత్తుల వారు గ్రామాలలో స్థిరపడడం, స్వయంసంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడం జరిగాయి. ఈ పరిణామాలు కులాలపై ఆధారపడిన ఫ్యూడల్ విధానం తలెత్తడానికి అవసరమైన పరిస్థితులను సృష్టించాయి. ఫ్యూడల్ విధానం తలెత్తడంతో పన్నుల రూపేణా లేదా ఉత్పత్తిలో వాటా రూపేణా రైతాంగం నుండి, శ్రామిక ప్రజల నుండి మిగులును దోచుకునే దళారీ వర్గం ఆవిర్భవించడం కనపడుతుంది. మొదట్లో కేవలం భూదానాలు (బ్రాహ్మణులకు, బౌద్ధారామాలకు, సైనికాధికారులకు, ఇతర అధికారులకు) ఇచ్చేవారు. తరువాతి కాలంలో వారికి పాలనాపరమైన విధులను కూడా కేటాయించారు. దళారీలకు పాలనాపరమైన విధులు ఇవ్వడం క్రీ.శ. 2వ శతాబ్దంలో, శాతవాహనుల పాలనా కాలంలో మొదట ప్రారంభమై గుప్తుల కాలం (క్రీ.శ. 4వ శతాబ్దం)లో ప్రాచుర్యంలోకి రావడంతో వర్ణ వ్యవస్థలోని యజమాని బానిస పరిస్థితులు నశించాయి. ఇళ్లలో పనిచేయటానికి మాత్రమే దాసులను వినియోగించుకునేవారు. యజమానులకు రకరకాల సేవలు చేయడం వీరి పని. ఒకవైపు అర్ధబానిస వ్యవస్థ, మరొకవైపు వర్ణాలు, వర్ణాలు కులాలుగా మారే పరిణామం కొనసాగాయి. ఒకే వృత్తి వారు ఒకే కులంగా మారడం ప్రారంభమైంది. వృత్తి, కులం పర్యాయపదాలైనాయి.

గుప్తుల కాలంలోనూ, ఆ తర్వాతనూ మత సంబంధమైన మరిన్ని హక్కులను కలుగజేయడంతో శూద్రుల పరిస్థితి క్రమంగా మారింది. చాలా మంది చేతివృత్తుల వారినీ, ఆదివాసులనూ అంటరానివారిలో చేర్చి శూద్ర సముదాయాన్ని విభజించారు. క్రమంగా పెరుగుతున్న అంటరానివాళ్లతో బాటు మొదటి నుంచి దాస స్థితిలో మగ్గుతున్న వాళ్లందరినీ అపరిశుద్ధ శూద్రులుగా పరిగణించి, వాళ్లకు ప్రత్యేకంగా మతసంబంధ నియమావళిని రూపొందించారు. వ్యవసాయ కూలీలను, కొన్ని 'అధమ' శ్రేణి చేతివృత్తుల వాళ్లనూ, మరికొందరినీ అపరిశుద్ధ శూద్రులుగా పరిగణించారు.

మౌర్యుల పతనం నుండి ఉత్తర భారతంలో స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ ఏర్పడడం ప్రారంభమైంది. ఆటవిక గణాలను స్వయంపోషక గ్రామ సమాజంలో కలుపుకునే క్రమంలో కులాలు విస్తరించాయి. కులాలుగా మార్చబడిన తెగల దేవతలనూ, దేవుళ్లను బ్రాహ్మణీకరించి గుళ్లు కట్టారు. కుల వ్యవస్థను కట్టుదిట్టం చేశారు. ఈ కుల వ్యవస్థకూ, యజుర్వేదకాలపు వర్ణవ్యవస్థకూ గల సామాజిక పునాదులు పూర్తిగా భిన్నమైనవి. ఆహార ఉత్పత్తి కొత్తగా అలవడిన దశలో, ఆర్యులకు లొంగిన ఆర్యేతరుల చేత శ్రమ చేయించి ఆహారం ఉత్పత్తి చేయించుకోవడానికి శూద్ర వర్ణం సరిపోయింది. ఆర్యుల లోని సామాన్య జనాన్నీ, పాలకవర్గాన్నీ వేరుచేయడానికి వైశ్యులు, బ్రాహ్మణ, క్షత్రియులు అనే విభజన సరిపోయింది. స్వయంపోషక గ్రామాలకు ఈ చతుర్వర్ణం ఎంతమాత్రం చాలలేదు. వ్యవసాయ విస్తరణ క్రమంలో సామాజికోత్పత్తి వృద్ధిచెందుతూ, సామాజిక అవసరాలకు అనుగుణంగా నూతన వృత్తులు వృద్ధిచెందుతూ నూతన గ్రామీణ సమాజం ఏర్పడ్డ క్రమంలోనే వర్ణవ్యవస్థతో ప్రమేయం లేకుండా అనేక 'శూద్ర' కులాలు ఏర్పడ్డాయి. నిజమైన వ్యవసాయదారులు, వృత్తిపనివారు శూద్రులై, వైశ్యులు వర్తకానికి పరిమితమైనారు. శూద్రుల సంఖ్య అపరిమితంగా పెరిగిపోగా వైశ్యులు అల్పసంఖ్యాకులయ్యారు.

వర్ణాలు కులాలుగా మారాయి. భారతీయ చతుర్వర్ణ వ్యవస్థలో కర్షకుడు శూద్రుని స్థానం కలిగి ఉండగా, 'మలినమైన' పనులుగా పరిగణించబడే చచ్చిన పశువుల తోళ్లను తొలగించి శుభ్రం చేయడం, పశువులను చంపడం వంటి పనులను కుటుంబంలోని దాసుల చేత చేయించేవారు. భారత ఫ్యూడల్ సమాజంలో చతుర్వర్ణాలతో పాటు ఐదవ వర్ణం (పంచములు)గా అంటరానివారితో, అట్టడుగువారి(అత్యంత పీడితుల)తో ఏర్పడింది. వైశ్యులలో అధిక భాగం శూద్రులుగా దిగజారిపోతున్న క్రమంలో, దాసులు పెరుగుతున్న క్రమంలో మలినమైన పనులు చేయడానికి అంటరానివారు అనే 5వ వర్ణం సృష్టించబడింది. వర్ణవ్యవస్థ పునాదుల్ని గట్టిపరచడంలో, శూద్రులను అణచిపెట్టడంలో కర్మ సిద్ధాంతం ప్రధాన పాత్ర వహించింది. వర్ణధర్మాన్ని భగవంతుడు నిర్దేశించాడనీ, దానిని ఆచరించక పోవడం వల్ల దుష్పరిణామాలు సంభవిస్తాయనీ, కర్మ బలీయం కాబట్టి నిస్సహాయంగా అనుభవించాల్సిందేననే భావజాలంతో నాల్గవ, ఐదవ వర్ణాలను అణిచిపెట్టి ఉంచగలిగారు.

వాణిజ్యం క్షీణించడంతో వైశ్యవర్ణం జనాభాలోని అతి చిన్న భాగంగా మారింది. వైశ్యవర్ణంలోని చాలామంది రైతులుగా మారి శూద్రవర్ణంలో భాగమయ్యారు. రైతులు తమ ఫ్యూడల్ ప్రభువులు ఎప్పుడు ఆజ్ఞాపిస్తే అప్పుడు యుద్ధానికి సిద్ధమయ్యే పార్ట్‌టైమ్ సైనికులు కావడంతో, క్షత్రియ వర్ణం కూడా జనాభాలోని అతిచిన్న భాగంగా మారింది. ఉత్తరాదిన గుజ్జర్లు, హూణులు వంటి దండయాత్రికుల లోని పాలక గణాలు లేదా శక్తివంతమైన గణాలు, ఆర్య క్షత్రియులు, దళారులు రాజ్‌పూత్ కులంగా వ్యవస్థీకృతమయ్యారు. ఫ్యూడల్ అంతస్థుకు చెందిన సమూహాలలోని గణ, బంధుత్వ సంబంధాలు వివాహ సంబంధాల ద్వారా బలవత్తరం చేయబడి రాజ్‌పూత్ కులం రూపొందింది. మధ్యయుగాల ప్రారంభంలో కొన్ని గ్రామాలపై

ఆధిపత్యం కలిగినవాడన్న అర్థాన్ని సూచించే 'రాజపుత్ర' అన్న పదం నుంచి రాజ్‌పూత్ పదం పుట్టింది. గంగానది పరివాహక ప్రాంతంలో బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్రులు మాత్రమే ఉండేవారు. ఈ కాలంలో దక్షిణాదిన గ్రామ పెద్దను కూడా చాలా ముఖ్యమైన వాడిగా పరిగణించేవారు. సాధారణంగా ప్రబలమైన వ్యవసాయ కులానికి చెందిన పెద్దపెద్ద భూయజమానులు వ్యవసాయం చేసే తమ తోటి రైతు కులస్థుల నుండి విడివడిపోయి తమలో అంతర్గత వివాహ సంబంధాల ద్వారా, బంధుత్వ సంబంధాల ద్వారా ఒక ప్రాంతమంతటా తమ స్థానాన్ని సంఘటితపరచుకున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ల నుండి పెద్దరెడ్లు, కర్నాటకలో గౌడ అనే ప్రత్యేక కుల సమూహాలు ఆవిర్భవించాయి. కులవ్యవస్థ భారతదేశంలోని ఫ్యూడలిజంతో విడదీయలేని విధంగా పెనవేసుకుపోయింది.

అంటరాని కులాల సంఖ్య పెచ్చుపెరిగి పోయింది ఈ కాలంలోనే. అంటరాని వారిని గురించిన ప్రస్తావనలు క్రీ.పూ. 4వ శతాబ్దం నుండే కనపడతాయి. ఉదాహరణకు, శూద్రులను రెండు రకాలుగా – నిరాశ్రిత (వెలివేయబడిన), ఆశ్రిత శూద్రులుగా పతంజలి ప్రస్తావించాడు. మొదట అంటరానివారి సంఖ్య పరిమితంగా ఉండేది. క్రమక్రమంగా కొత్త కొత్త తెగలను ఇందులో చేర్చుకోవడం మొదలైంది. అయితే, ఫ్యూడల్ కాలంలోనే వారి సంఖ్య బాగా పెరిగింది. ఉదాహరణకు, చమారులు, రజకులు అంటరానివారి స్థాయికి దిగజార్చబడ్డారు. బలవంతంగా లొంగదీసుకున్న తెగల అడవులను/భూములను, జీవనాధార సాధనాలను, స్వేచ్ఛను హరించివేసి వారిని అంటరానివారి స్థాయికి దిగజార్చారు. శూద్రవర్ణం లోని కొన్ని చేతివృత్తుల సముదాయాలను కూడా అతి శూద్ర శ్రేణుల్లోకి తోసివేశారు. అలాంటివారు ప్రధానంగా మత ఆదేశాల ద్వారా సంపద(బంగారం వగైరా)ను, భూములను కలిగి ఉండడం నిరాకరించబడిన కట్టుబానిస వ్యవసాయ కూలీలు. మొత్తం గ్రామం కోసం, ప్రత్యేకించి భూయజమానుల వర్గం కోసం శ్రమ చేయడం మాత్రమే వారి విధి (ధర్మం)గా ఉండేది. గ్రామానికి బయట దూరంగా వారు నివశించాలి. వారి నీడ కూడా మైలపరిచేదే. ఇలా అంటరాని శ్రామికులను అతి హీనమైన భౌతిక జీవితం లోకి, శాశ్వతమైన దాస్యం లోకి నెట్టివేయడం ద్వారా ఉత్పాదక మిగులును అతి ఎక్కువగా దోచుకోగలిగారు.

క్రీ.శ. 10వ శతాబ్దం నాటికే, గజినీ మహమ్మద్ దండయాత్రలకు ముందే దేశంలో కులవ్యవస్థ సంఘటితమయ్యే క్రమం పూర్తయ్యింది. ఫ్యూడల్ వర్గం కులవ్యవస్థకు దన్నుగా నిలిచింది. బౌద్ధాన్ని ప్రచారం చేసిన పాలకులు కూడా కులవ్యవస్థకు సగౌరవంగా దన్నుగా నిలిచినవారే. శారీరక శ్రమతో సంబంధమున్న అన్ని కులాల (వ్యవసాయదారుల, చేతివృత్తుల) వారు లేదా బ్రాహ్మణుల ఆధిక్యతను లేదా వర్ణాల అంతస్థులను ప్రశ్నించిన వారు శూద్రులుగా వర్గీకరించబడ్డారు. మనుస్మృతి (క్రీ.శ. 2వ శతాబ్దం) భూస్వామ్యానికి, దోపిడీ వర్గాల ఆధిక్యతకు సమర్థవంతమైన సైద్ధాంతిక సమంజసత్వాన్ని సమకూర్చింది. అత్యధిక ప్రజల స్వేచ్ఛను హరించి వారిని హీనస్థితికి గురిచేయడానికి ఆమోదాన్ని తెలిపింది.

క్రీ.శ. 13వ శతాబ్దంలో బానిస వంశం ద్వారా ఉత్తర భారతదేశంలో తురుష్క రాజ్యం ఏర్పడింది. దానితో భారతదేశ ఫ్యూడల్ ఉత్పత్తి విధానంలో ఒక ముఖ్యమైన దశ ప్రారంభమైంది. తురుష్క పాలన కింద పరిపాలనా వ్యవస్థ కేంద్రీకృతమైంది. శిస్తు వసూలుకు వారు మరింత క్రమబద్ధమైన పద్ధతిని ప్రవేశపెట్టారు. పాలకవర్గాల పొందికలో మార్పులొచ్చాయి. మొదట్లో తురుష్క బానిస కుటుంబాలు, వారి బంధువులు పరిపాలించారు. ఆ తర్వాత క్రమంగా వారి స్థానం లోకి భారతీయ సంతతికి చెందిన బానిసలు, భారతీయులుగా మారిన తురుష్కులు, విదేశాల నుండి వలస వచ్చినవారు ప్రవేశించారు. ఇంకా, చాలా మంది విదేశీయులు, నిమ్న కులాలకు చెందిన హిందువులు కూడా పాలకులయ్యారు. శిస్తు వసూలు హక్కుల (ఇక్తా) పద్ధతికి సంబంధించి ముఖ్యమైన మార్పులు చేశారు. మొదట్లో ఈ శిస్తు వసూళ్ల హక్కు జీవిత కాలానికి మాత్రమే పరిమితమై ఉండేది. 15వ శతాబ్ది చివరికల్లా వారసత్వంగా సంక్రమించేదిగా మారిపోయింది. తురుష్కులు పట్టణాలను కేంద్రంగా చేసుకున్నారు. వారు ఇస్లాం మతాన్ని అభిమానించారు. ఆ విధంగా వారు తొలుత ఉండిన పాలెగాళ్లను తొలగించి కాలక్రమేణా కొత్తవారిని ఏర్పాటు చేశారు.

తురుష్కులు ప్రవేశపెట్టిన పరిపాలనాపరమైన మార్పులను దక్కన్ ప్రాంతంలో కూడా అనుసరించారు. సైనిక సర్వీసులలో ఉన్నవారు, పాలనాధికారులు, గ్రామపెద్దలు, పురోహితవర్గం శిస్తు వసూలు అధికారాలకు సంబంధించి, పరిపాలనకు సంబంధించి వారు ప్రవేశపెట్టిన మార్పుల ప్రభావానికి గురయ్యారు. కార్యాలయ అధికారులను ఈనామ్‌దారులు, వతన్‌దారులు, ఇక్తాదారులు, దేశ్‌ముఖ్‌లు, దేశాయ్‌లుగానూ, ఆ తరువాతి కాలంలో జాగీర్‌దారులు (మొగల్‌ల కాలంలో)గానూ వ్యవహరించేవారు. ఉత్తర భారతదేశంలోని ఫ్యూడల్ వర్గం అస్థిరతకు గురైంది. అయితే పదవులు కోల్పోయిన కొందరు పాత దళారులు ఫ్యూడల్ వర్గసంపుటి అస్థిరంగా ఉన్న తురుష్క పాలనలోని తరువాతి కాలంలో తిరిగి తమ పదవులను సంపాదించుకోగలిగారు. యుద్ధశాస్త్రంలో తురుష్కులు నూతన పద్ధతులను ప్రవేశపెట్టారు. పట్టణ ప్రాంతాలలోని వాణిజ్యం, వర్తకం, చేతివృత్తులను వారు ప్రోత్సహించారు కూడా. ఫలితంగా, ఈ కాలంలో భారత సమాజంలోని ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందడం కనబడుతుంది.

దక్షిణ భారతదేశంలో పాలకవర్గాల పొందిక మాత్రం ఎలాంటి మార్పుకూ గురికాలేదు. కానీ పీడిత కులాలకు చెందిన కొన్ని విభాగాలు పాలకవర్గాల్లోకి చేర్చుకోబడ్డాయి. ఉదాహరణకు సైనికవర్గమైన నాయకర్‌లు విజయనగర సామ్రాజ్యంలో 'అమరం' అనే నిర్ణీతకాలం పాటు హక్కులుండే భూములను పొంది దళారులుగా మారారు. ఈ కాలంలో పలు తెగరాజ్యాలు అవిర్భవించాయి. హిమాలయ ప్రాంత పర్వతాలలోని డోమ్‌లు క్రీ.శ. 13వ శతాబ్దంలోనూ, అస్సాంలోని బోడోలు 13–18 శతాబ్దాల్లోనూ, చోటానాగపూర్, పలాములోని నాగబనిషీలు, చెరోలు 12వ శతాబ్దంలోనూ, మధ్య భారతదేశంలోని గోండ్‌లు 15–18 శతాబ్దాలలోనూ, దక్షిణ గుజరాత్‌లోని మహదేవ్ కోలీలు 13వ శతాబ్దంలోనూ రాజ్యాలు ఏర్పరచుకున్నారు. పొరుగున ఉన్న మైదాన ప్రాంతాల నుండి సాంకేతిక పరిజ్ఞానాన్ని, సంస్కృతిని స్వీకరించి ఈ తెగలు అప్పటికే స్థిర వ్యవసాయ దశకు అభివృద్ధి చెందాయి. ఈ తెగ సమాజాలలో అసమానతలు అప్పటికే వృద్ధి చెందాయి. తొలుత బ్రాహ్మణీయ హిందుత్వాన్ని వారు వ్యతిరేకించారు. అయితే తరువాతి కాలంలో వారు హిందూ మతాన్ని లేదా బౌద్ధమతాన్ని స్వీకరించారు, లేదా ఇస్లాం మతంలోకి మారారు. మరాఠాల లేదా మొగలుల పరిపాలనా కాలంలో వారు సామంతులు(vassal)గా మారారు.

వర్తకం, సరుకుల ఉత్పత్తి వృద్ధి చెందడం, రాజకీయపరమైన, సాంస్కృతికపరమైన మార్పులు సంభవించడం, ఫ్యూడల్ సమాజం

లోపల కులవ్యవస్థకు వ్యతిరేకంగా నిరసన తలెత్తడానికి భౌతిక పరిస్థితులను సృష్టించాయి. ఈ పరిణామం 12వ శతాబ్దం ప్రాంతంలో దక్షిణ భారతదేశంలోనూ, ఒక శతాబ్దం తరువాత ఉత్తర భారతదేశంలోనూ వ్యాపారుల, చేతివృత్తుల సముదాయాలు బలపడడానికీ, తమ ప్రయోజనాల కోసం వారు దృఢంగా నిలబడడానికీ దారితీసింది. దక్షిణ భారతదేశంలో ఆ దశలో 'ఎడగై' (ఎడం చెయ్యి), 'బలగై' (కుడి చెయ్యి) అనే కుల సంఘాలు మొదలయ్యాయి. సరుకు ఉత్పత్తి విధానం, మార్కెట్ అభివృద్ధినీ ఇది సూచిస్తుంది. 'ఎడగై' సరుకుల ఉత్పత్తి చేసే, వృత్తులు చేసే కులాలకు ప్రాతినిధ్యం వహిస్తే, 'బలగై' వ్యాపార కులాలకు ప్రాతినిధ్యం వహించింది. తరచుగా ఈ సంఘాలు ఐక్యంగా ఫ్యూడల్ దోపిడీని ఎదిరిస్తూ ఉండేవి. ఉత్తర భారతదేశంలో 'జులహ' చేతివృత్తుల కులాలు (నేతపనివారు) ఇస్లాం మతం స్వీకరించారు.

12-17 శతాబ్దాల మధ్య, కులవ్యవస్థ పట్ల, బ్రాహ్మణీయ ఆధిక్యత పట్ల గణనీయమైన వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ప్రజలను బాగా ఆకట్టుకున్న భక్తి ఉద్యమం ఆవిర్భవించింది. ఈ మత సంస్కర్తలలో కొందరు బ్రాహ్మణులు కూడా ఉన్నప్పటికీ, భక్తి ఉద్యమ ప్రబోధకులలో ఎక్కువ మంది కుమ్మరి, వడ్రంగి, నేత వంటి చేతివృత్తుల కులాలకు చెందినవారే. నందన్ (నయనార్), తిరుప్పన్ (ఆళ్వార్), చొఖమేల, సంత్‌రోహిదాస్ వంటి కొందరు అంటరాని కులాలకు చెందినవారు. ఈ ఉద్యమం మహిళా ప్రబోధకులను కూడా వెలుగులోకి తెచ్చింది. ఏకేశ్వరోపాసనను నొక్కి చెప్పిన రామానుజ, జ్ఞానేశ్వర్, చైతన్య వంటి వారి మితవాద స్రవంతి కూడా ఈ భక్తి ఉద్యమంలో ఉండింది. బసవన్న, తుకారాం, నామ్‌దేవ్, కబీర్, గురునానక్ వంటి ప్రబోధకులతో కూడిన మరింత రాడికల్ స్రవంతి కులవివక్షను, బ్రాహ్మణీయ కపటత్వాన్ని ఎండగట్టింది. వారిలో కొందరు సాంఘిక సంస్కరణ చర్యలను చేబట్టారు కూడా. కబీరు, గురునానక్ హిందూ మతం పరిధి నుంచి వైదొలగిపోయారు. భగవంతునికీ, భక్తునికీ మధ్య వైయక్తిక సంబంధాన్ని నొక్కిచెప్పిన ఈ ఉద్యమం కులాల హద్దులను అధిగమించింది. జ్ఞానం పైనా, వేదాల పైనా గుత్తాధిపత్యంపై ఆధారపడిన బ్రాహ్మణీయ ఆధిక్యతా భావనను ఈ ఉద్యమం పెద్ద దెబ్బతీసింది.

ఫ్యూడల్ భావజాలపరమైన, భౌతికపరమైన పునాదుల పైన భక్తి ఉద్యమం పెద్దదాడి చేసింది. స్థానిక భాషలలో బోధన గావించిన భక్తి ఉద్యమం ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యతనిచ్చింది. తద్వారా, వివిధ ప్రాంతాలలో జాతీయవాదం వృద్ధి చెందడానికి అది పునాది వేసింది. అయితే, చాతుర్వర్ణ వ్యవస్థను సమర్థించి బ్రాహ్మణీయ ఆధిక్యతను, ప్రతిష్టను తిరిగి నెలకొల్పాలని వాంఛించిన రామదాస్, తులసీదాస్‌ల రూపంలో భక్తి ఉద్యమ చివరి దశలో ఒక మితవాద ధోరణి తలెత్తింది. అయినప్పటికీ, మొత్తంగా చూస్తే ప్రధానంగా భక్తి ఉద్యమం మత, సాంఘిక సంస్కరణల కోసం సాగిన ఉద్యమం. ఆనాటి చారిత్రక పరిమితుల వలన కులవ్యవస్థకు పునాదైన ఫ్యూడల్ ఉత్పత్తి విధానం పైన, ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాల పైన ఈ ఉద్యమం దాడి చేయలేకపోయింది. అందువలన ఈ ఉద్యమం కులవ్యవస్థను విచ్ఛిన్నం చేయడంలో విఫలమైంది.

క్రీ.శ. 16వ శతాబ్దంలో మొగలులు కూడా ఉత్తరాదిలో, దక్కన్‌లో తాము జయించిన రాజ్యాలలోని పాలకగ్రూపుల, రాజ్‌పుత్ నాయకుల, ఇతర ఉన్నత (పీడక) కులాల దళారుల సహాయంతో తమ అధికారాన్ని సంఘటితపరుచుకున్నారు. మొగలులు డబ్బు రూపంలో శిస్తును ప్రవేశపెట్టారు. నీటి పారుదల వ్యవస్థలో మార్పులు తెచ్చారు. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యమూ కూడా పెరిగాయి. అయినప్పటికీ మొగలుల పాలన గ్రామస్థాయిలోని సామాజిక నిర్మాణాన్ని మార్చలేదు. గ్రామీణ నిర్మాణంలో అగ్రభాగంగా పరిపాలనా బాధ్యతలు, అధికారాలు కలిగిన పీడక కులాల లేదా బ్రాహ్మణ లేదా రాజ్‌పుత్ దళారీలు, పెద్ద భూస్వాములు ఉండేవారు. వారు కౌలు రైతుల నుండి, భాగస్వామ్య రైతుల (Share-croppers) నుండి వసూలు చేసే శిస్తు పైన గానీ, లేదా తెగల, అంటరానికులాల వెట్టిశ్రామికులశ్రమపైన గానీ ఆధారపడి బతికేవారు. శూద్ర పాలెగాళ్లు క్షత్రియుల స్థాయికి ఎదిగారు, కొన్ని సందర్భాలలో బ్రాహ్మణ హోదా సంపాదించారు కూడా. శతాబ్దాల తరబడి సాగుదార్ల కులాలు తమకూ, భూస్వాములకూ మధ్య వ్యవస్థీకృతమైన జాజ్‌మాని/బలూతెదారీ వ్యవస్థ కారణంగా భూమి తమదనీ, భూమిపై హక్కూ, ఉత్పత్తిలో వాటా తమకు దక్కాలనీ అంటూ ఉండినాయి. అయినప్పటికీ, ఈ వ్యవస్థ ఉచిత శ్రమను అనేక రెట్లు వెలికితీసే అగ్ర (పీడక) కులాలను గ్రామ స్థాయిలో సైతం మానవ శ్రమ నుంచి పూర్తిగా ఉపసంహరించేందుకు అనుమతించింది. చివరికి వెట్టి-బిగార్ పద్ధతి కూడా రూపుదిద్దుకుంది. ఈ పద్ధతి వలన ఒక ఆర్థికేతరమైన, నిర్బంధపూరితమైన సంబంధం ఏర్పడింది. అంటరాని కులాలకు దిగువస్థాయి పనులను కేటాయించారు. వారిలో కొందరికి గ్రామంలోని కొద్దిపాటి భూమిని సాగు చేసుకునే హక్కు లభించినప్పటికీ, అత్యధికులు మాత్రం నిర్దిష్టంగా కొన్ని కుటుంబాలకు కట్టివేయబడిన వెట్టిసేవకులుగా, గృహబానిసలుగా, భూమిలేని అర్ధబానిసలుగా ఉండేవారు. మొగలుల పాలనా కాలంలో వెట్టి శ్రామికులు జనాభాలో 10 శాతంగా ఉండేవారు. దక్షిణాదిలో ఈ వెట్టి శ్రామికుల శాతం ఇంకా ఎక్కువగా ఉండేది.

**ఇస్లాం మత వ్యాప్తి - కులం :** మన దేశంలో ముస్లిం రాజుల దండయాత్రలకు చాలా కాలం ముందే మత గురువుల ద్వారా క్రిస్టియన్, ఇస్లామ్ మతాలు కేరళ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. మొఘల్ పాలనా కాలంలో రాజ్య విస్తరణతో పాటు తమ విస్తరణ కూడా జరిగింది. అయితే పీడక కులాలవారు ముస్లిం రాజుల ఆశ్రయం కోరి, ఆస్తుల కోసం, ఉన్నత పదవులకోసం ఇస్లాంను స్వీకరించారు. వెనకబడిన కులాలు ప్రధానంగా దళితులు హిందూమతంలోని కుల వివక్షతను భరించలేక దాని నుండి విముక్తికోసం ఇస్లాంను స్వీకరించారు. ఇస్లాం మతంలో కుల వివక్షత లేకపోవడం వలన తురుష్కుల పాలన కుల సంకెళ్లు కొంత సడలడానికి తోడ్పడింది. అయితే స్థానిక స్థాయి నుండి కేంద్రం వరకు అధికార స్థానాలకు పీడక కులాలే దగ్గరగా ఉంటూ వచ్చాయి. మొఘల్ పాలనా కాలపు ఫ్యూడలిజం హిందూ రాజుల కాలపు ఫ్యూడలిజంతో మైత్రి నెరపింది, కుమ్మక్కైంది. ఫలితంగా ఉత్పత్తి సంబంధాలలో అంటే పునాదిలో ఎలాంటి మౌలిక మార్పులు సంభవించలేదు. బ్రిటీషు పూర్వ ఫ్యూడల్ రాజ్యాలు ఉచితంగా శ్రమను పిండుకోవడం కోసం, ప్రత్యేకించి, ప్రజోపయోగ పనుల కోసం శ్రమను పిండుకోవడం కోసమూ, కుల వివాదాల్లోనూ మధ్యవర్తిత్వం నెరపడం ద్వారా ఆర్థికంగా లబ్ది పొందడం కోసమూ కులవ్యవస్థను కాపాడాయి. చివరిదే కాని ప్రాధాన్యత కలిగినటువంటి మరొక అంశమేమంటే, కులవ్యవస్థ అధికారం చెలాయించడమన్న పాలకుల ధర్మాన్ని సమర్థించింది, వారి పాలనను న్యాయ సమ్మతమైనదిగా చేసింది. ✪

# అజేయమైన ఎర్ర సైన్యాన్ని నిర్మించడం ఎలా

కామ్రేడ్ ఛూటే

ఇప్పుడు పార్టీ ఎదుర్కొంటున్న తక్షణ ముఖ్య కర్తవ్యాలలో అజేయమైన ఎర్రసైన్యాన్ని నిర్మించడం ఒకటి. అటువంటి సైన్యానికి ఈ ఆరు మౌలిక లక్షణాలు ఉండాలి.


**మొదటిది, ఆ సైన్యం వర్గ ప్రాతిపదికను స్పష్టంగా కాపాడాలి.**

ఎర్రసైన్యం కార్మికుల, రైతుల సైన్యం. అది యావత్తు శ్రామిక జనానికి చెందిన సైన్యం అనుకోవచ్చు. రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవడం, కార్మికుల, కర్షకుల సోవియట్ పరిపాలన నెలకొల్పి సంఘటితం చెయ్యడం, కార్మికులనూ ఇతర శ్రామిక ప్రజలనూ రాజకీయంగా, ఆర్థికంగా విముక్తి చెయ్యడం ఎర్రసైన్యపు చారిత్రక కర్తవ్యం. ఈ చారిత్రక కర్తవ్యాన్ని పరిపూర్తి చెయ్యడానికి గాను ఎర్రసైన్యపు వర్గ ప్రాతిపదికను (ఐడెంటిటి) తప్పనిసరిగా కాపాడాలి. అంటే, కార్మికులు, రైతులకు చెందిన శ్రామిక ప్రజలు మాత్రమే అందులో చేరడానికి అర్హులు.

చైనాలో వ్యవసాయ విప్లవం విస్తరించడంతో పాటుగా ఎర్రసైన్యం పెరిగింది. అందులో అత్యధికులు వ్యవసాయ విప్లవం నుంచీ లాభపడిన జీతగాళ్లు, పేద రైతులు, మధ్య తరగతి రైతులే. ఆ సైన్యానికి మిలటరీ కేడరూ, ప్రత్యేకించి నాయకత్వం ఇవ్వగల రాజకీయ కేడరూ ప్రధానంగా అభివృద్ధి చెందిన పట్టణ కార్మికుల నుంచీ రావలసిందే. ఎర్రసైన్యపు బలాన్ని పెంచడానికి దానిని విస్తరించడానికి గ్రామాలలో ఉండే జీతగాళ్ల యూనియన్లు, పేద రైతుల సంఘాలు, మరీ ముఖ్యంగా పట్టణాల్లో ట్రేడ్ యూనియన్ కౌన్సిళ్లు రాజకీయాల్లో గట్టిగా నిలబడే తమ సభ్యుల్ని తడవకు కొంత మందిని ఎర్రసైన్యంలోకి పంపుతూ ఉండాలి. గతంలోనూ, ఇప్పుడు కూడా మన అనుభవాన్ని బట్టి చూస్తే, పోరాటంలో అనుభవం గడించిన గెరిల్లా కార్యకర్తలను, రెడ్‌గార్డులను కూడా ఇలా ఎర్రసైన్యంలోకి పంపడం మంచిది.

**రెండోది, ఎర్రసైన్యం బేషరతుగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఉండి తీరాలి.**

కమ్యూనిస్టు పార్టీ కార్మిక వర్గానికి అగ్రగామి దళం. దాని నాయకత్వం కింద మాత్రమే కార్మికులు, కర్షకులకు చెందిన ఎర్రసైన్యం తన మహత్తర చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చగలుగుతుంది. ఎర్రసైన్యం పుట్టక ముందు జరిగిన గెరిల్లా యుద్ధానికి కూడా కమ్యూనిస్టు పార్టీయే నాయకత్వం మహించింది. వ్యవసాయ విప్లవాన్ని నిర్వహించడం, ప్రజానీకాన్ని ఆకట్టుకోవడం అనే సరైన ఎత్తుగడలను అవలంభించడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ గెరిల్లా బలగాలను క్రమక్రమంగా ఎర్రసైన్యంగా రూపొందించింది. దానిని మెట్టు మెట్టుగా విస్తరిస్తూ బలపరుస్తూ ఉంది. యుద్ధ ప్రభువుల మధ్య కొనసాగే నిరంతర పోరాటాన్ని తుదముట్టించడానికి సోవియట్ ఉద్యమాన్ని విస్తృత పరచడానికి నిలకడగా ఉండే విధంగా విప్లవకర స్థావర ప్రాంతాలను నెలకొల్పడానికీ కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యడానికి అది పెద్ద ఎత్తున విప్లవ యుద్ధాన్ని ప్రారంభించింది. కేవలం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద మాత్రమే, ఎర్రసైన్యం, దేశంలో విప్లవ శక్తులన్నిటినీ సరిగా అనుసంధానించ గలుగుతుంది. ప్రపంచ విప్లవానికి చైనా విప్లవానికీ ఉన్న సంబంధం గురించి నిజంగా అవగాహన చేసుకోగలుగుతుంది. తద్వారా విజయవంతమైన వ్యూహాన్ని రూపొందించి, మహత్తరమూ, కష్ట భూయిష్టమూ అయిన ఈ కర్తవ్యాన్ని కృత నిశ్చయంతో నెరవేర్చగలుగుతుంది.


కామ్రేడ్ ఛూటే

వ్యవసాయ విప్లవం అభివృద్ధి చెందడానికి కారణం కార్మికులపై రైతుల నాయకత్వం ఉండటమేనని, అంటే పట్నవాసులపై పల్లెవాసుల నాయకత్వం ఉండటమే అందుకు కారణమని లిక్విడేషనిస్టులు (దివాళాకోరులు) అంటారు. అంతిమంగా ఎర్రసైన్యం త్వరలో తుడిచిపెట్టుకుపోయే 'బందిపోటు దొంగల ముఠా' అని కూడా వాళ్లు దుయ్యబడతారు. కమ్యూనిస్టు పార్టీ ప్రత్యక్ష నాయకత్వం కిందనే ఎర్రసైన్యం పుట్టిపెరిగిందనే వాస్తవాన్నీ వ్యవసాయ విప్లవం గాఢమవుతున్న కొద్దీ గ్రామీణ పేద ప్రజల మద్దతుతో అది ఇంకా బలపడుతుందనే వాస్తవాన్నీ వారు కొట్టి పారేస్తారు. ఎర్రసైన్యం కమ్యూనిస్టు పార్టీ ప్రత్యక్ష నాయకత్వం కింద పుట్టిన గొప్ప విప్లవకర సాయుధ బలగం అనే సంగతిని కొమింటాంగ్ పార్టీ, సామ్రాజ్యవాదులు కూడా గుర్తిస్తూ వుంటే మన స్వీయవర్గ దృక్పథం నుంచీ మనం ఆవిషయాన్ని మరింత స్పష్టంగా గుర్తించాలి. ఎర్రసైన్యంలో మిలటరీ

కమాండ్, మరీ ముఖ్యంగా రాజకీయ శిక్షణ, రాజకీయ కమిస్సార్ల వ్యవస్థ ఖచ్చితంగా కమ్యూనిస్టు పార్టీ ఏకైక నాయకత్వం కింద ఉండేటట్టు మనం జాగ్రత్త వహించాలి.

కార్మిక వర్గ అగ్రగామి దళం అయిన కమ్యూనిస్టు పార్టీ, సైన్యంలో రాజకీయ కమిస్సార్లు రాజకీయ శాఖ ద్వారా ఎర్రసైన్యంలో తన నాయకత్వాన్ని అందిస్తుంది. రాజకీయ కమిస్సార్లు మార్గదర్శకత్వం వహించే ఆ రాజకీయ శాఖలు మన సోవియట్ రాజకీయ యంత్రాంగంలో భాగమే. అవి పార్టీ రాజకీయ పంథానూ క్రమశిక్షణనూ ఎర్రసైన్యంలో అమలు చేస్తాయి. ఆ విధంగా, ఎర్రసైన్యంలో పార్టీ సంస్థల పనికి రాజకీయ కమిస్సార్లు కేంద్ర సోవియట్ ప్రభుత్వానికి పార్టీకి చెందిన ప్రతినిధులనీ, అందువల్ల సైనిక బలగాల క్రమశిక్షణను పటిష్టం చేయడం వారి రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధి చెయ్యడం, వారి పోరాట సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి విషయాల్లో మిలటరీ కమాండర్లతో సమానంగా వారు కూడా బాధ్యత వహించాలనీ, చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఎర్ర సైన్యానికి జారీ చేసిన మొదటి ఆదేశంలోనే చాలా స్పష్టంగా చెప్పింది. ఎర్ర పోరాట యోధులు ప్రజల రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధి చెయ్యడం, సైన్యం పోరాట సామర్థ్యాన్ని క్రమశిక్షణనూ పటిష్టపరచడం, ఇవీ పార్టీకీ యూత్ లీగ్‌కూ ప్రధాన కర్తవ్యాలు. రాజకీయ కమిస్సార్లు సైన్యానికి మొత్తంగా బాధ్యత వహిస్తారు కనక, పార్టీ సంస్థలకు కూడా వారే బాధ్యత వహిస్తారు.

ఈ ఆదేశాన్ని అనుసరించడం ద్వారానే మనం ఎర్రసైన్యంలో రాజకీయ కమిస్సార్ల పద్ధతిని బలంగా నెలకొల్పి సరైన పార్టీ నాయకత్వం అమలు జరిగేలా చూడగలం. అన్ని స్థాయిలలోనూ రాజకీయ కమిస్సార్లను ఎంపిక చేయడంలో పార్టీ కూడా ఎక్కువ శ్రద్ధ వహించాలి. అత్యంత విశ్వాస పాత్రుల్ని, సాహసవంతులైన, కమ్యూనిస్టుల్ని, ఉన్నత స్థాయిలో వర్గ దృక్పథం కలవారినీ కమిస్సార్లుగా ఎంపిక చేయాలి. రాజకీయ కమిస్సార్లుగా పని చెయ్యడానికి కార్మికవర్గం నుంచీ వచ్చిన ఉత్తమ కేడర్లకు శిక్షణ ఇవ్వాలి. ఇలా చెయ్యడం ద్వారానే మనం పార్టీ నాయకత్వాన్ని సవ్యంగానూ పటిష్టంగానూ నిర్మించి ఎర్రసైన్యాన్ని ఉక్కు ముక్కలా బలంగా తయారు చెయ్యగలం.

**మూడోది, రాజకీయ శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి.**

రాజకీయ శిక్షణను వర్గ చైతన్యాన్ని మొద్దుబార్చే సాధనంగానో లేదా వర్గాతీతమైన ఆడంబరమైన పొల్లు మాటలుగా మార్చివేసే బూర్జువా పద్ధతిగానో ఎర్రసైన్యం భావించదు. దానిని వ్యతిరేకిస్తుంది. ఎర్రసైన్యపు రాజకీయ శిక్షణకు బూర్జువా వర్గపు శిక్షణకు మధ్యగల మౌలికమైన తేడా అదే. ఎర్రసైన్యంలో రాజకీయ శిక్షణ ఉద్దేశం కమాండర్లు యోధులలో రాజకీయ చైతన్యాన్ని మేలుకొల్పి అభివృద్ధి చెయ్యడమే. ఈ శిక్షణతో వారు తమ వర్గ ప్రయోజనాలను తెలుసుకుని, తమ వర్గ రాజకీయ కర్తవ్యాలకు అంకితం అవ్వగలుగుతారు. కృత నిశ్చయంతో శత్రువుపై పోరాడి, శత్రువును ధ్వంసం చేసి తమ వర్గాన్ని విముక్తి చేసుకునే లక్ష్యాన్ని సాధించగలుగుతారు. అజేయమైన ఎర్రసైన్యాన్ని నిర్మించాలంటే, మనం మొట్టమొదట, కమాండర్లకూ సైనికులకూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నమ్మకం కలిగించాలి. కార్మిక, కర్షక మైత్రికి నాయకత్వం వహించి నడిపించడం కమ్యూనిస్టు పార్టీ విద్యుక్త ధర్మమనీ, విప్లవంలో కార్మిక వర్గం నాయకత్వ పాత్ర వహించవలసి ఉన్నదనీ, విప్లవ యుద్ధం వర్గ స్వభావం దేశంలో కార్మికులను, రైతులను తదితర శ్రమజీవులను మొత్తంగా విముక్తి చెయ్యడమేననీ, యుద్ధంలో వారు తమ కర్తవ్యాలను చురుగ్గా పూర్తి చెయ్యడం ఆ ఆశయాన్ని మొత్తంగా విజయవంతం చెయ్యడం కోసమేననీ వారు అర్థం చేసుకునేటట్టు చెయ్యాలి. ప్రజానీకంలో బ్రహ్మాండమైన శక్తి ఉందనీ ఎర్రసైన్యం ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకోవాలనీ వారు గ్రహించేలా చెయ్యాలి. ప్రస్తుత దశలో చైనా విప్లవం సంపూర్ణ విజయం నాలుగు అంశాలను అనుసంధానించడానికి చేసే విప్లవకర కృషి మీద ఆధారపడి ఉందనీ, అంటే ఎర్రసైన్యాన్ని విస్తరించడం కార్మికుల తిరుగుబాట్లు, రైతుల తిరుగుబాట్లు, సైనికుల (శత్రు సైన్యంలో) తిరుగుబాట్లు ఈ నాలుగు అంశాలను విప్లవకరంగా అనుసంధానించడం మీద ఆధారపడి ఉందనీ వారు అవగాహన చేసుకునేటట్టు చెయ్యాలి. అన్నింటినీ మించి చైనా విప్లవంలో వచ్చే వర్తమాన పరిణామాలను వారు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. చైనా విప్లవ భవిష్యత్తు గురించీ, చైనా విప్లవంలోను ప్రపంచ విప్లవంలోను ప్రస్తుతం ఉన్న ఊపు (ఉధృతి స్థితి) గురించీ వారికి స్పష్టత వుండాలి. శత్రు శిబిరంలో ఉన్న రాజకీయ ఆర్థిక ఉద్రిక్తత, భయోత్పాతం మొత్తంగా చైనా విప్లవానికి చాలా అనుకూలమైనవని వారు గుర్తించాలి. విప్లవ ప్రతిఘాతుక కొమింగ్‌టాంగూ సామ్రాజ్యవాదమూ ఇప్పుడు పతనావస్థలో ఉన్నాయనీ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద ఎర్రసైన్యం వాటిని తప్పకుండా ఓడించగలదనీ వారికి పూర్తిగా నమ్మకం కుదరాలి.

అటువంటి గట్టి రాజకీయ విశ్వాసాన్ని సాధించడమంటే, కంటికి కనిపించని తిరుగులేని ఆయుధాన్ని ధరించిన అజేయమైన ఎర్ర సైన్యాన్ని తయారు చెయ్యడానికి దృఢమైన బౌద్ధిక పునాదిని వెయ్యడమే. ఇది కనుక మనం సాధిస్తే, విప్లవ క్రమంలో ఎదురయ్యే ఎటువంటి కష్టాలనైనా దాటగలం. ఎంతటి భయంకరమైన పోరాటాన్నైనా తట్టుకుని నిలబడగలం. ప్రతీ పోరాటంలోనూ మరింతగా ధైర్య సాహసాలను పుంజుకుని అంతిమంగా విజయం సాధించే వరకూ కొనసాగగలం.

**నాలుగోది, అభివృద్ధి చెందిన మిలటరీ సాంకేతిక జ్ఞానం కావాలి**

సాంకేతిక జ్ఞానం దినం దినం అభివృద్ధి చెందుతూ యుద్ధ తంత్రంలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. అందువల్ల మరింతగా ఉన్నత ప్రమాణాలతో శిక్షణ అవసరమౌతుంది. అంతేకాక, సాంకేతిక జ్ఞానం పెంపొందే కొద్దీ సాధారణ ఎత్తుగడలలో కూడా మార్పులు అవసరమవుతాయి.

చైనా సాంకేతికంగా చాలా వెనుకబడినదే అయినప్పటికీ యాభై ఏళ్లకుపైగా అభివృద్ధి చెందిన మిలటరీ టెక్నిక్‌లు వాడడం

ప్రారంభించింది. దాదాపుగా అప్పటి నుంచి కూడా అది, జపాను, జర్మనీల నుంచి నేర్చుకున్న ఎత్తుగడలు, టెక్నిక్‌లు ఇప్పటి సామ్రాజ్యవాదుల వాటి కంటే చాలా వెనుకబడి వున్నాయనేది నిజమే. కానీ సామ్రాజ్యవాదులు వారికి నిరంతరం మిలటరీ సరఫరాలు సహాయం అందజేస్తూ ఉండడతో చైనాలో యుద్ధం క్రమంగా అధునాతనంగా తయారయ్యింది. వివిధ దేశాల నుంచి రకరకాల కొత్త ఆయుధాలు ప్రవేశపెడుతున్నారు. వాటిని ఇంకా మెరుగు పరుస్తున్నారు. అందువల్ల శత్రువు కంటే మేలైన ఎత్తుగడల అభివృద్ధి చేసుకోవడం, కొత్త ఆయుధాల ఉపయోగాన్ని నేర్చుకోవడం ఎర్ర సైన్యానికి ఎంతైనా అవసరం. కొత్త ఆయుధాలను ఉపయోగించడం నేర్చుకుని ఉంటే శత్రువు నుంచి గుంజుకొనే వాటిని వాడుకోగలం.

చైనా ఎర్ర సైన్యం దీర్ఘకాల గెరిల్లా యుద్ధ క్రమంలో ఎత్తుగడలలో ఎంతో అనుభవం సంపాదించింది. ముఖ్యంగా దక్షిణ చైనాలో కొండల్లో పోరాటం గురించి అది చాలా నేర్చుకుంది. బలంగా దాడి చేసే తత్వాన్ని ఎంతగానో పెంపొందించుకుంది. అయితే ఆధునిక విప్లవ యుద్ధ స్థాయి పెరుగుతున్న కొద్దీ, సాహసంగా ముందుకురికి దాడి చేయడం మాత్రమే సరిపోదు. మన ప్రస్తుత పోరాట అనుభవ స్థాయి వాస్తవిక అవసరాలను తీర్చడానికి ఎంత మాత్రమూ చాలదు. అందువల్ల, ఎత్తుగడల అభివృద్ధిని త్వరితం చెయ్యడానికి మనం ప్రత్యేక కృషి చెయ్యాలి. దేశవ్యాప్త స్థాయిలో పోరాడడానికి సామ్రాజ్యవాదులతో ప్రత్యక్షంగా పోరాడడానికి మనం సిద్ధం కావాలి. నిజానికి లాంగ్ జౌ, చాంగ్‌షాలలోనూ, చాంగ్ జియాంగ్ నది పరివాహక ప్రాంతంలోనూ ఎర్రసైన్యం సామ్రాజ్యవాదుల ఫిరంగులకూ, విమానాలకూ అనేక సార్లు ఎదురు నిలిచి కాల్పులు జరిపింది.

ఎర్ర సైన్యపు నిర్మాణ స్వరూపాన్ని మార్పు చేస్తూ పార్టీ కేంద్ర కమిటీలో విప్లవ మిలటరీ కమీషన్ చేసిన నిర్ణయం దాని పోరాట పటిమను మరింత పటిష్టం చేసింది. కొత్తగా ప్రచురించిన ఎర్రసైన్యం మాన్యువల్‌లో లాంచన ప్రాయమైన విషయాలన్నీ తొలగించి యుద్ధ రంగంలో రక్షణ కట్టడాలపై దాడులనే నొక్కి చెప్పింది. విస్తరిస్తున్న విప్లవంలో తలయెత్తే అవసరాలను తీర్చడం, ఎర్ర సైన్యాన్ని అజేయంగా తయారు చెయ్యడానికి అవసరమైన ఎత్తుగడలు టెక్నిక్‌ల అభివృద్ధిని ఆవిష్కరించడం దీని ఉద్దేశం.

**ఐదోది, ఖచ్చితమైన క్రమశిక్షణను స్వచ్ఛందంగా పాటించాలి.**

ఎర్ర సైన్యపు క్రమశిక్షణా నియమాలు వర్గ ప్రయోజనాలకు విప్లవ ప్రయోజనాలకు విప్లవ పోరాటం మొత్తం అవసరాలకు తగినట్టుగా రూపొందాయి. ఎర్ర సైన్యంలో క్రమశిక్షణ, కమాండర్లకు సైనికులకు కూడా సమంగానే వర్తిస్తుంది. కేవలం సైనికులను అణిచిపెట్టి ఉంచడానికి మాత్రమే ఉద్దేశించిన తెల్ల సైన్యపు (శత్రు సైన్యపు) క్రమశిక్షణకు ఇది పూర్తిగా భిన్నమైనది. ఎర్ర సైన్యంలో క్రమశిక్షణ అమలు చేసేది కొట్టడం, తిట్టడం ద్వారా ఎంత మాత్రం కాదు. ఆ క్రమశిక్షణ కార్మికవర్గ సమైక్యత పునాది మీద ఆధారపడి వుంటుంది. పరస్పర పర్యవేక్షణ ద్వారానూ, ఆత్మవిమర్శ, బోధన తత్వాన్ని ప్రోత్సహించడం ద్వారానూ ఆ క్రమశిక్షణ స్వచ్ఛందంగా ఉంటుంది. శత్రువుపై చేసే పోరాటాల్లో ఎర్రసైన్యం సభ్యులు కేవలం సమైక్యంగా పని చెయ్యడం మాత్రమే కాక, ఒకే కార్యదీక్షతో పాలు పంచుకుంటారు. వారు తమ వర్గ ప్రయోజనాలకు విప్లవ ప్రయోజనాలకు భంగం కలగనివ్వరు సరికదా వాటి కొరకు చివరకు తమ ప్రాణాలను ఇవ్వడానికి సైతం తయారుగా ఉంటారు.

క్రమశిక్షణను చైతన్యపూర్వకంగా అమలు చేసే తత్వాన్ని పెంచి పోషించడం ద్వారా వ్యక్తులుగా కమాండర్లు యోధుల్లో విడివిడిగా గల విధేయతను, సాహసాన్ని, క్రమశిక్షణ తత్వాన్ని మనం యావత్తు సైన్యపు సర్వసామాన్య గుణాలుగా మార్చివెయ్యగలుగతాం. క్రమశిక్షణను చైతన్యవంతంగా పాటించినట్టయితే ఎర్రసైన్యం ఉక్కుముక్కలా బలంగా ఉంటుంది.

**ఆరోది, కేంద్రీకృతమైన కమాండు, ఏకీకృతమైన శిక్షణ ఉండి తీరాలి.**

ఎర్రసైన్యం సోవియట్ రాజకీయ అధికారపు ఒక ప్రత్యేక నిర్మాణ సంస్థ. అది, కార్మికులు కర్షకుల ప్రజాస్వామిక కర్తవ్యాలను పరిపూర్తి చెయ్యడం మాత్రమే కాక, సోషలిజాన్ని నిర్మించడానికీ, పదిలంగా కాపాడడానికి ప్రధానమైన కాపుదలగా కూడా ఉపయోగపడాలి. అది దేశీయ యుద్ధ ప్రభువుల సైన్యాలతో పోరాడ్డం మాత్రమే కాదు, అత్యంత ఆధునాతన ఆయుధాలు కలిగి ఇంకా మెరుగ్గా సంఘటితపడి ఉన్న సామ్రాజ్యవాదుల సైన్యాలతో కూడా పోరాడాలి. అందువల్ల ఎర్రసైన్యం తాము ఎటువంటి కొత్త పరిస్థితుల్లో పోరాడవలసి వస్తుందో వాటికి అనుగుణంగా తమను తాము మలుచుకోవడానికి అనువుగా తన కంటూ ఒక నిర్మాణ రూపాన్ని ఎంతగానో అభివృద్ధి చేసుకోవాలి. ఏకీకృతమైన శిక్షణా విధానాన్ని ఏకీకృత కమాండు పద్ధతిని మనం నెలకొల్పాలి. వర్గ శత్రువు సాయుధ బలాలను తుడిచిపెట్టడానికి గాను, ఎర్రసైన్యం చేసే ప్రతి చర్య సాధ్యమైనంత ఎక్కువగా కేంద్రీకరణతో కూడి వుండాలి. అయితే ఇక్కడ ఒక సంగతిని మరోసారి నొక్కిచెప్పాలి. ఎర్రసైన్యం పోరాట సామర్థ్యం కేవలం మిలటరీ టెక్నిక్‌పై మాత్రమే ఆధారపడి ఉండదు. అది ప్రధానంగా దాని వర్గ చైతన్యంపైనా దాని రాజకీయ పలుకుబడిపైనా, అంటే శత్రు బలగాలను ధ్వంసం చెయ్యడానికి విశాల ప్రజానీకాన్ని కార్మికుల్ని, కర్షకుల్ని సమీకరించడంపైన ఆధారపడి ఉంటుంది.

చివరిగా, ఒక్క విషయం నొక్కి చెప్పదలుచుకున్నాను. అజేయమైన ఎర్ర సైన్యాన్ని నిర్మించడం పోరాట క్రమంలోనే సాధ్యమౌతుంది. గత పోరాటాల్లో ఎర్రసైన్యం గడించిన అనుభవాల్ని సమీక్షించి క్రమబద్ధం చెయ్యడం, పైన చెప్పిన అవసరాలకు అనుగుణంగా ఉక్కుముక్కలా బలమైన ఎర్రసైన్యాన్ని నిర్మించి విస్తరించడం, దాని మహత్తర చారిత్రక కర్తవ్యాన్ని సాధించడం ముందెన్నటికంటే కూడా నేడు మరింతగా అవసరం.

✪

# రక్త హీనత

**చాలా మంది స్త్రీలలో ప్రధాన సమస్య రక్తహీనత.**

ఊపిరితిత్తుల నుండి... ఆక్సీజన్ (ప్రాణ వాయువు) ను శరీరంలో వివిధ అవయవాలకు సరఫరా చేయడానికి రక్తం చాలా అవసరమవుతుంది.

ప్రాణ వాయువును ఉపయోగించుకునే మనం తినే ఆహారపదార్థాలన్నీ శక్తిగా మారుతాయి. ఈశక్తి అవయవాల కదలికలకు ఉపయోగపడుతుంది. మన గుండె కొట్టుకోవడానికి కావలసిన శక్తి ఆహారంతో పాటు ప్రాణవాయువు చాలా అవసరం. మన రక్తంలోని ఎర్రరక్త కణాలు ప్రణవాయువును సరఫరా చేస్తాయి. వీటిలో వున్న 'హిమోగ్లోబిన్'లో... ఇనుము, ప్రోటీన్లతో కూడిన అణువులుంటాయి.

ప్రతి ఎర్రరక్త కణం ప్రాణ వాయువును వివిధ భాగాలకు జాగ్రత్తగా తీసుకువెళ్ళి అక్కడ విడుదల చేస్తాయి. శరీరంలో ఏ భాగానికైనా ఆక్సీజన్ సరఫరా కాకపోతే ఆయా భాగాలు జీవించలేవు.

హిమోగ్లోబిన్‌కు అవసరమైన ఇనుము మనం తీసుకునే ఆహారం నుండే లభ్యం కావాలి. ఈ హిమోగ్లోబిన్ మన రక్తంలో తగిన మోతాదులో వుండాలి. అంతకన్నా తక్కువ వుంటే రక్తహీనత ఏర్పడుతుంది.

ప్రతి 100 మిల్లీలీటర్ల రక్తానికి హిమోగ్లోబిన్ పిల్లలలో 11.00 గ్రాములు, స్త్రీలలో 12.00 గ్రాములు, గర్భిణీ స్త్రీలలో 11.00 గ్రాములు వుండాలి. లేకపోతే రకతహీనత అని నిర్ధారించడం జరుగుతుంది. ఒక మిల్లీలీటరు రక్తంతో సుమారు 40 లక్షలు ఎర్ర రక్త కణాలుండాలి.

## రక్త హీనతకు కారణాలు

రక్త హీనతకు ఎంన్నో రకాల కారణాలున్నా... ముఖ్యంగా ఆహారలోపం. సాధారణంగా మనం తీసుకునే ఆహారంలో ఇనుము చాలా తక్కువగా ఉంటుంది.

కాలేయం, చేపలు, మాంసం మొదలగు వాటిలో... ఇనుము ఎక్కువగా... వుంటుంది. ఆకు కూరలు, చిక్కుళ్ళు, పప్పుధాన్యాలలో ఇనుము కొంచెంగా వుంటుంది. అయితే కొన్ని శాకాహారాలలోని కొన్ని పదార్థాలు, కాఫీ, టీ, చింతపండులోని 'టానిన్' అనే పదార్థం - శరీరంలో ఇనుమును గ్రహించకుండా అడ్డుకుంటున్నాయి. దీని వలన మనం తీసుకునే ఆహారంలో కొద్దిపాటి ఇనుము కూడా మలము ద్వారా బయటికి విసర్జనవుతుంది.

ఇంకా... స్త్రీల బహిష్టు సమయాలలో అధిక రక్తస్రావం, వెంట వెంటనే పిల్లలు పుట్టడం వలన కోల్పోయిన రక్తన్ని సమకూర్చుకోలేని పరిస్థితుల్లో కూడా రక్త హీనత ఏర్పడుతుంది.

జీర్ణకోశ, మూత్రకోశ సంబంధమైన వ్యాధులు..... మలేరియా వంటి దీర్ఘ వ్యాధులు.... ప్రేగులలో బద్దె పురుగులు, గర్భస్రావాలు వంటివి కూడా రక్త హీనతకు కారణాలు.

మన దేశంలో స్త్రీలు గర్భవతులుగా వున్నప్పుడు 60 నుండి 70 శాతం వరకూ రక్త హీనతకు గురవుతున్నారు. అసలు రక్తం సమృద్ధిగా కావలసింది ఈ సమయంలోనే.

ఎప్పుడూ నీరసంగా వుండటం, కళ్ళు తిరగడం, ఉన్నట్లుండి కళ్ళు చీకట్లు కమ్మడం, తొందరగా అలసిపోవడం, పనిలో ఆసక్తి లేకపోవడం వంటివి రక్తహీనత కలవారిలో కనిపించే సాధారణ లక్షణాలు.

భుజాల దగ్గర, నడుములోనూ, కీళ్ళలోనూ ఎప్పుడూ నొప్పులుంటాయి. స్త్రీలలో - రక్తంలోని హిమోగ్లోబిన్ మరీ తక్కువ స్థాయిలో 5 నుండి 8 గ్రాములే వుంటే... వారిలో రోగనిరోధక శక్తి బాగా తగ్గిపోయి త్వరగా వ్యాధులకు గురవుతారు.

రక్త హీనతతో, వున్న వారికి బాహ్యాపరంగా సులువుగా గుర్తించవచ్చు. పాలిపోయినట్లు కనబడతారు. కంటిరెప్పల లోపలి భాగం, పంటి చిగుళ్ళు, గోర్లు పాలిపోయి తెల్లగా వుంటాయి. రక్తహీనత తీవ్రంగా వున్నవారిలో ముఖం, పాదాలు బగా ఉబ్బుతాయి. ఊపిరి పీల్చుకోవడం కష్టంగా వుంటుంది.

ఈ లక్షణాలను బట్టి రక్తం, మల, మూత్ర పరీక్షలు చేయించుకుంటే రక్తహీనత నిర్ధారణవుతుంది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తెలుస్తుంది. దాన్ని బట్టి చికిత్స చేయించుకోవాలి.

గర్భంతోనున్న స్త్రీలకు ఈ పరీక్షలు తప్పనిసరి. ఇతర కారణాలేమన్నా ఉన్నాయో తెలుసుకుని వాటి నివారణకు తగిన చికిత్స చేయించుకోవాలి.

రక్తంలో హిమోగ్లోబిన్ 10 గ్రాములున్న స్త్రీలు ఐదు నెలల గర్భవతులుగా వున్నప్పుడు ఐరన్ మాత్రలు, ఫెర్రస్ ఫ్యూమరేట్ మాత్రలు లేదా 60-100 మి.గ్రా. ఫెర్రస్ సల్ఫేట్‌ను ఫోలిక్ యాసిడ్‌తో కలిపి రోజుకు ఒకటి చొప్పున ఒకటి రెండు డోసులు వేసుకోవాలి.

ఈ మాత్రలు ఖాళీ కడుపుతోగానీ, మాంసంతోగానీ, పుల్లటి పండ్లతో గానీ వేసుకోవడం మంచిది. మాంసపదార్థాలలో సూపులు, జావలు... ఉసిరి నిమ్మపండ్లలో నుండే విటమిన్ 'సి' ఇనుమును ఇముడ్చుకోవడానికి ఉపయోగపడతాయి.

6 నుండి 9 నెలలల మధ్య గర్భంతో నున్న స్త్రీలలో హిమోగ్లోబిన్ 8 నుండి 10 గ్రాముల మధ్యగాని వున్నట్లయితే వారు ఐరన్ ఇంజక్షన్ తీసుకోవాల్సి వుంటుంది. 9వ నెలలో హిమోగ్లోబిన్ 8 గ్రాములు మాత్రమే వున్నట్లయితే రక్తం ఎక్కించాల్సిన అవసరం కూడా కలుగవచ్చు. పది - పదిహేను ఐరన్ ఇంజక్షన్స్ రోజూ లేదా రోజు మార్చి రోజు తీసుకోవాల్సి వుంటుంది.

## తలనొప్పి

చాలామంది స్త్రీలలో తలనొప్పి పెద్ద సమస్య. ఎక్కువగా తలనొప్పితో బాధపడుతుంటారు. ఏ పని చేయలేరు. బాధతో చాలా ఇబ్బంది పడుతుంటారు.

తలనొప్పి రాని వారంటూ ఈ ప్రపంచంలో ఎవరూ వుండరు. 99 శాతం మందికి అప్పుడప్పుడు తలనొప్పి వచ్చి పోతుందని వైద్యుల అభిప్రాయం.

తలనొప్పి అతి సహజంగా ఏర్పడే రుగ్మత. ఈ తలనొప్పికి వుండే కారణాలు ఇతర ఏ వ్యాధికి కూడా వుండకపోవచ్చు... దాదాపు యాభైకి పైగా స్పష్టమైన కారణాలున్నాయి.

సాధారణంగా... ఆలోచన, టెన్షన్, ఆశాభంగం, అతి నిరీక్షణ, అవిశ్రాంతి, మనశ్శాంతి లేకపోవడం, అపజయాలు, ఆహారపు అలవాట్లల్లో మార్పులు... ఇలా మామూలు కారణాల వలన తలనొప్పులు రావచ్చు.

ఇక ఆరోగ్య సంబంధమైన కారణాలు... ఎలర్జీ, రక్తపోటు, కాన్‌స్టేపేషన్, ఇన్‌ఫెక్షన్, మెనోపాజ్, మైగ్రేయిన్, సైనసైటిస్ లాంటి కారణాల వలన తలనొప్పి రావచ్చు. ఇంకా... ఐస్‌క్రీం తినడం వలన, చెవిపోటు, పిప్పిపన్ను పోటువలన, ఆకలి వలన, కళ్ళకు శ్రమ ఎక్కువ అవడం వలన, హేంగోవర్ వలన కూడా తల నొప్పులు రావచ్చు.

ప్రొఫెసర్ డేను చేసిన పరిశోధనలను బట్టీ... జీవ కణాలలో ఉత్పత్తి అయ్యే 'హిస్టమీన్' తలనొప్పికి ప్రధాన కారణమని చెపుతున్నారు. డాక్టర్ హనింగ్‌టన్ జరిపిన విస్తృత పరిశోధనల వల్ల, 'టైనమీన్' శరీరంలో ఎక్కువగా నిల్వ వుండటం వలన ఎక్కువగా తలనొప్పి వచ్చే అవకాశం వుందని తేల్చిచెప్పారు.

## టెన్షన్

మానసిక ఒత్తిడి వలన వచ్చే తలనొప్పిలో – తలంతా నొక్కినట్లు అయిపోవడం, చిరాకు, కణతల దగ్గర పీడన, తలంతా మొద్దుబారినట్లు వుండటం జరుగుతుంది. మెడ, భుజాలు కూడా నొప్పిగా వుంటాయి. తల, మెడ, కండరాలు సంకోచిస్తాయి. ఎక్కువగా చదివినా, రాసినా, ఆలోచించినా కూడా ఈరకం తలనొప్పి రావచ్చు. ఈ రకపు తలనొప్పి సాధారణంగా మధ్యాహ్నం, సాయంత్రాల్లో వస్తుంది.

ఏదైనా తీవ్రమయిన ఆలోచనగానీ, సమస్యగానీ వచ్చినా, ఉద్రిక్తత పెరిగినా, పనిభారం ఎక్కువ అయినా టెన్షన్ తలనొప్పి వస్తుంది. నుదురు, దాని ప్రక్కన వుండే సన్నని కండరాలు బిగుసుకుపోతాయి. కళ్ళపైన, తల వెనుక భాగంలో నొప్పి రావచ్చు. ఈ రకపు తలనొప్పి సాధారణంగా మధ్యాహ్నం, సాయంత్రాల్లో వస్తుంది.

టెన్షన్ తలనొప్పి వచ్చిన వారు ఆస్ప్రిన్ మాత్ర ఏదయినా ఒకటి వేసుకోవచ్చు. మెడ, భుజాల దగ్గర వేడినీటి కాపడం పెట్టడం, విశ్రాంతిగా కళ్ళు మూసుకొని పడుకోవడం వలన ఉపశమనం కలుగుతుంది. 60 శాతం మందికి టెన్షన్ తలనొప్పులే వస్తుంటాయి.

## కళ్ళు అలసట

కళ్ళు అలసట వలన కలిగే తలనొప్పిలో – తలంతా బరువెక్కినట్లు, కళ్ళలోపలికి గుంజుతున్నట్లు అనిపిస్తుంది. కంటి కండరాలకు అధిక శ్రమవలన ఈ తలనొప్పి వస్తుంది. పుస్తకాలను కళ్ళకు దగ్గరగా పెట్టి చదవటమో, తక్కువ వెలుతురులో చదవడమో, రాయడమో వలన కూడా ఈ తలనొప్పి వస్తుంది.

కంటి డాక్టరుకు చూపించుకుని అవసరమైతే కంటి అద్దాలు వేయించుకోవాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఐడ్రాప్స్ వాడకూడదు. కంటి జబ్బులున్నాయేమో పరీక్ష చేయించుకోవాలి.

## రక్తపోటు

అధిక రక్తపోటు వలన వచ్చే తలనొప్పి నడినెత్తిన బాగా నొప్పిని కలిగిస్తుంది. శరీరమంతా విపరీతంగా చెమటలు పడతాయి. గాభరా, వికారం, వాంతులు వుంటాయి. ఈ రకం తలనొప్పి ఉదయం నిద్రలేవగానే మొదలై గంటగంటకూ పెరుగుతుంది. సాయంత్రం అయ్యేసరికి ఇంకా ఎక్కువవుతుంది.

రక్తపోటు నార్మల్‌లో వుండడానికి రోజూ మాత్రలు వాడుతుండాలి. వేరే ఎటువంటి చికిత్స పనిచేయదు.

## ఆకలి

ఆకలి వలన వచ్చే తలనొప్పి తలంతా వ్యాపించి, దిమ్మెత్తినట్టు వుంటుంది. చాలా చిరాకు కలిగిస్తుంది. అయిదు గంటలపాటు ఏమీ తినకుండా ఖాళీ కడుపుతో వుండే వారికి వస్తుంటుంది. ఉపవాసాలు చేస్తూ నిద్రమేల్కొనే వారిలో ఈ రకపు తలనొప్పి ఎక్కువగా వస్తుంటుంది. తలనొప్పితో పాటు కడుపులో మంటకూడా వస్తుంది.

ఆకలి వలన తలనొప్పి వచ్చినపుడు మాత్రలు వేసుకోకూడదు. మాత్రలు పనిచేయకపోగా కడుపులో మంట ఎక్కువవుతుంది. కాఫీ, టీలు త్రాగకూడదు. హైడ్రేట్లు ఎక్కువుండే ధాన్యాహారాలను వేళకు భోజనంగా తీసుకోవాలి. కారాలు, పుల్లటి పదార్థాలు బాగా తగ్గించాలి.

## మైగ్రేయిన్

తల నొప్పులలో చాలా తీవ్రమైన బాధతో వుండేది మైగ్రేయిన్ తలనొప్పి. దీన్నే పార్శ్వనొప్పి అని కూడా అంటారు. ఇది నరాలకు సంబంధించిన వ్యాధి. తలలోని రక్తనాళాలు వాచి, నరాల చివర భాగాలలో ఒత్తిడి కలగడం వలన ఈ తలనొప్పి వస్తుంది.

తల పగిలిపోతున్నంత నొప్పిగా వుంటుంది. కొంతమంది స్త్రీలు బాధకు తట్టుకోలేక ఏడుస్తారు కూడా. చాక్లెట్లు అధికంగా తినడం, అధిక వెలుతురు, నిద్ర చాలకపోవడం, అధిక శ్రమ, నూనె పదార్థాలు ఎక్కువగా తినడం, చల్లారిన పదార్థాలు తినడం, బహిష్టు, గర్భనిరోధక మాత్రలు వాడటం వలన కూడా ఈ తలనొప్పి రావచ్చును.

ఈ తలనొప్పిలో వికారం, వాంతులు కలుగుతాయి. వెలుతురును ఏమాత్రం చూడలేరు. ఇది సాధారణంగా పగటి సమయాల్లోనే వస్తుంది. ఈస్ట్రోజన్ తక్కువైన వాళ్ళలో ఈరకపు తలనొప్పి తరచుగా వస్తుంది. కాబట్టి స్త్రీలలోనే ఎక్కువగా వస్తుంది.

మైగ్రేయిన్ తలనొప్పి వచ్చినపుడు – చీకటిగా, బాగా గాలివచ్చే దిశలో విశ్రాంతిగా పడుకుని నిద్రపోవడానికి ప్రయత్నించాలి. భోజనం తగ్గించాలి. పళ్లరసాలు తీసుకోవచ్చు. తరచూ వస్తుంటే డాక్టర్ సలహాను సంప్రదించి మందులు వాడాలి.

## సైనసైటిస్

తలనొప్పులలో పదిశాతం సైనసైటిస్ వలన వస్తాయి. ఈ తలనొప్పి ముఖం పైభాగం ఎముకల దగ్గర ఎక్కువగా వుంటుంది. వంగినపుడు, తల తిప్పినపుడు బాగా ఎక్కువవుతుంది. కొందరికి జ్వరం రావడం, ముక్కు నుండి ద్రవం కారటం కూడా జరుగుతుంది. ముక్కులు బిగదీసుకుపోయినట్లు వుంటాయి.

పడిశంతో బాధపడుతున్న వారిలో సైనసైటిస్ తలనొప్పి ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. కళ్ళపైన, కాళ్ళ మధ్య, ముక్కు పైభాగాన చాలానొప్పిగా వుంటుంది. మధ్యాహ్న సమయాల్లో ఈ రకం తలనొప్పి ఎక్కువగా వుంటుంది.

బాగా మరగకాచిన నీటి ఆవిరిని దుప్పటి ముసుగేసుకుని ముక్కులతో బాగాపీల్చాలి. వేడి నీటిలో కొంచెము ఉప్పుగాని, తలనొప్పుల బామ్‌గాని వేసి పీల్చవచ్చు. సైనసైటిస్‌కు సంబంధించిన ఎక్స్‌రే తీయించి డాక్టర్ సలహాపై మందులు వాడాలి.

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

## పత్రికా ప్రకటన

**20 నవంబర్, 2021**

## భారత కమ్యూనిస్టు పార్టీ [మావోయిస్టు] కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు, తూర్పు రీజనల్ బ్యూరో ఇంచార్జి కామ్రేడ్ కిషన్ దా [ప్రశాంత్ బోస్] మరియు కేంద్ర కమిటీ సభ్యురాలు షీలా మరాండిల అరెస్టులను తీవ్రంగా ఖండించండి!

## మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించాలనీ, వెంటనే బెయిల్‌పై వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేయండి!

మా పార్టీ కేంద్రకమిటీలోని పొలిట్ బ్యూరో సభ్యుడు, తూర్పు రిజనల్ బ్యూరో (ఈఆర్‌బి) ఇంచార్జి కామ్రేడ్ కిషన్ దా మరియు కేంద్ర కమిటీ సభ్యురాలు షీలా మరాండిలను నవంబర్ 11 వ తేదీన ఝార్ఖండ్ పోలీసులు సరాయికేలాలో అరెస్టు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. 76 యేళ్ళ వయసుగల కామ్రేడ్ కిషన్ దా ప్రోస్టేట్, డయాబెటిస్, కండ్ల సమస్యలతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం తీసుకుంటున్న సమయంలో ఆయనను ఝార్ఖండ్ పోలీసులు అరెస్టు చేశారు.

మా పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న భారత విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి మన దేశాన్ని బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు దేశంగా మార్చే ఉద్దేశ్యంతో కొనసాగిస్తున్న ప్రతీఘాతుక వ్యూహాత్మక 'సమాధాన్-ప్రహార్' సైనిక దాడుల్లో భాగంగానే ఈ అరెస్టులు జరిగాయి. సమాధాన్ బహుముఖ దాడుల్లో భాగంగా విస్తరింపజేసిన గూఢాచార వ్యవస్థ ద్వారా కామ్రేడ్స్‌ను అరెస్టు చేశారు.


కామ్రేడ్ కిషన్ దాదా


కామ్రేడ్ షీలా దీదీ

జీవిత సహచరులైన కామ్రేడ్ కిషన్ దా మరియు కామ్రేడ్ షీలా మరాండి ఇరువురు కూడా భారత దేశంలోని దోపిడి పాలకవర్గాలైన సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువాలు మరియు భూస్వాముల దోపిడీ పీడనల నుండి, పాలన నుండి ప్రజలను విముక్తి చేసి దేశంలోని పీడిత వర్గాలైన కార్మిక, కర్షక, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలకు చెందిన ప్రజల నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పర్చి సోషలిస్టు-కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించే లక్ష్యంతో సుదీర్ఘ కాలంగా వర్గపోరాటానికి నాయకత్వం వహిస్తున్నారు. వివిధ సామాజిక తరగతులకు చెందిన దళితులు, ఆదివాసులు, మహిళలు, ధార్మిక అల్పసంఖ్యాకులను ముఖ్యంగా ముస్లింల మరియు క్రిష్టియన్లను వారి వారి సమస్యల పరిష్కారానికై ఉద్యమాలల్లో సంఘటితం చేశారు.

కామ్రేడ్ కిషన్ దా నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాట సమయంలో అంటే 1966-67 లలో తన విద్యార్థి దశలో విప్లవోద్యమంలో భాగమయ్యాడు. కలకత్తాలో కార్మికవర్గ ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించాడు. 'దక్షిణ్ దేశ్' లో పనిచేసే సమయంలో ఆయన అసోంలోని వ్యూహాత్మక ప్రాంతాలలో ఉద్యమాన్ని నిర్మించే బాధ్యతలను స్వీకరించి అక్కడికి వెళ్లి పోయాడు. అక్కడ కొంత కాలం పనిచేసిన తర్వాత బీహార్-ఝార్ఖండ్‌లో పనిచేసే బాధ్యతను స్వీకరించాడు. అప్పటి నుండి ఇప్పటి వరకు కూడా బీహార్-ఝార్ఖండ్‌ను కేంద్రంగా చేసుకుని తన విప్లవ కార్యకలాపాలను కొనసాగించాడు. అక్కడ విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేస్తై ఎమ్.సీ.సీ.ఐ. ప్రధాన కార్యదర్శి అయ్యాడు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడే వరకు కామ్రేడ్ కిషన్ దా ఆ బాధ్యతల నిర్వహణలో ఉన్నాడు. ఆయన పీడిత ప్రజలను ముఖ్యంగా దళితులను, ఆదివాసులను అమితంగా ప్రేమించి కఠోర పరిశ్రమతో అంకితమై పనిచేస్తున్న నిబద్ధత కలిగిన పార్టీ కార్యకర్త మరియు నాయకుడు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మరియు కార్మికవర్గ అంతర్జాతీయతకు చెందిన ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టి భారత దేశ విప్లవోద్యమ నిర్మాణంలోను, దాన్ని ముందుకు తీసుకుపోవడంలో ప్రముఖమైన పాత్ర గల కామ్రేడ్. ప్రజలపై అపార విశ్వాసం గల నాయకుడు. తూర్పు రీజియన్లో ఎంతో ప్రజాదరణ పొందిన కేడర్ల ప్రియతమ నాయకుడాయన. భాకపా (మావోయిస్టు) పొలిట్ బ్యూరో సభ్యుడిగాను, పార్టీ సీనియర్ నాయకుడిగారూ ఆయన అనేక మహత్తరమైన సందర్భాలలో కీలకపాత్ర నిర్వహించాడు.

ఝార్ఖండ్‌లోని పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ షీలా దీదీ ఒక పేద సాధారణ పార్టీ సభ్యురాలి నుండి విప్లవోద్యమంలో మెట్టుమెట్టుగా అభివృద్ధి చెందుతూ కేంద్ర కమిటీ సభ్యురాలి స్థాయికి చేరింది. ఝార్ఖండ్‌లోని విప్లవ మహిళా ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన కామ్రేడ్. ఇంతకు ముందే సుదీర్ఘ జైలు జీవితాన్ని గడిపి వచ్చింది.

గతంలో మా కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు, అమరుడు కామ్రేడ్ వరుణ్ దా (సుశీల్ రాయ్) ను అరెస్టు చేసినపుడు జైలులో వైద్యం సహాయం అందివ్వకుండా చేసి చంపేసినట్లే ఈ ప్రభుత్వాలు ఇప్పుడు కామ్రేడ్ కిషన్ దా ను, కామ్రేడ్ షీలా దీ ని కూడా కుట్రపూరితంగా అబద్ధపు కేసుల్లో ఇరికించి జైలులో సరైన వైద్యం లేకుండా చేసి మృత్యు ముఖంలోకి నెట్టే అవకాశమున్నదని మా పార్టీ అనుమానం. అందుకే మా కేంద్రకమిటీ దేశంలోని, ప్రపంచంలోని పీడిత ప్రజలు మరియు జాతులు, కార్మికులు, కార్మిక వర్గ సంస్థలు, ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు, దేశభక్తులు, మానవ హక్కుల సంఘాలు కామ్రేడ్ కిషన్ దా మరియు షీలా దీలకు వెంటనే మెరుగైన వైద్యం అందజేయాలని, స్పెషలిస్టులైన డాక్టర్ల పర్యవేక్షణలో వుంచాలని, వీరిని రాజకీయ ఖైదీలుగా గుర్తిస్తూ అన్ని సౌకర్యాలను అందజేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించాలని కోరుతున్నాం. వయోవృద్ధులై అనారోగ్య పీడితులుగా ఉన్న వారిద్దరిని వెంటనే బెయిల్‌పై విడుదల చేయాలని డిమాండ్ చేయాలి. అప్పుడే ప్రజల లేదా కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో మెరుగైన వైద్య సౌకర్యం పొందుతూ కోర్టు కేసులకు హాజరవగలరు.

**విప్లవాభివందనాలతో,**

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

---

**(36వ పేజీ తరువాయి).......**

నారాయణపేట: తమ పట్టా భూములు తమకు వచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ నర్వ మండలం కొమరలింగంపల్లి, లంకాల గ్రామ రైతులు ఒక్కసారిగా కార్యాలయం గేటులోకి దూసుకొచ్చి కలెక్టరేట్‌ను ముట్టడించారు, వెంటనే పోలీసులు అడ్డుకున్నారు. రైతులు భీమా ప్రాజెక్టుకు సంబంధించిన కాల్వల కోసం సేకరించిన భూమిలో తమ భూమి కొంత ల్యాండ్ ఎక్యువేషన్ కింద పోయినా, మిగతా తమ పట్టా భూమిని ఆఫీసర్లు ప్రొహిబొటెడ్ ల్యాండ్ అని రికార్డుల్లో ఎక్కించారని, దానివల్ల తమ భూములకు ఎలాంటి హక్కులు దక్కకుండా నష్టపోతున్నామన్నారు. ధరణి వచ్చినప్పటి నుండి తమ భూములు విరాసత్ కావడం లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఏడాది నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం కలెక్టర్ ఏవోకు వినతిపత్రం అందించారు.

### స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాస్తారోకో

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, కనీస వేతనం రూ, 21000 వేలు ఇవ్వాలని స్కీమ్ వర్కర్లు దేశవ్యాప్త సమ్మెలో రామాలయం గుడి నుండి ర్యాలీగా తూప్రాన్ నర్సాపూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ, వివోఏలు, కస్తూర్బా, చైల్డ్ లేబర్, మెడికల్ అండ్ హెల్త్, విద్యారంగంలోని వివిధ కేంద్ర స్కీమ్లను బిజెపి ప్రభుత్వం బలహీనపరుస్తుంది. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించ నిరాకరిస్తుందని, కోవిడ్ కాలంలో ముందు వరుసలో పని చేసిన స్కీం వర్కర్లకు రక్షణ ఏర్పాటు, రిస్క్ అలెవెన్స్‌లు కోవిడ్ బారినపడి మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం, సర్వీసుల క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు సాంఘీక భద్రత మరియు పెన్షన్ చెల్లింపులను నిరాకరిస్తోందన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు, పౌష్టికాహారం విద్య, వైద్యం తదితర సేవలను అందిస్తూ వివిధ స్కీంలలో దేశంలో ఒక కోటి మంది తెలంగాణలో మూడు లక్షల మంది పని చేస్తున్నారని స్కీమ్ వర్కర్లను అందరినీ కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ, 21000 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐసీఎస్ సౌకర్యం కల్పించాలని, కరోనా సమయంలో చనిపోయిన స్కీమ్ వర్కర్ల కుటుంబాలకు 50 లక్షల రూపాయల ఇన్స్‌రెన్స్ ఇవ్వాలని వారి కుటుంబ సభ్యులకు ఉచిత కరోనా చికిత్స చేయాలన్న డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ఖాతరు చేయడం లేదని, ప్రభుత్వ పాఠశాలలు మూతపడడంతో వేలాది మంది మధ్యాహ్న భోజనం మరియు స్వచ్ఛ కార్మికులు ఉపాధి కోల్పోయిన వారిని ఆదోకోవడానికి ప్రభుత్వానికి చేతులు రాలేదని, ఫ్రంట్‌లైన్ వర్కర్స్‌కి 50 లక్షల ఇన్స్‌రెన్స్ గురించి గొప్పలు చెప్పిన మోడీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు, ఆశాలకు ఇన్స్‌రెన్స్ నుంచి మినహాయించారు. కార్మిక సంఘం పెట్టుకునే సమిష్టి బేరసారాలు హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చివేసిందని, పని దినాన్ని 12 గంటలకు పెంచుతూ ఆర్డినెన్స్ తెచ్చింది, అన్ని కీలక రంగాలైన బొగ్గు, రైల్వే, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్, ఇన్సురెన్స్, బ్యాంకింగ్, విమానయానం, అంతరిక్షం, ఆటోమిక్ ఎనర్జీతో సహా అన్ని రంగాల్లోకి విదేశీ పెట్టుబడులు ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలంగా తలుపులు బార్లా తెరిచింది, సహజ వనరులను తెగ నమ్మడానికి కేంద్ర ప్రభుత్వం బరితెగించి ఉందని, సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఇంకా ఉధృతం అవుతుందని హెచ్చరించారు.

### రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలి

కేంద్రం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణం చేయాలని, రైతుల పేరుతో కార్పొరేట్ సంస్థల కోసం కేంద్ర ప్రభుత్వం చేసిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టాలను రద్దు చేయాలని, రైతులకు ఉపయోగపడే చట్టం, రైతులకు రుణముక్తి చట్టం చేయాలని, వాటితో పాటు ఓపెన్‌కాస్ట్ మెనూ రద్దు చేయాలని, కౌలు రైతులు, పోడు రైతులు, అసైన్డ్ భూమలు సాగు చేసే రైతులు, వాస్తవ సాగుదారులు అందరికీ రైతు, రైతుబంధు వర్తింపచేయాలని, గ్రామంలో నివసిస్తున్న అందరికీ భూమిపై ప్రకృతి వనరులపై ఆధారపడి జీవిస్తున్న అన్ని కుటుంబాలకు రైతుభీమా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

### ఐటిడిఏను ముట్టడించిన ఆదివాసీలు

ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలంటూ ఉమ్మడి అదిలాబాద్ ఏజెన్సీ పరిధిలోని ఆదివాసీలు ఉట్నూర్ ఐటీడీఏ ముట్టడించారు. అన్ని మండలాల నుంచి వేలాది మంది ఉట్నూర్ చేరుకొని ఐటీడీఏ ఎదురుగా అదిలాబాద్, మంచిర్యాల రహదారిపై రాస్తారోకో చేశారు. దాదాపు రెండు గంటల పాటు దిగ్బంధం చేశారు. వారి రాకను ముందే గుర్తించిన పోలీసులు భారి బందోబస్తుతో ఐటీడీఏ ఆఫీసులోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. అడ్డుకున్నప్పటికీ ఆదివాసీలు ఐటీడీఏ ఆఫీసులోకి చొచ్చుకుపోయారు.

## సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం, వనరుల దోపిడి, పర్యావరణ విధ్వంసం, మానవ శ్రమ దోపిడి, సమాచారాన్ని దొంగిలించడం.

**కుళ్లి కృశించి, నశించి పోతూ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ కొన ఊపిరితో మరణశయ్యపై పడి వున్న సామ్రాజ్యవాదాన్ని మానవుల రక్తాన్ని జీవ గంజిగా పోసి బ్రతికించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.**

ఇటీవల పెగాసస్ మాల్‌వేర్ గురించి ప్రపంచ వ్యాపితంగా చర్చ జరుగుతున్నది. ప్రజల, ప్రజాస్వామిక వాదుల, ప్రగతిశీల శక్తులు, స్వేచ్ఛా ప్రియులు, విప్లవ పార్టీలు దీని గురించి తెలుసుకోవాలి. దీని ప్రమాదంను అంచనా వేసుకోవాలి. ఈ ప్రమాదం నుండి తమను తాము కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలి. దానిని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేయాలి.

నేటి పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వ్యవస్థ గొంతులోతుల్లో సంక్షోభంలోకి కూరుకపోయి, చావు బ్రతుకుల మధ్య కొట్టుకుంటున్నది. సామ్రాజ్యవాద కంపెనీలు పోటీలో సమాచార వ్యవస్థలో ఇంటర్‌నెట్ ప్రవేశపెట్టారు.

సంపదను, సమాచారంను ఒకే ఒక్క సామ్రాజ్యవాద కంపెనీ వద్ద పోగు చేసుకోవాలని పోటీ పడుతున్నారు. దానిలో భాగంగా సైన్స్‌ను సమాజాభివృద్ధి కాక తమ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నారు. దీని కారణంగా సామ్రాజ్యవాద వ్యవస్థ సమాజంను అభివృద్ధి వైపు నడిపించక పోతున్నది. దీనికి కాలం చెల్లిపోయింది. సామ్రాజ్యవాద మనుగడ ప్రపంచ మానవాళికి ప్రమాదంగా తయారయ్యింది.

ఇజ్రాయిల్ సంస్థ ఎన్‌ఎస్‌ఓ పెగాసస్ అనే మాల్‌వేర్‌ను తయారు చేసింది. ఇది 10 దేశ ప్రభుత్వాలకు అమ్మినట్లు ప్రచారం జరుగుతున్నది. పెగాసస్ ద్వారా ఇతరుల సమాచారంను దొంగిలించవచ్చు. ఇతరుల ఫోన్లలోకి, కంప్యూటర్లలోకి కొన్ని విషయాలను ప్రవేశపెట్టి వారి మీద కేసులు పెట్టవచ్చు. వారిని జైళ్ళలో పెట్టవచ్చు.

చోరీలు చేసి బ్రతికే స్థితికి సామ్రాజ్యవాదం అభివృద్ధి అయ్యింది. ఎంత రహస్యంగా పెగాసస్ వంటివి ఇతరుల కంప్యూటర్లకి ప్రవేశపెట్టి వారి సమాచారాన్ని చోరీ చేసినప్పటికీ ఈ విషయాలు ప్రపంచ ప్రజలకు తెలిసిపోతున్నాయి.

ఇజ్రయిల్ సంస్థ ఎన్‌ఎస్‌ఓ నుండి అజర్ బైజాన్, కజకిస్తాన్, మెక్సికో, మొరాకో, రూవాండా, సౌది అరేబియా, హంగరి, ఇండియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దేశాలలో పెగాసస్‌ను కొనుగోలు చేశాయి. ఈ పెగాసస్‌ను ఉపయోగించి ప్రతిపక్ష నాయకుల మీద జర్నలిస్టుల మీద, రిపోర్టర్ల మీద, ప్రగతిశీల శక్తుల మీద, విప్లవ శక్తుల మీద ఉపయోగించి వారిని అణిచివేసే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తున్నాయి.

ఇండియాలో మోడి ప్రభుత్వం ఇటువంటి ఈ దుర్మార్గ టక్కుటమారి గారడి విద్యలను 2016 నుండి ప్రారంభించింది. దీనికి ముందే ప్రభుత్వ యంత్రాంగంలోని కుట్రదారులు అజిత్ దోవాల్, అమిత్‌షా, నరేంద్ర మోడీ (నరహంతక త్రయం) లు ఒక పథకాన్ని రూపొందించుకొని దీన్ని అమలు జరుపుతున్నారు. ఎన్ఐఏను తమ కావలి కుక్కగా తయారు చేసుకొని 80సం॥ రాల వయస్సు పైబడిన వారి మీద సైతం కేసులు పెట్టి జైళ్ళలో పెట్టి హత్యలు చేస్తున్నారు. స్టాన్ స్వామి ప్రజల పక్షం వహించి ఛత్తీస్‌గఢ్ ఆందోళనలో పాల్గొన్నందుకు ఆయన మీద కక్షగట్టి జైళ్ళోపెట్టి హత్య చేశారు.

ఈ విధంగా దేశంలో బూర్జువా ప్రజాస్వామ్యం కూడా లేదని స్పష్టంగానే అర్థం అవుతున్నది. ఈ సంవత్సరం జూలై నెలలో పూర్తి పార్లమెంట్ సెషన్ కూడా ప్రతిపక్షాలు బైకాట్ చేశాయి. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు జరుగుతున్నది.

ప్రపంచ వ్యాపితంగా ఒక వైపున ప్రజల పోరాటాలు పెరుగుతున్నాయి. సామ్రాజ్యవాదం రోజురోజుకు ప్రజలకు వ్యతిరేకంగా మారి బలహీనపడుతున్నది. వ్యవస్థ పరంగా దాని కాలం పూర్తి అయ్యింది. దీని వలన పర్యావరణ సంక్షోభం పెరుగుతున్నది.

మరొకవైపున అన్ని ముసుగులు తొలగించుకొని పూర్తి ఫాసిజం రూపంలో ప్రభుత్వాలు ప్రజల మీద దాడిని కొనసాగిస్తున్నాయి. మిలటరీ, పోలీసు వ్యవస్థలను క్రూరంగా తయారు చేసుకుంటూ, రాక్షస చట్టాలను తయారు చేసుకుంటూ దానికి తోడు పెగాసస్ వంటి మాల్‌వేర్‌ను ఉపయోగించి భారీ స్థాయిలో సమాచారం చోరీ చేయతలపడున్నారు. ఇది వీరి వినాశనానికి సూచన మాత్రమే. దోపిడి వర్గాల పాలన ఇంక ఎంత కాలము కొనసాగదని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి. విప్లవ పార్టీలు తమ ప్రజా పునాదిని పెంచుకునేందుకు మంచి అవకాశాలు వున్నాయి. ఈ అనుకూల పరిస్థితిని ఉపయోగించుకోవాలి.

సామ్రాజ్యవాదం 2008లో వచ్చిన సంక్షోభం నుండి ఇప్పటి వరకు బయటపడలేదు. 2019-20లో వచ్చిన కోవిడ్ కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారి పోయింది. దీని కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల పోరాటాలు మునుపటి కంటే వేగంగా పుడుతున్నాయి, వ్యాప్తి చెందుతున్నాయి. నేడు ప్రపంచం ముందున్న మార్గాలు రెండే. ఒకటి సామ్రాజ్యవాద వ్యవస్థను ధ్వంసం చేసి నూతన సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం చేయటమా లేక సామ్రాజ్యవాద ఫాసిస్టు దారుణ మారణ కాండకు గుర్రై బలై పోవటమా ఇది ప్రపంచ ప్రజల ముందున్న సవాల్.

సమాజం ఎప్పుడూ పురోగమనంలో ఉంటుంది. ప్రజా శక్తులదే అంతిమ విజయం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విప్లవ శక్తులు, ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులు, దేశ భక్తులు, పీడిత ప్రజలు, పీడిత జాతులు ఏకం కావల్సిన సమయం వచ్చింది, వీరందరి ఐక్యతే విజయానికి గ్యారంటీ. ✪

### జూలై 28 అమరుల వారోత్సవాలను ఘనంగా జరుపుకున్న ప్రజలు

**పూజారికాంకేర్ :** జూలై 28 అమరుల వారోత్సవాలను పూజారికాంకేర్ పరిధిలోని విప్లవ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పూజారికాంకేర్, కమలం, కోమట్ పంచాయితీల ప్రజలతో ఉదయం 11 గంటలకు తుండెం గ్రామంలో విప్లవ నినాదాలతో ర్యాలీ కొనసాగింది. తెలంగాణ అమరుల జ్ఞాపకార్థంగా నిర్మించిన స్థూపం వద్దకు ప్రజలు చేరుకున్నారు. ముందుగా అమరులకు శ్రద్ధాంజలి అర్పించడం జరిగింది. ఈ సంవత్సర కాలంలో అమరులైన పది మంది జ్ఞాపకార్థ స్థూపాన్ని ఆవిష్కరించడం జరిగింది. దాని తదుపరి కామ్రేడ్ యాప నారాయణ (లక్ముదాద, హరిభూషన్) సీసీ సభ్యుడు, తెలంగాణ ఎస్‌జెడ్‌సీ కార్యదర్శి జీవిత చరిత్ర బుక్‌లెట్స్‌ను కామ్రేడ్ ఆజాద్ విడుదల చేసాడు.



ఈ సంవత్సర కాలంలో అమరులైన అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ వారి ఆశయాలను ధైర్య సాహసాలను, ఆదర్శాలను గుర్తు చేస్తూ ప్రస్తుతం శత్రువు చేస్తున్న దాడులను తిప్పికొడుతూ జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారంకై పోరాటం చేయాలని పిలుపునిస్తూ వ్యక్తలు మాట్లాడారు. ఈ సభకు కామ్రేడ్ ఆజాద్ అధ్యక్షత వహించాడు. జెఎన్‌యమ్, సీఎన్‌యమ్ కళాకారులు పాటలు, నాటికలు ప్రదర్శించారు. ఈ సభకు 1250 పురుషులు, 1260 మంది మహిళలు హాజరైన్నారు. ఈ సభకు వచ్చిన ప్రజలకు కామ్రేడ్ లక్ము దాద జీవిత చరిత్ర బుక్‌లెట్స్ ఉచితంగా పంచడం జరిగింది. ఈ సభ సాయంత్రం 6 గంటలకు ముగిసింది.

**చెన్నాపురం :** జూలై 28న అమరవీరుల త్యాగాలను ఎత్తిపడతూ అమరవీరుల వారోత్సవాలను విప్లవ ఉత్తేజంతో జరుపుకున్నారు. పుట్టేపాడు గ్రామంలో ఉదయం 12 గంటల నుండి సభ సాయంత్రం 6 గంటల వరకు జరిగింది. అమరవీరులకు ప్రజలు, పీఎల్‌జీఏ బలగాలు 2 నిమిషాలు మౌనం పాటించారు. ఏసీ కార్యదర్శి అరుణక్క ఈ ఫాసిస్టు రాజ్యం తలపెట్టిన సమాధాన్-ప్రహార్ దాడుల్లో అమరులైన కామ్రేడ్స్ ఆశయాలను, ఆదర్శాలను ఎత్తుపట్టి విప్లవంలో ముందుకు సాగాలని మాట్లాడారు. ఈ సభకు మొత్తం 600 మంది ప్రజలు వచ్చారు. సీఎన్‌యమ్ కళాకారులు పాటలు, నాటికలు ప్రదర్శించారు.

### రాజకీయ ఖైదీల విడుదలను డిమాండ్ చేస్తున్న ప్రజలు

**పూజారికాంకేర్ :** నిత్యం పోలీసు రాబందుల చుట్టూ నాలుగు గోడల మధ్య సంవత్సరాల తరబడి జీవితాన్ని గడుపుతూ చివరి శ్వాస వరకు ప్రజల పక్షాన నిలబడి ప్రాణాలు కోల్పోయిన రాజకీయ ఖైదీలకు విప్లవ జోహార్లు తెల్పుతూ సభ ప్రారంభమయ్యింది.

ఈ సభ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు జరిగింది. కామ్రేడ్ చిలుక మాట్లాడుతూ ప్రజల పక్షన నిలబడి వారి హక్కుల కోసం పోరాడుతున్న మేధావులపై, విద్యార్థులపై, ఆదివాసులపై, పీడిత ప్రజలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లో బందిస్తున్నారు. జైలు ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ సభకు 331 మంది ప్రజలు హాజరైన్నారు.

**చెన్నాపురం :** ముందుగా రాజకీయ ఖైదీలందరికీ విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సభ ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు జరిగింది. రాజకీయ ఖైదీల అనారోగ్యాలను, వారి వయస్సును పరిగణలోకి తీసుకోకుండానే విచరణ పేరుతో ఖైదీలను మానసికంగా హింస్తున్నారని కామ్రేడ్ ఏసీ కార్యదర్శి అరుణ మాట్లాడింది.



తప్పుడు సాక్ష్యాలను సృష్టిస్తూ జీవిత ఖైదీలుగా బంధిచడం సిగ్గుచేటని, సంవత్సరాల తరబడి అనారోగ్యంతో పోరాడుతూ ఇప్పటికీ జైలు గోడల మధ్య మగ్గుతున్న కామ్రేడ్ సాయిబాబాతో రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని ఏసీ కామ్రేడ్ రజిత డిమాండ్ చేసారు. ఈ సభకు 400 మంది ప్రజలు హాజరైనారు.

### పార్టీ దినొన్ని ఘనంగా జరుపుకున్న విప్లవ ప్రజలు

**పూజారికాంకేర్ :** విప్లవ నినాదాలతో ర్యాలీ ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. సెప్టెంబర్ 21 పార్టీ 17వ వార్షిక వారోత్సవాల సందర్భంగా పూజారికాంకేర్ పంచాయితీలో చిన్నూట్ల గ్రామంలో మీటింగ్ జరిగింది. ఈ సభకు కామ్రేడ్ సమ్మన్న అధ్యక్షత వహించారు.



పార్టీపై శత్రువు చేస్తున్న "సమాధాన్-ప్రహార్ దాడిని ఖండించాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ చిలుక మాట్లాడుతూ పార్టీపై, సంఘాలపై తప్పుడు ప్రచారానికి పూనుకున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రజలను మావోయిస్టుల పేరుతో సరెండర్లు చేయడం, వారి అక్రమ కేసులు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాడాలని పిలునిచ్చింది. ఈ సభకు 840కు పైగా ప్రజలు కదిలారు. సీఎన్‌యమ్, జెఎన్‌యమ్ కళాకారులు పాటలు, నాటికలు ప్రదర్శించారు.

**చెన్నాపురం :** పార్టీ 17వ వార్షిక వారోత్సవాలను గ్రామ గ్రామాన పోస్టర్, బ్యానర్స్‌తో ప్రచారంతో పాటు సెప్టెంబర్ 21న సభ నిర్వహించడం జరిగింది. విప్లవ నినాదాలతో ప్రజలు ర్యాలీ తీసారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్టీపై చేస్తున్న బహుముఖ దాడిని ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా అమాయక ప్రజలపై రాజ్యం చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ మాట్లాడింది. ఉదయం

11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. సీఎన్‌యమ్ కళాకారులు పాటలు, నాటికలు ప్రదర్శించారు. ఈ సభకు మొత్తం 500లకు పైగా ప్రజలు హాజరైనారు.

## సమాధాన్-ప్రహార్ దాడులకు వ్యతిరేకంగా మోడీ-అమిత్‌షాల దిష్టిబొమ్మ దహనం

**చెన్నాపురం :** ఫాసిస్టు నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు జరుపుతున్న 'ప్రహార్ సైనిక అభియాన్'కు వ్యతిరేకంగా నవంబర్ 24న అంతర్జాతీయ కార్యచరణ దినాన్ని విప్లవ ధృడసంకల్పంతో జయప్రదం



చేయడం జరిగింది. 24న చెన్నాపురం పంచాయితీ గ్రామాల ప్రజలు ప్రహార్ దాడిని ఖండిస్తూ ర్యాలీ తీసారు. అంతేకాకుండా చెన్నాపురంలో బేస్ పోలీస్ క్యాంపును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల వికాసం పేరుతో హిందూత్వ శక్తులు అమలు చేస్తున్న ప్రహార్ వినాశకర విధానాలను బహిర్గతం చేస్తూ మోడీ, అమిత్ షాల దిష్టి బొమ్మలను దగ్ధం చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాధాన్-ప్రహార్ దాడిని ఆపివేయాలని, జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారంకై పోరాతామని నినాదాలు ఇచ్చారు. ఈ ప్రోగాంకు 100 పైగా ప్రజలు హాజరైనారు.

## తెలంగాణలో రగులుతున్న పోడు భూముల పోరు

**మంచిర్యాల:** పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పోడు రైతులపై అటవీశాఖ అధికారుల దమనకాండను ఆపాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్ఓఎఫ్ఆర్) యాక్ట్ 2006 అటవీ హక్కుల రక్షణ చట్టం ప్రకారం జిల్లాలో పెండింగ్‌లో వున్న రైతులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూములలో ఫైనల్ పట్టాలిచ్చిన గిరిజనులకు, గిరిజనేతరులకు కొత్త పాస్‌బుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎమ్ కేసీఆర్ పోడు భూములలో వ్యవసాయం చేసుకునే వారికి పట్టాలు ఇస్తామని హామి ఇచ్చి 7సం॥ రాలు గడిచిన ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వకపోగా దుర్మార్గంగా హరితహారం, పల్లె ప్రగతి, ప్రకృతి వనం పేరుతో దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం గుంజుకుంటున్నది. రైతులు వేసిన పంటలను ధ్వంసం చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ప్రభుత్వము వెంటనే ఈ దుర్మార్గపు చర్యలను బందు ఆపుకొని అక్రమంగా అరెస్టు చేసిన రైతులందరిని వెంటనే విడుదల చేసి జిల్లాలోని 9 మండలాలలో ప్రభుత్వం తక్షణమే పట్టాదారు పాస్‌బుక్కులు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసుధన్ నాయక్‌కు పోడు భూములకు పట్టాలు జారీ చేయాలని వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

**కన్నెపల్లి:** పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని మెట్‌పల్లి గ్రామంలో ఆదివాసులు ర్యాలి నిర్వహించారు. ఎన్నో యేండ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న ఆదివాసులపై అటవీ అధికారులు దుర్మార్గంగా దాడులు చేస్తున్నారు. ఆదివాసీ హక్కులను, చట్టాలను కాలరాస్తున్నారు. అటవీ అధికారుల జులుంకు వ్యతిరేకంగా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసులు కలెక్టరేట్‌ను ముట్టడించారు.

## దళితుడి భూమి ఖబ్జా

మేడ్చల్ జిల్లాలోని మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామ నివాసి దళితుడు బందెల నర్సయ్యకు చెందిన భూమిని రెవిన్యూ అధికారులు, సర్పంచ్, పంచాయతి కార్యదర్శి కలిసి ప్రకృతి వనం ఏర్పాటు కోసం భూమిని ఖబ్జా చేశారు. 40 ఏళ్ళ క్రితం అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్ 166 । 40లో కొందరి రైతులకు భూములు కేటాయించింది. పట్టదారు పాస్‌పుస్తకాలను కూడా ఇచ్చింది. ఈ సర్వే నెంబర్‌లోనే బందెల నర్సయ్యకు 4.20 ఎకరాల భూమిని ఇచ్చింది. 40 ఏళ్ళుగా నర్సయ్య భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆ భూమిపై రెవిన్యూ అధికారి, సర్పంచ్, పంచాయతి కార్యదర్శి కన్నువేసి ముగ్గురు కలిసి దళితుడి భూమిని గుంజుకోవడానికి కుట్రచేసి ప్రకృతి వనం పేరుతో ఎకరం భూమి ఇవ్వాలని వేధిస్తున్న నర్సయ్య తన భూమిని వదిలేయాలని వేడుకున్నప్పటికీ ఆ ముగ్గురు వినకుండా ఎకరా భూమిలోని కంది చేనును ట్రాక్టర్లతో తొక్కించి పంటను నాశనం చేశారు. ఆ తర్వాత అక్కడే మొక్కలు నాటారు. తమకు జీవనాధారంగా వున్న భూమిని గుంజుకోవడంపై నర్సయ్య కుటుంబ సభ్యులు తమ భూమిని తిరిగి అప్పగించాలని ఆందోళన చేపట్టారు.

## పరిహారం చెల్లించాలని ముంపు రైతుల ఆందోళన

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో కోటపల్లి మండలం వెంచపల్లి, పుల్లగామ, సిర్రాస, అన్నారం, అర్జున్‌గుట్ట, దేవులవాడ, కొల్లురు గ్రామాలకు చెందిన రైతుల పంటలు బ్యాక్ వాటర్‌లో మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత యేడాది పుల్లగామ గ్రామానికి చెందిన రైతు పంట నీట మునిగి నష్టపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పటి వరకు ఆ కుటుంబానికి నష్ట పరిహారం ప్రభుత్వం అందించలేదు. ఆ కుటుంబానికి రావాల్సిన నష్టపరిహారాన్ని టీఆర్ఎస్ నాయకులే మింగి కుటుంబానికి మొండి చేయి చూపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో వేలాది ఎకరాల పంటలు నీటిలో మునిగిపోతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కండ్లు తెరిచి తక్షణమే ఈ ప్రాంతంలో పంట నష్టంపై సర్వే నిర్వహించి బాధిత రైతు కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముంపు బాధిత రైతులకు తక్షణమే పరిహారం చెల్లించకపోతే ప్రగతి భవన్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## ఆశా వర్కర్ల ఆందోళన

**పెంచికల్‌పేట:** దహెగామ్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. 11వ పీఆర్‌సీని ఆశా వర్కర్లకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. తమను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం 21వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కోవాడ్‌తో మృతి చెందిన ఆశా వర్కర్లకు ఒక్కొక్కరికి 50 లక్షల చొప్పున

ఇవ్వాలని స్మార్ట్‌ఫోన్స్, రిజిస్టర్స్, యూనిఫాంలు అందజేయాలని డిమాండ్ చేస్తూ మెడికల్ ఆఫీసర్ సంజుకు వినతిపత్రం అందజేశారు.

**విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికుల నిరసన**

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థల ముందు కార్మికుల, ఉద్యోగులు పెద్ద ఆందోళన నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలం చెల్పూర్‌లోని కేటీపీపీలో ఉద్యోగులు సిబ్బంది నిరసన తెలిపారు. పార్లమెంట్‌లో విద్యుత్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన రోజే దేశ వ్యాప్తంగా విధులు బహిష్కరించి మెరుపు సమ్మెకు దిగుతామని జాతీయ విద్యుత్ ఉద్యోగులు హెచ్చరించారు. ఖైరతాబాద్ ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ సౌదాలో ధర్నా నిర్వహించారు. విద్యత్ ఉద్యోగులు, కార్మికులు, ఇంజనీర్లు మింట్ కంపౌండ్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు మహా ధర్నా నిర్వహించారు. భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ 5-6-7 దశలల్లో ఉద్యోగులు, ఇంజనీర్లు, కార్మికులు విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లు పెట్టే ప్రతిపాదనను విరమించుకోకపోతే దేశ వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేసి ప్రభుత్వానికి గుణపాఠం నేర్పి మాసత్తా చాటుతామని హెచ్చరించారు.

**ఉద్యోగాల కోసం యువకుల రాస్తారోకో**

సింగరేణి కార్మికులకు సర్వీస్ జీతం లేదా 5 లక్షలు కాని తీసుకొని ఉద్యోగాల నుండి తొలగిపోవాలని యజమాన్యం కార్మికులకు లెటర్స్ ఇచ్చారు. దీనితో కార్మికుల పిల్లలకు సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు కోల్పోవలసి వస్తుంది. దీన్ని వ్యతిరేకిస్తూ కార్మికుల పిల్లలు కారుణ్య నియామకాలు చేపట్టి సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహిస్తూ ఆందోళనకు దిగారు.

**భూమి తీసుకోవద్దని దళితుల నిరసన**

పల్లె ప్రకృతి వనం పేరుతో తాము సాగు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వం తీసుకోవద్దని రాంపూర్ ఎస్టీ కాలనీ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న హామీని ప్రభుత్వం నిలుపుకోలేదని, దళితుల భూములను లాక్కునేందుకే ప్రయత్నిస్తోందని, ప్రభుత్వం పల్లె ప్రకృతి వనం పేరుతో సాగు భూమిలో మొక్కలు నాటుతున్నారని, పట్టాదారు పుస్తకాలను చూపించిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

**మిషన్ భగీరథ కార్మికుల ధర్నా**

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధవోరా వాటర్ ప్లాంట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని, బోనస్ పిపిఈ కిట్స్, కనీస వేతనం రూ.21 వేలు, పెట్రోలు, ఫోన్ అలవెన్స్‌లు, ఐడీ కార్డు, ఈసీఎఫ్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ప్రదర్శన**

పదవి విరమణ ప్రయోజనాలు, పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బస్ భవన్ వద్ద శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని బకాయిలు వెంటనే చెల్లించి వయో వృద్ధులను ఆదుకోవాలని నినదించారు. ఆర్టీసీ ఉద్యోగులకు మూడేళ్ళుగా బకాయిలు చెల్లించకపోవడంతో 10 వేల మంది ఇబ్బందులు పడుతున్నారని సీసీఎస్‌కు బకాయిలు పడిన రూ.1080 కోట్లు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**కలెక్టరేట్ ఎదుట ధర్నా**

**అసిఫాబాద్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రైతు, కార్మిక చట్టాలను, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రజా వ్యతిరేక విద్యుత్ సవరణలు ఆపాలని డిమాండ్ చేశారు.

**కాగజ్‌నగర్ టౌన్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని మండి పడ్డారు. ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ, రైతులకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

***బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఆపివేయాలి***

బొగ్గు గనుల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల సవరణను వెంటనే ఆపివేయాలని బెల్లంపల్లి ఏరియాలోని డిపార్ట్‌మెంట్, సిహెచ్‌పీలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

**పోడు సమస్యలపై కలెక్టరేట్ ముట్టడించిన రైతులు**

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసులు అడ్డుకోవడంతో ప్రజలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఆఫీసర్లు వినతి పత్రం తీసుకోకపోవడంతో కలెక్టర్ చాంబర్ గోడకు వినతి పత్రాన్ని అంటించి నిరసన తెలిపారు. ముందు నుండి పట్టాలు వున్న భూమిని కూడా తెలంగాణ ప్రభుత్వం గుంజుకుందని విమర్శించారు. కేటీఆర్ నియంతగా వ్యవహరిస్తున్నారని, ఫారెస్టు ఆఫీసర్లు అధికార పార్టీకి వంత పాడుతున్నారని మండిపడ్డారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తరతరాలుగా భూములను సాగుచేస్తూ, వ్యవసాయమే జీవనాధారంగా పంటలు పండించుకుంటున్న పోడు రైతులను వేధించడం, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తిలో వనపర్తిలో జిల్లా సదస్సు నిర్వహించి డిమాండ్ల వినతి పత్రాన్ని కలెక్టరేట్‌కు అందజేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

**పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలి.**

ములుగు: పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 84 వేల ఎకరాల్లో 40 యేండ్లుగా గిరిజనులు, గిరిజనేతరులు సాగు చేసుకుంటున్నారని, 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 ముందు నుంచి సాగులో ఉన్న వారికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ హామీలు వచ్చి తదనంతరం విస్మరిస్తున్నారని విమర్శించారు. పోడు రైతులపై అటవీశాఖ అధికారుల దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోడు రైతులకు పట్టాలివ్వాలని, అటవీశాఖ అధికారుల దాడులు నిలిపివేయాలని, రైతుబంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**భూములు ఇవ్వాలని కలెక్టరేట్ ముట్టడి**

(మిగతా 32వ పేజీలో........)

(40వ పేజీ తరువాయి).....

## సాహసోపేతంగా పురోగమించండి

**(ఆయన తత్వశాస్త్ర ఆచార్యుడు. విశ్వవిద్యాలయంలో పాఠాలు చెప్పేవాడు. ప్రజల దగ్గర పాఠాలు నేర్చుకోడానికి యూనివర్సిటీని వదిలేశాడు. నేర్చుకోవడం అంటే నేర్పించడం అనే గతితర్కం తెలిసినవాడు. ప్రజలకు రాజకీయాలు నేర్పించాడు. ఆయనే పెరూ విప్లవ నాయకుడు కా॥ గొంజాలో. ఆదేశంలో ప్రజాయుద్ధ మార్గదర్శి. పథ నిర్దేశకుడు. ఆయన నాయకత్వంలో పెరూ ప్రపంచ పీడిత వర్గానికి ఆశారేఖలాగా వెలుగొందింది. ఆ ఉద్యమాన్ని దెబ్బతీయడానికిఅమెరికా, పెరూ పాలకవర్గాలు ఆయనను నిర్బంధించాయి. ముప్పై ఏళ్లుగా కఠిన కారాగార శిక్ష అనుభవిస్తూ ఈ నెల 11న అమరుడయ్యాడు. ఆయన ప్రజలకు ఈ కాలపు ప్రపంచ మేధావుల్లో ఒకరు. ఆయన 1992లో చేసిన ప్రసంగం ఇది.)**

మిత్రులారా.. యోధులారా..

మనం చారిత్రాత్మక క్షణాల్లో జీవిస్తున్నాము, ఈ విషయం మనందరికి తెలుసు. మనల్ని మనం మోసం చేసుకోవద్దు. ఈ క్షణాల్లో మనం కష్టాలను ఎదుర్కోవడానికి, కర్తవ్యాలను కొనసాగించడానికి అన్ని శక్తులను బలోపేతం చేయాలి. మనం లక్ష్యాలను సాధించాలి! మనం సఫలం కావాలి. విజయం సాధించాలి. మనం ఇక్కడ ప్రజల బిడ్డలుగా ఉన్నాం. మనం ఈ కందకాలలో పోరాడుతున్నాం. వారు కూడా పోరాట కందకాలు. మనం కమ్యూనిస్టులమైనందుకు పోరాడతాం! మనం ప్రజల ప్రయోజనాలను, ఉద్యమ సూత్రాలను, ప్రజల యుద్ధాన్ని కాపాడుతున్నాం. కాబట్టి మనం చేసింది, చేస్తున్నది అదే. అలాగే కొనసాగిస్తాము!

ఈ పరిస్థితుల్లో మనం ఇక్కడ ఉన్నాం. ఇది పెద్ద ఓటమి అని కొందరు అనుకుంటారు. వారు కలలు కంటున్నారు! కలలు కంటూ వుండమని మనం వారికి చెప్తాం. ఇది కేవలం ఒక మలుపు, మరేమి కాదు, రహదారిలో ఒక మలుపు అంతే! రహదారి సుదీర్ఘంగా వుంది. మనం చేరుకుంటాము. మనం విజయం సాధిస్తాం! మీరు దాన్ని చూస్తారు! మనం మూడవ సమావేశంలో నిర్ణయించుకున్న కర్తవ్యాలను కొనసాగించాలి. అది మహత్తరమైన సభ. ఈ నిర్ణయాలు ఇప్పటికే అమలవుతున్నాయని, యికముందు కొనసాగుతాయని మీరు తెలుసుకోవాలి. అధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి నాలుగవ ప్రజాయుద్ధ వ్యూహాత్మక అభివృద్ధి ప్రణాళికను అమలు చేస్తాం. అధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఆరవ పోరాట ప్రణాళికను అభివృద్ధి చేస్తాం. ఇది ఒక కర్తవ్యం! మనం కాబట్టి శ్రామికవర్గం పట్ల, ప్రజల పట్ల బాధ్యులం కాబట్టి కొనసాగిస్తా! ఈ రోజు ప్రజాస్వామిక రహదారి విముక్తి రహదారిగా, ప్రజా విముక్తి రహదారిగా అభివృద్ధి చెందడం ప్రారంభమైందని మనం స్పష్టంగా చెబుతున్నాం! ఆ పరిస్థితుల్లో మనం వికసిస్తున్నాం. మనం గొప్ప చారిత్రక భావనతో ఆలోచించాలి. మనం కళ్ళు మూసుకొవడం మానేయాలి. మనం వాస్తవికతను చూద్దాం, పెరూ చరిత్రను చూద్దాం. గత మూడు శతాబ్దాల పెరూను చూద్దాం. మనం దాని గురించి ఆలోచించాలి. 18వ శతాబ్దం చూడండి. 19వ శతాబ్దం చూడండి, 20వ శతాబ్దం చూడండి, వాటిని అర్థం చేసుకోండి! వాటిని అర్థం చేసుకోనివారు అంధులు అవుతారు. అంధులు దేశానికి సేవ చేయరు, వారు పెరూకి సేవ చేయరు! 18వ శతాబ్దం మనకు నేర్పిన పాఠం చాలా స్పష్టంగా వుంది అని మనం విశ్వసిస్తున్నాం. దీని గురించి ఆలోచించండి. మనపై ఆధిపత్యం చెలాయించే దేశం ఒకటి వుంది. అది స్పెయిన్, ఆ రక్తపాత ఆధిపత్యం మనను ఎక్కడకు తీసుకువచ్చింది? ఒక తీవ్రమైన సంక్షోభం పర్యవసానంగా పెరూ విభజితమైంది. అక్కడి నుంచే నేటి బొలీవియా మూలాలు వచ్చాయి. ఇది మన ఆవిష్కరణ కాదు వాస్తవం. గత శతాబ్దం ఆంగ్లేయుల ఆధిపత్యం వుండింది. ఫ్రాన్స్‌తో వారి పోటీ మనల్ని ఎక్కడికి తీసుకెళ్ళింది? మరొక పెద్ద సంక్షోభంలోకి, గత శతాబ్దం 70లలో ఫలితం? చిలీతో యుద్ధం. మనం దాన్ని మర్చిపోకూడదు! అపుడు ఏమైంది? మనం భూభాగాన్ని కోల్పోయాము. వీరులు ప్రజలు రక్తం చిందించినప్పటికీ మన దేశం విభేదాలను ఎదుర్కొంది. మనం దీని నుండి నేర్చుకోవాలి! 20వ శతాబ్దంలో మనం ఎలా వున్నాం? మనపై సామ్రాజ్యవాదం ఆధిపత్యం చెలాయిస్తోంది. ప్రధానంగా ఉత్తర అమెరికా. ఇది వాస్తవం, అందరికీ తెలుసు. అది మనల్ని ఎక్కడికి నెట్టింది? పెరూ ప్రజలు మొత్తం చరిత్రలో అత్యంత ఘోరమైన సంక్షోభంలోకి, 1920లను గుర్తు చేస్తోంది. గత శతాబ్దాల మనం పాఠం నేర్చుకొని, ఏం తెలుసుకోవాలి? మరోసారి దేశం ప్రమాదంలో ఉంది, మరోసారి గణతంత్రం ప్రమాదంలో ఉంది, మరోసారి మన భూభాగం ప్రమాదంలో ఉంది, స్వప్రయోజనాలనాశించేవారి ద్వారా సులభంగా కోల్పోవచ్చు, ఇదీ పరిస్థితి, ఇక్కడికే వారు మనని తీసుకువచ్చారు. కానీ మనకు, పెరూలో విప్లవం, ప్రజాయుద్ధం అనే ఒక వాస్తవం ఉంది. అది ముందుకు సాగుతోంది. అలాగే కొనసాగుతుంది. దీనితో మనం ఎక్కడికి వచ్చాము? వ్యూహాత్మక సమతౌల్యానికి, మనం దీనిని బాగా అర్థం చేసుకోవాలి. ఇది వ్యూహాత్మక సమతౌల్యత! తప్పనిసరి పరిస్థితుల్లో తనను తాను పటిష్టం చేసుకుంటుంది. 12 సంవత్సరాలు దేనికోసం పనిచేసాం? పెరూ రాజ్యం, పాత పెరూ రాజ్యం, ఇది పూర్తిగా కుళ్ళిపోయిన కాగితపు పులి అని ప్రపంచం ముందు, ప్రధానంగా పెరూ ప్రజల ముందు స్పష్టంగా చూపించడానికి; అది నిరూపితమైంది! విషయాలు ఆవిధంగా వుంటే, జాతి, దేశం విభజించవచ్చు, దేశం ప్రమాదంలో వుందని ఆలోచించాలి. వారు దానిని విడదీయాలనుకుంటున్నారు. విభజించాలనుకుంటున్నారు. అలా ఎవరు చేయాలనుకుంటున్నారు? ఎప్పటిలాగే సామ్రాజ్యవాదం, దోపిడిదారులు, పాలకులు, మరి మనం ఏమి చేయాలి? ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి? ప్రజాయుద్ధం ద్వారా ప్రజా విముక్తి ఉద్యమాన్ని అభివృద్ధి చేయడం, ముందుకు తీసుకెళ్ళడం అనేది సముచితమైనది. ఎందుకంటే ప్రజలు, ఎల్లప్పుడూ ప్రజలే దేశాన్ని, జాతిని రక్షించే వారు. ఇది పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ ఏర్పాటు చేసే సమయం, ప్రజా గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసే సమయం,

ప్రజా గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసే, ప్రజా గెరిల్లా సైన్యాన్ని ప్రజా విముక్తి సైన్యంగా అభివృద్ధి చేసే సమయం. ఇదే మనం చేయాల్సింది, మనం చేస్తాం! మనం చేస్తున్నది అదే. మనం చేసేది అదే! పెద్దమనుషులైన మీరందరూ అందుకు సాక్షులుగా ఉంటారు. చివరగా ఇపుడు, ఇది వినండి. ప్రపంచంలో మనం చూస్తున్నట్లుగా, మావోయిజం ప్రపంచ శ్రామిక విప్లవ కొత్త తరంగాన్ని నడిపించడానికి తీరుగులేని యాత్ర చేస్తోంది. బాగా వినండి, అర్థం చేసుకోండి! చెవులు వున్నవారు వాటిని ఉపయోగించండి. అవగాహన ఉన్నవారు? మనందరికీ ఉంది? దాన్ని ఉపయోగించండి. ఇక ఈ నిర్ధారకత చాలు. ఈ అస్పష్టతలు చాలు! దానిని మనం అర్థం చేసుకుందాం! ప్రపంచంలో ఏం జరుగుతోంది? మనకు ఏం కావాలి? మావోయిజం అవతరించాల్సిన అవసరం ఉంది, అవతరిస్తోంది, రాబోయే ప్రపంచ శ్రామికవర్గ విప్లవపు ఈ నూతన మహత్తర తరంగాన్ని నడిపించడానికి నేతృత్వాన్నందించడానికి కమ్యూనిస్టు పార్టీలను నిర్మించాలి. వారు మనకు చెప్పినదంతా “నూతన శాంతి యుగం” అనే శూన్య, అనాలోచిత కబుర్లు. ఇపుడు ఇది ఎక్కడ వుంది? యుగోస్లోవియా విషయం ఏమిటి? ఇతర ప్రదేశాల గురించి ఏమిటి? అది అబద్ధం. ప్రతీది రాజకీయంగా మారింది. నేడు ఒక వాస్తవికత ఉంది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధం పోటీదారులలే కొత్త మూడవ ప్రపంచ యుద్ధాన్ని సిద్ధం చేస్తున్నారు. మనం ఇది తెలుసుకోవాలి. అణచివేతకు గురైన జాతి బిడ్డలుగా మనం దోపిడిలో భాగం. అందుకు మనం అంగీకరించలేం! సామ్రాజ్యవాద దోపిడి యిక చాలు! అంతం చేయాలి! మనం మూడవ ప్రపంచానికి చెందినవాళ్లం, అందుకని, కమ్యూనిస్టు పార్టీలు శాసించి, నాయకత్వం మహిస్తాయనే ఒక షరతుతో మూడవ ప్రపంచం అంతర్జాతీయ శ్రామిక విప్లవానికి ఆధారంగా వుంటుంది! అదే మనం చేయవలసింది! వచ్చే ఏడాది చైర్మన్ మావో శతజయంతి వార్షకోత్సవం. మనం ఈ 100 సంవత్సరాల ఉత్సవాన్ని జరుపుకోవాలి! మనం కమ్యూనిస్టు పార్టీలతో జరుపుతున్నాం. మనం ఒక కొత్త పద్ధతిలో, ప్రపంచ విప్లవంలో చైర్మన్ మావో ప్రముఖ్యతను సచేతనంగా అర్థం చేసుకునేలా వేడుకను జరపాలనుకుంటున్నాం. మనం వేడుకను ఈ సంవత్సరం ప్రారంభించి, మరుసటి సంవత్సరం పూర్తి చేస్తాం. ఇది గొప్ప వేడుక. అంతర్జాతీయ శ్రామికులు, ప్రపంచంలోని అణగారిన దేశాలు, విప్లవకర అంతర్జాతీయ ఉద్యమానికి సెల్యూట్ చేయడానికి నేను ఈ అవకాశాన్ని సదివనియోగం చేసుకోవాలనుకుంటున్నాను.

---

## పీఎల్‌జీఏ 21వ వారోత్సవాలను 2021 డిసెంబర్ 2 నుండి 8 వరకు విప్లవోత్సహంతో ఘనంగా జరపండి.

భారత విప్లవోద్యమ నిర్మాతలు మన పార్టీ సంస్థాపకులు, ఉపాధ్యాయులు, అమరులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హాయ్ చటర్జీల దిశ నిర్దేశంలో, భారత పాలక వర్గాలకు కంటిలో కునుకు లేకుండా దీర్ఘకాలిక ప్రజా యుద్ధ మార్గంలో, నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంకై పోరాడుతూ అమరులైన కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీల స్ఫూర్తితో వేలాది అమరుల కలలను సాకారం చేయడానికి, వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడానికి 2000 డిసెంబర్ 2న మన పీఎల్‌జీఏ నిర్మాణం అయ్యింది. భారత విప్లవంను పరిపూర్తి చేయడానికి మన పార్టీ నాయకత్వంలో ప్రజా సాయుధ శక్తిగా 21 ఏళ్ల క్రితం పీఎల్‌జీఏ ఏర్పడింది. పీఎల్‌జీఏ అనేక విజయాలు సాధిస్తూ అది నేటికి 21 వసంతాలను పూర్తి చేసుకున్నది. పీఎల్‌జీఏ విజయాలను ఎత్తిపడుతూ, దాని పోరాట శక్తిని పెంపొందించడానికి, పెంచడానికి తీవ్రంగా కృషి చేయడానికి కంకణబద్ధులం కావాలి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పీఎల్‌జీఏ 21 ఏళ్ల వారోత్సవాలను ఘనంగా జరుపుకోవాలి.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీ, పీడనల నుండి మన దేశాన్ని విముక్తి చేసి అంతిమంగా సోషలిజాన్ని స్థాపించే లక్ష్యంతో సాగుతున్న పీఎల్‌జీఏలో యువతి, యువకులు చేరాలని పిలుపునిస్తున్నాం.

రాష్ట్రంలో కేసీఆర్ విధానాలను తలదన్ని ప్రజలు డిసెంబర్ 2న పీఎల్‌జీఏ వారోత్సవాలను గ్రామ గ్రామాన జరుపుకోవాలని పిలుపునిస్తున్నాం!

గ్రామ గ్రామాన, బస్తీలలో, పట్టణాలలో, పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు, పత్రిక ప్రకటనలతో జిల్లాలలో, ఏరియాలలో ప్రచారం చేయాలి. యువతి-యువకులు ప్రజా విముక్తి సైన్యంలో చేరాలి. ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు ఒరిగేది ఏమీ లేదు.

సమాధాన్-ప్రహార్ దాడిని ఓడిద్దాం! అంతిమ విజయం ప్రజలదేనని చాటుదాం!



సింగరేణి కార్మికులు



ఫారెస్టు అధికార్లను అడ్డుకుంటున్న పోడు రైతులు





మహబూబ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీ సెక్రటరీలు



వనపర్తి కలెక్టరేట్ ఎదుట..



దుక్కులు దున్నుతున్న గిరిజన రైతులను అడ్డుకుంటున్న ఖానాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు



గంగాధర ప్రధాన రహదారిపై నిరసన చేస్తున్న ముంపు గ్రామాల రైతులు







ఖమ్మం జిల్లా ఎల్లన్న నగర్‌లో గిరిజన రైతుల పోరు





# అమెరికా సామ్రాజ్యవాదులను గడగడలాడించిన పెరూ కమ్యూనిస్టు పార్టీ (పిసిపి) నాయకుడు కామ్రేడ్ గొంజాలోకు విప్లవ జోహార్లు

పెరూ దేశం దక్షిణ అమెరికా ఖండంలోని వెనుకబడిన అర్ధ వలస అర్ధ భూస్వామ్య దేశం. ఈ దేశంలో మార్యాటెగుయు నాయకత్వంలో 1928 అక్టోబర్ 7వ తేదీన పెరూ కమ్యూనిస్టు పార్టీని (పిసిని) స్థాపించారు. విప్లవం అనేక కష్టనష్టాలతో కూడుకున్నదని దీర్ఘకాలిక స్వభావం కలిగి వుంటుందని చెపుతూ పెరూ విప్లవాన్ని నడిపిస్తున్న క్రమంలోనే 1930 ఏప్రిల్‌లో మార్యాటెగుయు మరణించాడు.



మార్యాటెగుయు మరణం తర్వాత రావిన్స్ పార్టీ నాయకత్వాన్ని చేపట్టి పార్టీని రివిజనిస్టుగా మార్చి ఎన్నికల మార్గంలోకి తీసుకవెళ్ళాడు. పార్టీలో రివిజనిజానికి వ్యతిరేకంగా అంతర్గత పోరాటం చేస్తూ కామ్రేడ్ గొంజలో 1969-76 మధ్యలో పెరూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని చేపట్టి "ప్రజాయుద్ధం కోసం పార్టీని పునర్ వ్యవస్థీకరించండి" "ఎన్నికలను బహిష్కరించండి" "సాయుధ పోరాటం ఆరంభించండి" "విముక్తి ప్రాంతాలను నిర్మించండి" వంటి నినాదాలను ఇస్తూ పార్టీని పునర్ నిర్మించాడు. ప్రజాయుద్ధాన్ని చేయటానికి సన్నాహాలు చేస్తూ దేశ వ్యాప్తంగా ఒకే రోజున సాయుధ పోరాటాన్ని ప్రారంభించి ప్రజలను విప్లవ మార్గం పట్టించాలని నిర్ణయించాడు.

పెరూ దేశంపై అమెరికా సామ్రాజ్యవాదుల దోపిడి అధికంగా వుంది. ఈ దేశ పాలకవర్గాలు అమెరికా సామ్రాజ్యవాదులతో అంటకాగుతూ దేశ సంపదలను దోచుకపోవడానికి పూర్తిగా సహకరిస్తూ ప్రజలను దోపిడి పీడనలకు గురి చేస్తుండడంతో అమెరికా సామ్రాజ్యవాదులపై వారికి సహకరిస్తున్న దోపిడి పాలక వర్గాలపై ప్రజలు కోపావేశాలతో రగిలిపోయారు.

1980 మే 17న పెరూ కమ్యూనిస్టు పార్టీ గొంజాలో నాయకత్వంలో ప్రజాయుద్ధాన్ని ప్రారంభించారు. ప్రజా గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా అనేక అందోళనలు, ఘటనలు చేశారు. సిబిబి భూస్వాముల ఆస్తులు ధ్వంసం చేశారు. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలను కదిలించి ఊరేగింపులు, సభలు జరిపారు. సాయుధ పోరాటానికి పిలుపు ఇస్తూ పాటలు పాడారు, బ్యానర్లు కట్టారు, ఎర్ర జెండాలు ఎగురవేశారు. దేశ వ్యాప్తంగా ఒక మంచి ప్రభావం వేసి ప్రజల మనసుల్ని గెలుచుకున్నారు.

పెరూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాలలో, నగరాలలో దేశమంతటా ప్రజా పోరాటాలను, ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేసింది. 1985లో సిబిబి భూస్వాముల భూములను స్వాధీనం చేసుకోండి అని పిలుపును ఇచ్చి 1,60,000 మంది రైతుల్ని సంఘటితం చేసి భూస్వాముల నుండి 3,20,000 హెక్టార్ల భూమిని స్వాధీనం చేసుకొని రైతులకు పంచిండ్రు. 1991లో ప్రజా గెరిల్లా సైన్యాన్ని, ప్రజా విముక్తి సైన్యంగా మార్చారు. విముక్తి ప్రాంతాలను ఏర్పర్చారు. ప్రజాయుద్ధం వ్యూహాత్మక ప్రతిష్ఠంభన దశలోకి వెళ్ళిందని చెప్పారు.

పెరూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పెరుగుతున్న ప్రజాయుద్ధాన్ని చూసి అమెరికా సామ్రాజ్యవాదులకు భయం పట్టుకుంది. నాయకత్వాన్ని నష్టపర్చడం ద్వారా ప్రజాయుద్ధాన్ని దెబ్బ కొట్టాలని కుట్రలు చేసింది. 1992 సెప్టెంబర్ 12న లీమా నగరంలో పార్టీ కార్యదర్శి కామ్రేడ్ గొంజలోతో పాటు మరో ఇద్దరు మహిళా కేంద్ర కమిటి సభ్యులను అరెస్టులు చేసి ఎతుకెళ్లి రహస్యంగా జైళ్లో బంధించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు కామ్రేడ్ గొంజాలో అమరుడు అయ్యేంత వరకు ప్రపంచానికి తెలియనీయకుండా అమెరికా సామ్రాజ్యవాదులు, దోపిడి ప్రభుత్వం జాగ్రత్త పడుతూ కామ్రేడ్ గొంజాలోని పెరూ కమ్యూనిస్టు పార్టీని బలహీన పర్చడానికి ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినప్పటికీ, మానసికంగా వేధించినప్పటికీ కామ్రేడ్ గొంజాలో తన ధృఢసంకల్పాన్ని విడవకుండా ప్రలోభాలకు లొంగకుండా విప్లవంపై అచెంచెల విశ్వాసంతో వుంటూ పార్టీ పంథా పట్ల అంకిత భావంతో కమ్యూనిజాన్ని 29 ఏళ్లుగా స్వప్నిస్తూ అక్టోబర్ 11వ తేదీన అనారోగ్యంతో తుది శ్వాస విడిచాడు. కామ్రేడ్ గొంజాలో అమరత్వం పెరూ విప్లవోద్యమానికి, అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవోద్యమానికి కూడా తీవ్రమైన నష్టం కలిగించింది. కామ్రేడ్ గొంజాలో ధృఢసంకల్పం ఉన్నతమైన ఆశయశం బోల్షివిక్ పట్టుదల వినమ్రత విప్లవం పట్ల ఆత్మవిశ్వాసం పార్టీ పట్ల అంకిత భావం ప్రపంచ విప్లవకారులందరికీ ఆదర్శం. కామ్రేడ్ గొంజాలో అమర్ హై !

(మిగతా 37వ పేజీలో.....)